అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 11-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 69 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మార్చిలోనే భానుడి భగభగ



40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

వివరాలు 5లో



అసెంబ్లీ హుందాతనాన్ని పెంచేలా ఏర్పాట్లుండాలి

సభ్యులడిగే సమాచారాన్ని త్వరగా ఇవ్వాలి

సమాధానాలను ముందుగా అందజేయాలి

ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోండి : అసెంబ్లీ ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మంత్రులు, సభ్యులందరూ హాజరుకావాలి : మండలి చైర్మెన్ గుత్తా

శాఖల వారీగా నోడల్ అధికారులు : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 13లో

రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఉదయం 11 గంటలకు ప్రారంభం

ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

13న ధన్యవాద తీర్మానం, బీఏసీ

10 రోజులకుపైగా నిర్వహించే అవకాశం : ఏర్పాట్లపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష

గత సమావేశాల్లో సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకూ రాతపూర్వక సమాధానాలిప్పించాలని ఆదేశం

అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచన 13లో

నిధులకోసం అవసరమైతే ఢిల్లీలో ధర్నా

39 సార్లు కాదు...99 సార్లు హస్తినకు పోతా

- రాష్ట్రానికి నిధులిప్పిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా
- కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు కట్టి ఉంటే ఇప్పుడీ సమస్య వచ్చేది కాదు : మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి



ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధుల కోసం అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తాను ఢిల్లీకి పదే పదే వెళ తున్నానంటూ ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. 39 సార్లు కాదు... 99 సార్లు హస్తినకు వెళతానని స్పష్టం చేశారు. రాష్ట్రానికి నిధులిప్పిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సన్మానం చేసేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర నీటి వాటాను పూర్తిగా ఉపయోగించుకునేందుకు వీలుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి ఉంటే ప్రస్తుతం సమస్య వచ్చేదే కాదని అభిప్రాయపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎల్పీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బీజేపీకి పూర్తిగా లొంగిపోయారని సీఎం ఈ సందర్భంగా ఆరోపించారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ సీటులో ఆయన దగ్గరుండి బీజేపీకి ఓట్లు వేయించారని తెలిపారు. అందుకే తమ పార్టీ సిట్టింగ్ సీటును కోల్పోయిందని ఆవేదన ...5లో

రూ.వేల కోట్ల టీడీఆర్ స్కాంకు సీఎం కుట్ర

- ఆయన చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు
- తక్కువ రేటుకు కొని ఎక్కువ రేటుకు విక్రయం
- చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



6లో..

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఐదు నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం శాసనమండలిలోని అసెంబ్లీ కార్యదర్శి కార్యాలయంలో అధికార పార్టీ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయగా పలువురు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. అదే విధంగా సీపీఐ నేత నెల్లికుంట్ల సత్యం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ దాఖలు ...6లో

దద్దరిల్లిన పార్లమెంట్

లోక్‌సభలో ఎన్ఈపీ...రాజ్యసభలో డీలిమిటేషన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో ఉభయసభలు దద్దరిల్లాయి. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ), త్రిభాషా విధానం, డీలిమిటేషన్ అంశాలపై పార్లమెంట్ ఉభయ సభలూ అట్టుడికాయి. లోక్‌సభలో ఎన్ఈపీ, త్రిభాషా విధానంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. రాజ్యసభలో డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడులోని డీఎంకేపై విమర్శలు చేయడంతో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. డీఎంకే, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నిరసనకు దిగడంతో 30 నిమిషాల పాటు సభ వాయిదా పడింది. పీఎం స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంపై అడిగిన ఒక ప్రశ్నకు.. తమిళనాడు ప్రభుత్వం రెండు నాల్కల ధోరణితో వ్యవహిస్తున్నదని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుపట్టారు. ఎంఓయూపై సంతకం చేసేందుకు మొదటి అంగీకరించిన తమిళనాడు ప్రభుత్వం ఇప్పుడు వైఖరి మార్చుకుందన్నారు. కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ సహా పలు బీజేపీయేతర ...5లో

అంగన్‌వాడీ, మిడ్ డే మీల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ డిమాండ్



అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించిన ఆందోళనలపై చర్చలు జరపాలని డీఎంకేకు చెందిన తిరుచ్చి శివ, పి.విల్సన్, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీలు సంతోష్ కుమార్, పిపి సునీర్, ఎండీఎంకే ఎంపీ వైకో డిమాండ్ చేశారు. టీఎంసీ సభ్యులు సాకేత్ గోఖలే, ...5లో

ప్రణయ్ హంతకునికి ఉరిశిక్ష

నల్లగొండ జిల్లా కోర్టు సంచలన తీర్పు

మరో ఆరుగురికి జీవిత ఖైదు, జరిమానా

నల్లగొండ అదనపు జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు తుది తీర్పు

కోర్టు వద్ద భారీ పోలీస్ బందోబస్తు

ప్రతి ఆధారాన్నీ కోర్టుకు సమర్పించాం : పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ



(ఫైల్)

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మిర్యాలగూడ పట్టణంలో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్ కులదురహంకార హత్య కేసులో సోమవారం నల్లగొండ అదనపు జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు తుది తీర్పు ప్రకటించింది. ప్రణయ్ హత్య కేసులో మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించగా.. ఏ1గా ఉన్న మారుతీరావు ఇప్పటికే ఆత్మహత్య చేసుకున్నారు. ఏ2 సుభాష్ శర్మకు మరణ శిక్ష, మిగతా ఆరుగురికి జీవిత ఖైదు, జరిమానా విధించినట్టు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జనవరి 31న అమృత, ప్రణయ్ కులాంతర వివాహం చేసుకున్నారు. కూతురిపై అమితమైన ప్రేమ.. కులాంతర వివాహం ఇష్టంలేని అమృత తండ్రి మారుతీరావు ప్రణయ్‌ను హత్య చేసేందుకు హంతకులకు సుపారీ ఇచ్చాడు. 2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రి వద్ద మాటు వేసిన నిందితులు ప్రణయ్‌ను అతి కిరాతకంగా చంపారు. దీనిపై మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి ఫిర్యాదు చేశారు. నిందితులు 8 మందిపై అండర్ సెక్షన ఎస్302 ఆర్ రెడ్ విత్ 34, 120(బి) రెడ్ విత్ 109 ఐపీసీ) (వి) ఆఫ్ ...5లో

కనువిప్పు కలగాలి : ప్రణయ్ తండ్రి

ఈ తీర్పుతోనైనా నేరస్తులకు కనువిప్పు కలగాలని ప్రణయ్ తండ్రి బాలస్వామి అన్నారు. ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు నేపథ్యంలో సోమవారం మిర్యాలగూడలోని ప్రణయ్ సమాధి వద్ద ఆయన తండ్రి బాలస్వామి, తల్లి ప్రేమలత పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాలస్వామి మీడియాతో మాట్లాడారు. "ప్రణయ్ హత్యతో మేం చాలా కోల్పోయాం. ఇలాంటి హత్యలు జరగడం విచారకరం. ఈ తీర్పుతో కుల దురహంకార హత్యలు ఆగాలి" అని అన్నారు.

రైతు కన్నీళ్లు పట్టని ప్రభుత్వం

చెరువులు, కుంటలను నింపి రైతులను ఆదుకోవాలి

ఎండిన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

సీఎం పర్యటనలోపే చెరువులు, కుంటలు నింపాలి

కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని దోచిపెట్టే పనిలో బీజేపీ

ప్రజా వ్యతిరేకత కూడగట్టుకుంటున్న కేంద్రం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

జనగామ జిల్లాలోని పలు మండలాల్లో ఎండిన పంటల పరిశీలన



నవతెలంగాణ - స్టేషన్ ఘనపూర్, జనగామ

రైతులు పండించిన పంటలకు ఆదాయమేమో కానీ, అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని, వరిపంట నష్టాన్ని సర్వే చేసి, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగానే రైతులు నష్టపోయారని, రైతుల్ని ఆదుకోకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజా సమస్యలపై పర్యటనలో భాగంగా సోమవారం జనగామ జిల్లాలో ఎండిపోతున్న వరి పంటలను జాన్‌వెస్లీ పరిశీలించారు. జనగామ జిల్లాలో నీటిమట్టం తగ్గి బోరు మోటార్లలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను సోమవారం జాన్‌వెస్లీతో పాటు సీపీఐ(ఎం) బందం పర్యటించి ...6లో



గ్రూప్-1 ఫలితాలు విడుదల

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల వివరాలు

24 వరకు రీకౌంటింగ్

ఆ తర్వాతే జీఆర్ఎల్ జారీ : టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

వివరాలు 13లో

ప్రశ్న కనిపించకుంటే... జవాబు రాసేదెలా?

ఇంటర్ సెకండియర్ విద్యార్థుల ఆందోళన

ఇంగ్లీష్ పరీక్షలో సరిగ్గా కనిపించని ఏడో ప్రశ్న

4 మార్కులు కలపాలని విజ్ఞప్తి

వివరాలు 6లో..



యూఎస్ఎయిడీలో కటాఫ్

83 శాతం కార్యక్రమాలకు ముగింపు

5200 కాంట్రాక్టులు రద్దు : అమెరికా

వాషింగ్టన్: యూఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అంతర్జాతీయంగా చేపడుతున్న వేలాది కార్యక్రమాలకు ముగింపు పలకనున్నట్టు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. విదేశాంగశాఖ కింద కేవలం 13లో



పంట పొలాలకు నెర్రలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చేతికందే దశలో ఎండుతున్న వరి



భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.. ఫలితంగా ఎన్నో ఆశలతో యాసంగిలో వరి సాగు చేపట్టిన రైతులకు.. పంట చివరి దశలో ఆందోళన తప్పడం లేదు. దీనికితోడు ఉష్ణోగ్రతలు పెరగడంతో వరి మడులు నెర్రెలు బారుతున్నాయి. పంటలకు నీటి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నా.. పొట్ట దశలో ఉన్న పొలాలకు నీరు లేక రైతులు నానాతంటాలు పడుతున్నారు. కొన్నిచోట్ల పచ్చని పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. సాగర్ పరిధిలో పంటలు ఎండిపోతున్నాయి. జనగామలో 30 శాతం వరిపంట ఎండుముఖం పట్టింది. సిద్దిపేటలో పంటలకు నీరందడం లేదు. ఉత్తర తెలంగాణ జిల్లాలోనూ కొన్ని చోట్ల బోర్లలో నీరులేక పంటలకు నీరందడం లేదు. ఎగువన ఉన్న కర్నాటక, మహారాష్ట్రల్లోనూ వర్షాలు, వరదలు లేకపోవడం కూడా సమస్య తీవ్రతకు కారణమైంది. కాలువల ద్వారా సైతం నీరు అందకపోవడంతో చివరి ఆయకట్టులోని పొలాలు ఎండిపోతున్నాయి. పలుచోట్ల మోటార్లు వేసి చెరువులు, వాగుల నుంచి నీటిని పంట పొలాలకు పారిస్తున్నారు. దీంతో చెరువుల్లో నీరు అడుగంటుతోంది. మరో 20 రోజులు నీరందింతే తాము గట్టెక్కవచ్చని కొన్నిచోట్ల రైతులు వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తూ పంటలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి ప్రాజెక్టులపైన ప్రాంతాల్లో వరి సాగు విషయంలో రైతులకు అధికారులు చెప్పలేకపోయారని సమాచారం. ప్రభుత్వం కూడా తగిన సమీక్షలు చేయకపోవడమూ ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తే పంట పొలాలు కాపాడవచ్చని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధికారులు దృష్టిసారించి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని రైతు సంఘాలు విజ్ఞప్తి చేశాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నవతెలంగాణ బృందం చేసిన పరిశీలనలో రైతులు వారికి సమస్య తీవ్రతను తెలియజేశారు. ఎండిన పంటలకైనా సర్వే చేసి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

- కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- అప్పుల పాలవుతున్నామంటూ అన్నదాతల ఆవేదన
- ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్

నవతెలంగాణ -విలేకరుల బృందం

నవంబర్, డిసెంబర్, జనవరి మూడో వారం వరకు శీతాకాలం కావటంతో వాతావరణం చల్లబడి వుంది. ఆ సమయంలో సాగు చేసిన పొలాలు బోర్ల కింద నీళ్లు పారాయి. గత రెండు మూడు వారాలుగా ఎండలు ముదురుతుండడంతో పంట పొలాలు నీరు లాగుతున్నాయి. రోజు రోజుకు నీటి అవసరాలు పెరిగిపోవటంతో బోర్లలో నీరు తగ్గిపోయింది. వ్యవసాయ బోర్లు ఆగాగి పోస్తున్నాయి. మరి కొన్ని బోర్లు అసలు ఎండేపోయాయని రైతులు మొత్తుకుంటున్నారు. గత ...3లో

చేతికొచ్చిన పంట ఎండిపోయింది రైతు గోవర్ధన్‌రెడ్డి

నోటి కాడికి వచ్చిన వరికి పంట కాస్త పశువులను మేపే పరిస్థితి వచ్చింది. పది ఎకరాల్లో వరిసాగు చేశాను. నీళ్లు లేక పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీలేక పశువులను మేపుతున్నాను.

ట్యాంకర్‌తో నీరు

నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన పలువురు రైతులు పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్‌ల ద్వారా నీటిని తెప్పించి వరిపొలాల్లో నింపుతున్నాయి. పక్కనే శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఉన్నప్పటికీ అక్కడి నుంచి నీరు అందే అవకాశం లేకపోవడంతో ప్రధానంగా బోరుబావుల మీదనే ఆధారపడి వరిని సాగుచేస్తుంటారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1000-1200 వసూలు చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్యం దిశగా సాగండి

శాసన సభ స్పీకర్, మండలి చైర్మెన్, మంత్రి, పీసీసీ చీఫ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

యువత, సమాజహిత కోసం ఏర్పాటు చేసిన 'లక్ష్యం' దిశగా సాగాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్ కవాడిగూడలోని అన్నం కాంప్లెక్స్‌లో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'లక్ష్యం' యూట్యూబ్ ఛానల్ కార్యాలయాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర చైర్మెన్ రియాజ్ మహ్మద్, గాయకురాలు విమలక్క, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కత్తి వెంకటస్వామి తదితరులు కలిసి 'లక్ష్యం' యూట్యూబ్ ఛానల్‌ను బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం రియాజ్ మహ్మద్ మాట్లాడుతూ.. ఉద్యమం ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందన్నారు. ఆ చరిత్రను దిలీప్ కుమార్ సేకరించారని తెలిపారు. పదేండ్లలో తెలంగాణ యువత ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ కోసం దిలీప్ కుమార్ ఎంతో పోరాడారని చెప్పారు. ఆయన తెలంగాణ వాదాన్ని వినిపించడం కోసం ఎక్కని మెట్లు లేవన్నారు. దిలీప్ కుమార్ ఆధ్వర్యంలోని లక్ష్యం ఛానెల్ క్రమంగా ఎదగాలని ఆకాంక్షించారు. విమలక్క మాట్లాడుతూ.. 'లక్ష్యం' విజయవంతం కావాలన్నారు. ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. లక్ష్యం ఛానెల్ ఆశయం నెరవేరాలని, ప్రజల పక్షాన నిలువాలని కోరారు. కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటం తర్వాత వచ్చిన భౌతిక తెలంగాణ సామాజిక తెలంగాణగా మారలేదని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం తన సారథ్యంలోని లక్ష్యం యూట్యూబ్ ఛానెల్ సేవలందిస్తుందని చెప్పారు. తమ ఛానల్‌లో ఉద్యోగార్థులకు అవసరమైన కెరీర్ గైడెన్స్ క్లాసులు, మోటివేషన్ స్పీచ్‌లు సహా పలు అంశాలపై సందేశాలు ఉంటాయని తెలిపారు. తమ ఛానల్‌కు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తిగా ఉచిత సబ్‌స్క్రిప్షన్ ఉంటుందన్నారు. అలాగే రాజకీయాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యేగా సేవలందించాలనుకునే యువత తమను సంప్రదిస్తే సామాజిక సేవపై వారికి అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రెండు నెలలకోసారి జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. 2017, 2018లో జాబ్ మేళాలు నిర్వహించి 10వేల మందికి జాబ్స్ ఇప్పించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సన్నిహితులు, మిత్రులు, లక్ష్యం ఛానెల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కపిలావాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో 'లక్ష్యం' యూట్యూబ్ ఛానల్ ప్రారంభం

ఛానల్‌ను లాంచ్ చేసిన గ్రంథాలయ చైర్మెన్ రియాజ్, విమలక్క, దిలీప్ కుమార్

విజయానికి ఓటమి పునాది

లైంగికదాడుల నివారణకు సిలబస్‌లో పాఠ్యాంశాలు

పిల్లల పెంపకంలో లింగ వివక్ష చూపొద్దు : మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఓయూ

ఓటమిని ప్రతి మహిళా వారి విజయాలకు పునాదిగా చేసుకోవాలని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పట్టుదల, కృషి, జ్ఞానాన్ని నమ్ముకున్న వాళ్లు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, అందుకు తానే పెద్ద ఉదాహరణ అని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక తెలంగాణ మహిళా విభాగం సమతా సబ్ కమిటీ, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓయూలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టాలను చూసి ఎవరూ కుమిలిపోవద్దన్నారు. కష్టాలను ఇష్టంగా మలుచుకోవడం ప్రతి ఆడపిల్లా నేర్చుకోవాలని సూచించారు. కృషి, పట్టుదల, ప్రవర్తన, సేవాగుణం మనల్ని ఉన్నత స్థానాల్లో నిలబెడతాయని చెప్పారు. అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలతో వారి డ్రీమ్స్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడవాళ్లపై చులకన భావం నేటికీ ఉందన్నారు. ఆడ, మగ అన్న తేడా ఇంటి నుంచే మొదలవుతున్నదని, ఈ భావనను తుంచేందుకు జనవిజ్ఞాన వేదికలాంటి సంస్థలు పాటుపడుతున్నాయని తెలిపారు. మహిళలపై లైంగికదాడులను అరికట్టేందుకు సిలబస్‌లో కొత్త పాఠ్యాంశాలను చేర్చుతామని చెప్పారు. లింగ వివక్ష లేకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలని, లింగ వివక్షకు వ్యతిరేకంగా అమ్మాయిలు ప్రశ్నించాలని సూచించారు. అభాండాలు వేస్తే నిలదీయాలి కానీ ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. మహిళా సంఘాలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగడానికి తమ ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని, అందులో భాగంగానే ఆర్టీసీ అద్దె బస్సుల విధానం తీసుకొచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా హిందీ రచయిత్రి కమలా భాసిన్ రాసిన కవితను "నేను ఆడపిల్లను - అందుకే తప్పక చదవాలి" పేరుతో జన విజ్ఞాన వేదిక తెలుగులోకి అనువదించిన గోడ పత్రికను మంత్రి ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ. ఎంతోమంది మహిళలు దేశం కోసం త్యాగాలు చేశారని, కానీ వారి చరిత్ర ఎక్కడా కనపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నింట్లో మహిళలు అర్ధభాగం అని చెబుతూనే ప్రయివేటు సంస్థల్లో సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదన్నారు. జన విజ్ఞాన వేదిక సమతా విభాగం రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆడపిల్లలు, మహిళలు ప్రశ్నించడం నేర్చుకోవాలని సూచించారు. సనాతన ధర్మం పేరుతో మహిళల ఉనికినే ప్రమాదంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మహిళలకు చదువు లేకుండా చేసే కుట్ర జరుగుతోందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా మహిళలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర మహిళా సభ కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ డాక్టర్ పి.రజిని మాట్లాడుతూ.. ప్రతి ఆడపిల్లా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ఎస్పీ లింగస్వామి, విద్యాసాగర్, శరణ్య, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కరుణాదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.వసుంధర, అధ్యాపకులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ హిమబిందు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు : డాక్టర్ కోట నీలిమ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 55 నియోజవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ కోట నీలిమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ విద్యార్థులకు ద్రోహం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే వ్యక్తి కాదన్నారు. కేటీఆర్ విద్యార్థులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల పాఠశాలల కోసం రూ.11,600 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు.

సీఎన్‌టీ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించండి : పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాంకీ సంస్థలో జరిగే సీఎన్‌టీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మికులను కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో రాంకీ సంస్థలో బుధవారం యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. సోమవారం జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డు వద్ద నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రెండేండ్ల క్రితమే ఇక్కడ యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారనీ, కానీ..చరిత్రలో ఎక్కడా లేని విధంగా 350 మంది కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసే విధంగా సీఐటీయూ పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ కాలంలో యాజమాన్యంతో కొట్లాడి అనేక హక్కులను సాధించుకున్నామని తెలిపారు. ఒక కార్మికుడు ప్రమాదంలో చనిపోతే అతనికి వచ్చే క్రాస్ వేతనంపై 30 రెట్లు నష్టపరిహారం ఇచ్చే విధంగా, దహన సంస్కారాలకు రూ.30వేలు ఇచ్చే విధంగా యజమాన్యాన్ని ఒప్పించామని తెలిపారు. అక్కడి యాజమాన్యం బీఎంఎస్ యూనియన్‌ను పావుగా వాడుకుని కార్మికులకు వేతన ఒప్పందం జరగకుండా అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొడుతూ బుధవారం జరిగే ఎన్నికల్లో సీఐటీయూ స్టార్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిలా అధ్యక్షులు ఎ అశోక్, జి. శ్రీనివాసులు, మీనా, లింగస్వామి, వెంకన్న, పి. గణేష్, డి.వి. సత్యనారాయణ, యూనియన్ ఆఫీస్ బేరర్లు సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

ఇవేం నిబంధనలు?

వీటితో కుల వివక్షపై పోరాటం సాధ్యమేనా ?

- అమలు చేయాలని కోరితే నీరుకార్చారు
- ఓబీసీల ప్రస్తావనే లేని ముసాయిదా
- యూజీసీ తీరుపై విద్యావేత్తల ఆగ్రహం

కొండ నాలిక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిం దన్నది ఓ సామెత. విద్యాలయాల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా యూజీసీ తన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అందరూ కోరుతుంటే అది మాత్రం దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉన్న నిబంధనలను సైతం నీరుకారుస్తోంది. క్యాంపస్‌లలో కుల వివక్షను రూపు మాపేందుకు 2012లో యూజీసీ కొన్ని నిబంధనలను నిర్దేశించింది. అయితే అవి సరిగా అమలు జరగడం లేదని, కుల వివక్షకు ఎంతో మంది బలవుతున్నారని అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను కఠినంగా అమలు చేయాలని వారు కోరుతున్నారు. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని నిబంధనలకు మరింత పదును పెట్టాల్సిన యూజీసీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. అసలు నిబంధనలనే నీరు కార్చే ప్రయత్నం చేస్తోంది. దీనికి సంబంధించి ముసాయిదా నిబంధనలను గత నెలలో విడుదల చేసింది.

పూర్వా పరాలు



న్యూఢిల్లీ : 2019 ఆగస్టులో రోహిత్ వేముల తల్లి రాధికా వేముల, పాయల్ తడ్వి తల్లి అబేదా సలీం తడ్వీ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. తమ పిల్లలు క్యాంపస్‌లో కుల వివక్ష కారణంగా బలవన్మరణానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. విద్యా సంస్థల్లో వివక్షతో పోరాడేందుకు వారు పలు డిమాండ్లను తమ పిటిషన్‌లో కోర్టు దృష్టికి తెచ్చారు. వీటిలో ముఖ్యమైనది 2012లో యూజీసీ రూపొందించిన నిబంధనను అమలు చేయడం. పిటిషన్ దాఖలైన ఆరు సంవత్సరాలకు ఈ ఏడాది జనవరిలో రెండోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ల డిమాండ్లపై సమాధానం తెలియజేయనందుకు యూజీసీపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో యూజీసీ గత నెలలో ముసాయిదా నిబంధనలు విడుదల చేసింది. 2012 నాటి నిబంధల స్థానంలో వీటిని అమలు చేస్తామని తెలిపింది. అయితే కొత్తగా నిబంధనలు రూపొందించాలని పిటిషనర్లు కోరలేదు. పాత వాటినే సమర్థవంతంగా అమలు చేయాలని అభ్యర్థించారు. పైగా సుప్రీంకోర్టు కూడా కొత్త నిబంధనలను రూపొందించాల్సిందిగా యూజీసీని ఆదేశించలేదు.

ఫిర్యాదుదారుకే జరిమానాలు

చేసిన ఫిర్యాదు తప్పని తేలితే ఫిర్యాదుదారుపై చర్యలు తీసుకోవాలంటూ నూతన ముసాయిదా నిబంధనల్లో విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు జారీ చేయడంపై విద్యావేత్తలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 2012 నిబంధనల్లో ఇది లేదు. తప్పుడు కేసులకు జరిమానాలు విధించాలన్న తొందరెందుకని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యుడు ప్రజ్వల్ గాయక్వాడ్ ప్రశ్నించారు. ఫిర్యాదులో వాస్తవం ఉన్నప్పటికీ దానిని తప్పుడు ఫిర్యాదుగా చిత్రీకరించే అవకాశం ఉన్నదని ఆయన చెప్పారు. విద్యాలయాల్లో ఈక్విటీ కమిటీల ఏర్పాటుకు సంబంధించి ముసాయిదాలో పొందుపరచిన నిబంధనలు కూడా ఆందోళనకు కారణమవుతున్నాయి. కమిటీ కూర్పు తమకు ఆమోదయోగ్యం కాదని గైక్వాడ్ స్పష్టం చేశారు. ఎస్సీ లేదా ఎస్టీల నుంచి కేవలం ఒకరికి మాత్రమే కమిటీలో చోటు కల్పించారని, ఫలితంగా అగ్రకులాల మాటే చెల్లుబాటు అవుతుందని ఆయన తెలిపారు.

ఓబీసీల మాటేమిటి?

అదీకాక ముసాయిదా నిబంధనల్లో పలు లొసుగులు కన్పిస్తున్నాయి. నిబంధనలు ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే వర్తిస్తాయని ముసాయిదా చెబుతోంది. దీనిపై విద్యార్థులు, అధ్యాపకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీలు) విద్యార్థులు కూడా క్యాంపస్‌లలో తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. 'కుల వివక్షపై ముసాయిదాలో ఇచ్చిన నిర్వచనం ఓబీసీలను మినహాయించింది. ఇది యూజీసీ చేసిన చారిత్రక తప్పిదం' అని ఈ నెల 1వ తేదీన యూజీసీకి రాసిన లేఖలో అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం ధ్వజమెత్తింది. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని ఓబీసీ తరగతులను ఎస్సీలు లేదా ఎస్టీలుగా పరిగణిస్తున్నారని, కాబట్టి కుల వివక్ష నుంచి ఓబీసీలకు రక్షణ కల్పించడానికి ఆ తరగతిని నిర్వచనంలో చేర్చాలని కోరింది.

అసలు నిర్వచనం ఏది?

2012 నాటి నిబంధనల్లో పలు క్లాజులు ఉన్నాయి. అవి వివక్ష అనే పదానికి నిర్వచనాన్ని ఇచ్చాయి. వివక్ష ఎన్ని రకాలుగా జరుగుతుందో వివరించాయి. అయితే ముసాయిదా నిబంధనల్లో ఇవేవీ లేవు. వివక్ష, వేధింపులు, ర్యాగింగ్, ప్రవర్తన, బాధించడం....ఇలా ప్రతి పదానికీ పాత నిబంధనల్లో స్పష్టమైన నిర్వచనాలు ఉన్నాయని, కులతత్వం ఎలా వేళ్లూనుకుంటోందో కూడా అందులో తెలిపారని, కానీ కొత్త నిబంధనల్లో ఆ ప్రస్తావనలేవీ లేవని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్.సుకుమార్ చెప్పారు. సమస్యను పలు కోణాలలో విశ్లేషించకుండా, సరైన నిర్వచనం ఇవ్వకుండా క్యాంపస్‌లో కుల సమస్యను పరిష్కరించడం చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. తాజాగా విడుదల చేసిన ముసాయిదాలో వివక్ష 'అసమంజసం, వివక్షాపూరితం' అని మాత్రం చెప్పి చేతులుదులుపుకున్నారు.

ఇదేం కమిటీ ?

కాగా నూతన నిబంధనలను రూపొందించిన కమిటీని కూడా విద్యావేత్తలు, విద్యార్థులు విమర్శిస్తున్నారు. యూజీసీ మాజీ చైర్మెన్ డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్ క్యాంపస్‌లో కుల వివక్ష అనే అంశంపై విస్తృతంగా అధ్యయనం జరిపారు. ఆయన నేతృత్వంలో ఏర్పడిన కమిటీ 2012లో నిబంధనలు రూపొందించిందని విద్యావేత్తలు గుర్తు చేశారు. తాజాగా ముసాయిదా రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యులెవరు? ఒకాయన కళాశాల ప్రిన్సిపాల్. తన కాలేజీలో రిజర్వేషన్లను అమలు చేసేందుకు నిరాకరించిన వ్యక్తి. మరొకరు ఏబీవీపీ మాజీ ఉపాధ్యక్షుడు. ఇంకొకరు గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీలో కూడా సభ్యుడుగా పనిచేశారు. ఇస్లాం లేదా క్రైస్తవంలోకి మారిన తర్వాత విద్యా సంస్థల్లో ఎస్సీలు రిజర్వేషన్లు పొందుతున్నారా లేదా అనేది పరిశీలించేందుకు ఆ కమిటీ ఏర్పడింది.

చైనా, జపాన్ దిగుమతులపై సుంకాలు

కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్



న్యూఢిల్లీ : వాటర్ ట్రీట్‌మెంట్ కోసం చైనా, జపాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్న రసాయనంపై భారత ప్రభుత్వం డంపింగ్ నిరోధక సుంకాన్ని విధించింది. దీని కింద రాబోయే ఐదు సంవత్సరాల పాటు టన్నుకు 986 డాలర్ల సుంకాన్ని వసూలు చేస్తారు. చైనా, జపాన్ నుంచి తక్కువ ధరకే రసాయనం లభిస్తుండడంతో దేశీయ పరిశ్రమ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలో చౌక దిగుమతుల నుంచి దేశీయ పరిశ్రమకు రక్షణ కల్పించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. ట్రైక్లోరో ఐసోసియాన్యూరిక్ యాసిడ్' అనే ఈ రసాయనంపై సుంకాన్ని విధించాలని వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన దర్యాప్తు విభాగం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డీజీటీఆర్) చేసిన సిఫారసుల ఆధారంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

చైనా, జపాన్ నుంచి పెద్ద ఎత్తున రసాయనం భారత్‌కు చేరుతోందని, దీనివల్ల దేశీయ పరిశ్రమ వద్ద దాని నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయని డీజీటీఆర్ తెలిపింది. కాగా ఈ రెండు దేశాలు భారత్‌కు కీలక వాణిజ్య భాగస్వాములు. సుంకం విధించాలని డీజీటీఆర్ సిఫారసు చేసిన మూడు నెలల్లోనే ఆర్థిక మంత్రిత్వ శాఖ దాని అమలుపై నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

నోరు అదుపులో పెట్టుకోండి

- అహంకారంతో మహారాజులా మాట్లాడుతున్నారు
- కేంద్రమంత్రి ప్రధాన్‌కు స్టాలిన్ హెచ్చరిక
- మా ప్రజలు అనాగరికులని అనుకుంటున్నారా అని ఫైర్



చెన్నై : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో ఉంచుకోవాలని, జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. 'తమిళనాడుకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్నది మీరు. మా ఎంపీలు అనాగరికులు అనుకుంటున్నారా?' అంటూ సోమవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ధ్వజమెత్తారు. అంతకుముందు తమిళనాడుపై దిగువసభలో ప్రధాన్ కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. అనంతరం వాటిని వెనక్కి తీసుకున్నారు. రాష్ట్ర ప్రజలను అవమానిస్తూ కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రధాని ఖండిస్తారా అని స్టాలిన్ తన పోస్ట్‌లో ప్రశ్నించారు.

'కేంద్ర మంత్రి ప్రధాన్ తాను ఒక మహారాజునని అనుకుంటున్నారు. అహంకారంతో మాట్లాడుతున్నారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలి. మమ్మల్ని మోసం చేస్తున్నది మీరే. తమిళనాడుకు నిధులేవీ ఇవ్వకుండా మా ఎంపీలను అనాగరికులు అంటారా?. ముందు మీరు క్రమశిక్షణ నేర్చుకోండి' అని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం అమలులో డీఎంకే ప్రభుత్వానికి నిజాయితీ లోపించిందని, అది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ప్రధాన్ లోక్‌సభలో ఆరోపించారు. భాషా పరమైన అడ్డంకులు సృష్టించడమే వారి పని అని, రాజకీయాలు, రాద్ధాంతాలు చేస్తున్నారని విమర్శించారు. పీఎం శ్రీ పథకానికి సంబంధించిన ఎంఓయుపై సంతకం చేసేందుకు తొలుత అంగీకరించిన తమిళనాడు ప్రభుత్వం ఆ తర్వాత నిరాకరించిందని తెలిపారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ వంటి బీజేపీ యేతర రాష్ట్రాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయని చెప్పారు. మంత్రి వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ డీఎంకే సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. దీనిపై స్టాలిన్ స్పందిస్తూ పీఎం శ్రీ పథకాన్ని అమలు చేయలేమని తాము స్పష్టంగా చెప్పామని గుర్తు చేశారు. డీఎంకే ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పనిచేస్తుందే తప్ప నాగపూర్ నుండి వచ్చే ఆదేశాలకు కాదని చురక వేశారు. పథకాన్ని అమలు చేయాల్సిందిగా తమపై ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. తమిళనాడు విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తారో లేదో ముందు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సొమ్మును పన్ను రూపంలో తమ నుండి కేంద్రమే వసూలు చేసిందని స్టాలిన్ అన్నారు.



చండూరులో.. రైతు సంఘం పరిశీలన

నల్లగొండ జిల్లా చండూరు మండల పరిధిలోని నేర్మట రెవెన్యూ గ్రామ పరిధిలో ఎండి వరి పొలాలను తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం మాట్లాడుతూ.. ఎండిన వరి చేలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జెర్రిపోతుల ధనంజయ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి నరసింహ పాల్గొన్నారు.

మూసీ ఎడమ కాలువ ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

- ఎండిపోతున్న వరి చేల పరిశీలన

నవతెలంగాణ-వేములపల్లి

మూసీ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని పాములపహాడ్ గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టు కింద మాడ్గులపల్లి, వేములపల్లి, తిప్పర్తి మండలాల రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేశారని చెప్పారు. ప్రాజెక్టులో నీరు ఉండటం వల్ల గట్టెక్కుతామనే నమ్మకంతో సాగు చేశారని తెలిపారు. కానీ పంట చివరి దశకు వచ్చేసరికే నీరు అందడం లేదన్నారు. పైరు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రాజెక్టుపై అజమాయిషీ లేకపోవడం వల్ల నీళ్లు ఉన్నా చివరి రైతాంగానికి నీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి కనీసం రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా పథకం అమలు చేసి బ్యాంక్ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే మూసీ ప్రాజెక్టు క్రింద ఉన్న పంట పొలాలను ఇరిగేషన్ అధికారులు పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వేములపల్లి మాజీ వైస్ ఎంపీపీ పాదూరు గోవర్ధన, వేములపల్లి మాడ్గులపల్లి మండలాల కార్యదర్శులు పాదూరు శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్ మండల నాయకులు పతాని శ్రీను, తంగెళ్ళ నాగమణి, అయితగాని విష్ణు, చింతచెర్ల శ్రీను, పిండి వెంకట్ రెడ్డి, సబ్బు రవీందర్ రెడ్డి, అల్లుబెల్లి వెంకట్ రెడ్డి, రైతులు చింతకాయల గంగయ్య, రావు వెంకట్ రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

పంట పొలాలకు నెర్రలు

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టులో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. ప్రస్తుతం చెరువులు బిక్కి పోవటంతో సాగు బోర్లు కూడా ఎండిపోయాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో సుమారు 50 వేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత పెరిగి వరికి అధిక సంఖ్యలో నీరు అవసరం పడుతుంది. ఇప్పటికే సరిపడా నీరు రావట్లేదని రైతులు ఆందోళనగా ఉన్నారు. చాలా మంది రైతులు ఎస్సారెస్పీ నీరు వస్తుందనే ఆశతో బోర్లు, బావుల కింద సాగు చేశారు. కానీ రాకపోవడంతో ఏం చేయాలో తెలియని దుస్థితి నెలకొంది. ఒక్కో ఎకరానికి ఇప్పటికే సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. సూర్యాపేట జిల్లాలో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి 5.38 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అయితే గతేడాది ఇదే సమయానికి జిల్లాలో సరాసరి నీటిమట్టం 2.92 మీటర్ల లోతులో ఉండగా.. ఈ సారి వేగంగా నీరు అడుగంటింది. చాలావరకు బోర్లు, బావుల్లో నీళ్ల సగానికిపైగా తగ్గాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

యాసంగి సీజన్‌లో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. కామారెడ్డి జిల్లాలో 2.3 లక్షలకు పైగా వరి సాగైంది. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ప్రధాన నీటి వనరులు. కాగా కాలువలు లేని చోట బోరుబావుల మీద ఆధారపడి ఎక్కువ విస్తీర్ణం వరి సాగు చేస్తుంటారు. కాగా వరి పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడు తున్నాయి. ఎండలు ముదురుతుండటంతో చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. బోరుబావులు ఎత్తిపోతున్నాయి.

జనగామ జిల్లాలో 30 శాతం పంటలు ఎండుముఖం

జనగామ జిల్లాలో గత సంవత్సరం 2024 జనవరి నెలలో 6.91 మీటర్ల కు భూగర్భ జలాలు పడిపోగా ఈ సంవత్సరం 2025 జనవరి నెలలో 7.15 మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలోని 12 మండలాల్లో 769 చెరువులు కుంటలు, వీటికి కింద 49643 ఎకరాల ఆయకట్టు సాగు ఉంది. అలాగే వీటికి తోడుగా 8 రిజర్వాయర్లు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే రిజర్వాయర్లలో ఉండాల్సిన సరాసరి కనీస నీటి మట్టానికి లోతుకి పడిపోయాయి. గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లకు నీరు అందకపోవడంతో రిజర్వాయర్లలోని నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో కాలువల్లో నీళ్లు పారక పూర్తిగా ఎండిపోయాయి. జిల్లాలో 1.99లక్షల ఎకరాల్లో వరి మొక్క ఇతర పంటలు సాగు చేయగా వాటిలో 1.66 లక్షల ఎకరాలు వరి పంటను వేశారు. రైతు సంఘాల పరిశీలనలో ఇప్పటికే 30శాతం పంట పొలాలు ఎండిపోయాయని చెప్తున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో కాళేశ్వరం ద్వారా సరఫరా చేస్తున్న సాగునీటి జలాలు చివరి ఆయాకట్టు వరకు చేరుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



నాలుగు ఎకరాలు వరి వేస్తే

ఎండిపోయింది : బోడపట్ల వెంకన్న, బండమీది చందుపట్ల

నాకు ఐదెకరాల భూమి ఉంది. దాంట్లో నాలుగెకరాలు వరి సాగు చేశాను. మొన్నటి వరకు పైపుల నిండా పోసిన బోరుమోటరు నీళ్ల లేక నల్లాలో వచ్చే మాదిరిగా ఆగి ఆగి పోస్తుండడం, కాల్వ పూర్తిగా రాకపోవడంతో నాలుగెకరాలు ఎండిపోయింది. సాగు చేయడానికి లక్ష వరకు ఖర్చు పెట్టాను. ఎండిపోవడంతో నాకు ఉన్న పశువులను మేపుతున్నాను.

ప్రాజెక్టుల పైన ప్రాంతాల్లో ఉన్న పంటలకే ఎక్కువ సమస్య..

రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలోనే నీటి సమస్య తీవ్రంగా ఉంది. కరీంనగర్ జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో నీటి కొరత ఉంది. ప్రాజెక్టుల పైన ఉన్న ప్రాంతాల్లోనే పంటలు ఎండుముఖం పడుతున్నాయి. అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు వరిపైనే ఆధారపడాల్సి వచ్చిందని తెలుస్తోంది. వర్షాకాలంలో నిల్వవున్న నీటితోనే యాసంగిలో పంటలు సాగు చేయడానికి ఇక్కడ వీలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి

- పాత వాటి నిర్వహణపై దృష్టి పెట్టండి
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సాగునీటిపారుదల , పౌర సరఫరాల శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు పలు అంశాలపై చర్చించారు. ఎస్-ఎల్‌బీసీ ప్రాజెక్టును ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, ఏఎంఆర్‌పీలో ఐదో పంపులను ఏర్పాటు చేసే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు పూర్తిగా స్టడీ చేసి గోదావరి నీటితో పాలేరు రిజర్వాయర్‌ను పరిపుష్టం చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరిధిలో బస్వాపూర్ మొదలు సింగూరు వరకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏదుల నుంచి వట్టెం వరకు కాలువలు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని మంత్రులు ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న భూ సేకరణ, పాత ప్రాజెక్టుల నిర్వహణ, క్యాపిటల్ వర్క్‌లపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరించుకోవటం, కాలువలకు లైనింగ్‌లను పూర్తి చేయటం ద్వారా ప్రాజెక్టుల జీవితకాలం పెరుగుతుందన్నారు. అప్పుడే అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గత పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన వారు కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి, రాష్ట్రంలో ఉన్న పాత ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని గాలికి వదిలేయటంతో అవి ప్రమాదం లో పడే పరిస్థితి ఎదురైందని వివరించారు. ఈ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూనే, కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు రాబట్టేందుకు ఉన్న అవకాశాలను త్వరితగతిన పరిశీలించాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక లీగల్ టీంను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువలను బలోపేతం చేసుకునే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. గత పదేండ్ల కాలంగా అడ్డగోలుగా ఎక్కువ వడ్డీ రేట్లకు అప్పులు తేవటంతో ఆ భారం ప్రస్తుత ఖజానా నిర్వహణపై పడుతున్నదని తెలిపారు. 10శాతం వడ్డీ రేటుకు అప్పులు తేగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వడ్డీ రేట్లు 8 శాతానికి తగ్గించేందుకు అధికారులు మంచి ప్రయత్నం చేశారని తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఈ పథకం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈఎన్‌సీ జనరల్ అనిల్, స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్అండ్ఆర్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వృత్తి చేసే వారందరికీ రక్షణ కవచం ఇవ్వాలి : కేజీకేఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మికుల ప్రమాద నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కాటమయ్య రక్షణ కవచాలను వృత్తి చేసుకునే వారందరికీ ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) డిమాండ్ చేసింది. ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వృత్తిదారులను సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బోలగాని జయ రాములు, వెంకట నరసయ్య, భాల్నే వెంకట మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి చౌగాని సీతారాములు, బోయపల్లి సుధాకర్ , పరిదుల భాస్కర్ సోమవారం పరామర్శించారు. జనగామ జిల్లాకు చెందిన బాల్నే శ్రీనివాస్, గోడిశాల శ్రీనివాస్, తీగల పరశురాములు అక్కడ చికిత్స పొందుతున్నారు. వీరికి రక్షణ కవచం ఇచ్చి ఉంటే ఈ ప్రమాదాలు జరిగి ఉండేవి కాదని సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించి 9 నెల్లయినా రక్షణ కవచాల పంపిణీ నత్తనడక నడుస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 18 వేల మందికి మాత్రమే ఇచ్చారనీ, ఇంకా 2 లక్షల మందికిపైగా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 360 మంది చెట్టుపై నుండి జారిపడ్డారనీ, 42 మంది చనిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనీ, లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

నవతెలంగాణ

సంస్కారంలేని చదువు
వాసనలేని పువ్వులాంటిది - మహాత్మా గాంధీ

మంగళవారం 11 మార్చి 2025
www.navatelangana.com

సంపాదకీయం

జయహో



మినీ ప్రపంచకప్‌గా భావించే 'చాంపియన్స్ ట్రోఫీ'లో భారత దేశం అప్రతిహత విజయం సాధించడం మనందరికీ గర్వకారణం. చాంపియన్స్ ట్రోఫీలో ఒక్క పరాజయాన్ని కూడా చవి చూడకుండా ఇంత పెద్ద విజయాన్ని దేశానికి అందించిన టీమిండియాకు జయహోలు చెప్పాలి. గెలుపును యావత్ దేశం ఆస్వాదించింది. పుష్కర కాల విరామం తర్వాత చాంపియన్స్ ట్రోఫీ మళ్లీ మన సొంతమవ్వడం...ముచ్చటగా మూడోసారి ఆ ట్రోఫీని ముద్దాడిన తొలి జట్టుగా భారత్ నిలబడిన చారిత్రాత్మక సందర్భాన్ని కుల,మతాలతో సంబంధాలు లేకుండా ప్రతి భారతీయుడు జేజేలు పలుకుతున్నారు. అదే సమయంలో భోపాల్‌లో చోటుచేసుకున్న సంఘటన ఆనందాన్ని కాస్త ఆవిరి చేసింది. గెలుపు ద్వేషానికి దారి తీయకూడదు. కొన్ని సందర్భాల్లో అభిమానులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరమే కాదు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మొన్న ఆదివారం భోపాల్ జామా మసీద్ వద్ద విజయోత్సవ ర్యాలీ కాస్తా మతం రంగు పులుముకుంది. విజయోత్సవం మాటున హిందూమతోన్మాదులు ఈ దాడులకు తెగబడ్డారని, మధ్యప్రదేశ్‌ను మరో ఉత్తర ప్రదేశ్‌గా మార్చే కుట్ర ఇది అని ఎవరికైనా అర్థమౌతుంది.

> గత టీ20 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకోవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించిన సంగతిని మరుగునపెడుతూ.. జట్టుకు భారంగా మారారనే దాకా విమర్శలు వెల్లువెత్తాయి. ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఇక పాక్‌పై అద్భుత శతకం, ఆస్ట్రేలియాపై కీలక హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించడంలో కోహ్లి కీలకపాత్ర పోషించాడు. ఈ టోర్నీ ముందు వరకూ వీరిద్దరూ రిటైర్‌మెంట్ ప్రకటిస్తే బాగుండని అనుకొన్న అభిమానులే.. ఇప్పుడు ముమ్ముందు కొనసాగాలని కోరుకుంటున్నారంటే భారత విజయాల్లో వీరి పాత్ర ఏమిటో అర్థమైపోతుంది.


ఇంగ్లాండ్‌పై టీ20, వన్డే సిరీస్‌లు సాధించినప్పటికీ.. టెస్టు సిరీసుల్లో వరుసగా పరాజయాలు ఎదుర్కొన్న టీమిండియా.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలుస్తుందని తొలుత ఎవరి ఊహల్లోనూ లేదు. ఇతర జట్లూ బలంగానే ఉన్నాయి. ఆతిథ్య హోదాలో బరిలోకి దిగిన డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్ నుంచి ప్రమాదం పొంచి ఉందనేది విశ్లేషకుల వాదన. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత మేనేజ్‌మెంట్ ప్రయోగాలు చేయడంతో మళ్లీ '2007' రిపీట్ అవుతుందా? ఓవైపు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్.. మరోవైపు ఆస్ట్రేలియాలో బోర్డర్-గావాస్కర్ ట్రోఫీలో ఓటమి.. ఇలా వరుస పరాభవాలతో రెండు నెలల కిందట టీమిండియాపై ఎన్ని విమర్శలో! ఇన్ని సందేహాల నడుమ ఏ మాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా బరిలోకి దిగిన భారత జట్టుకు కోచ్‌గా గౌతమ్ గంభీర్ - కెప్టెన్‌గా రోహిత్ ద్వయం చేసిన ప్రయోగాలే విజయానికి పునాదులయ్యాయి. అరబ్ గడ్డపై అజేయంగా దూసుకెళ్తున్న రోహిత్‌సేన ఆఖరి ఆటలోనూ అదే హవా కొనసాగించి దుబాయ్‌లో తీన్మార్ కొట్టింది. భారత స్పిన్నర్ల ధాటికి తక్కువ స్కోరుకే తోకముడిచిన కివీస్.. అనంతరం ఛేదనలోనూ రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు శ్రేయాస్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, హర్దిక్ పాండ్యాల ఆటతీరుకు తలవంచక తప్పలేదు.

తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ తొలి ఏడు ఓవర్లు ఒక ఎత్తయితే ఆ తర్వాత 43 ఓవర్లు మరో ఎత్తు. వరుణ్, కుల్‌దీప్, జడేజా, అక్షర్‌ల మాస్టర్ స్ట్రోక్ కివీస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ నలుగురూ కలిసి ఏకంగా 35 ఓవర్లు వేసి న్యూజిలాండ్‌ను కోలుకోనీయలేదు. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ తమ రైట్-లెఫ్ట్ రిస్ట్ స్పిన్‌కు తోడు, స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ బంతితో పాటు బ్యాట్‌తోనూ మ్యాజిక్ చేయడం మొత్తంగా భారత్‌కు కలిసివచ్చింది. టోర్నీలో న్యూజిలాండ్‌పైనే డబుల్ సెంచరీతో వన్డేల్లో తన మార్కు చూపిన ఓపెనర్ గిల్ మెగా ఫైనల్లోనూ అదే టీమ్‌పై మెరుగైన పెర్ఫామెన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో పేసర్ల కాకుండా రోహిత్ చేసిన ప్రయోగం టీమిండియా విజయానికి బాటలు వేసింది.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ టెస్టు సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆ సిరీస్‌లు ముగిసిన తర్వాత ఇంకా ఎందుకు కొనసాగుతున్నారనే ప్రశ్నలు తలెత్తాయి. గత టీ20 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకోవడంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించిన సంగతిని మరుగునపెడుతూ.. జట్టుకు భారంగా మారారనే దాకా విమర్శలు వెల్లువెత్తాయి. ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఇక పాక్‌పై అద్భుత శతకం, ఆస్ట్రేలియాపై కీలక హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించడంలో కోహ్లి కీలకపాత్ర పోషించాడు. ఈ టోర్నీ ముందు వరకూ వీరిద్దరూ రిటైర్‌మెంట్ ప్రకటిస్తే బాగుండని అనుకొన్న అభిమానులే.. ఇప్పుడు ముమ్ముందు కొనసాగాలని కోరుకుంటున్నారంటే భారత విజయాల్లో వీరి పాత్ర ఏమిటో అర్థమైపోతుంది.

ఆరంభ ఓవర్లలో వికెట్లు తీసి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే బుమ్రా లేకపోవడం లోటేనని అంతా భావించారు. కానీ, దాదాపు 400 రోజులకుపైగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న షమీ పునరాగమనం కాస్త ఆనందాన్నిచ్చినా.. బంతిని కొత్త కుర్రాళ్లు హర్షిత్ రాణా, అర్ష్‌దీప్‌సింగ్‌తోనే పంచుకోవాల్సిన పరిస్థితి. దుబాయ్ వేదికగా మ్యాచ్‌లు కావడంతో షమీ, హార్దిక్ పాండ్యల పేస్ బౌలింగ్ టీమిండియాను విజయతీరాలకు నడిపించింది. ఈ ట్రోఫీలో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ భారత్ టాస్ ఓడింది. అయినా ట్రోఫీని గెలిచింది. ఇంత గొప్ప విజయపు విజయోత్సవ ర్యాలీలు దాడులకు దారి తీయడం అత్యంత విషాదం.

రెండు అభివృద్ధి పంథాలు


ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాద విధానాల అమలుకు పూర్వకాలంలో వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అభివృద్ధి రేటు ఎంత ఉండేదో అంతకన్నా ఎక్కువ అభివృద్ధి రేటు నయా ఉదారవాద కాలంలో సాధించడం జరిగిందని ఎవరూ చెప్పుకోలేరు. అప్పటికన్నా ఎంతో కొంత తగ్గిందే తప్ప పెరిగింది ఏమీ లేదు. కాని మరోవైపు జీడీపీ వృద్ధి రేటు మాత్రం గణనీయంగా పెరిగినట్టు అంచనాలు ఉన్నాయి. కొంతమంది ఆర్థికవేత్తలు ఈ జీడీపీ వృద్ధిరేటును ఉన్నదానికన్నా ఎక్కువగా పెంచి చూపించారని వాదిస్తున్నారు. ఏదేమైనా, అంతకు పూర్వపుకాలంలో కన్నా నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు ఎక్కువగానే ఉందని అంగీకరిద్దాం. 1990కన్నా ముందు కాలంలో ఆహారధాన్యాల ధరలు నిరంతరం పెరుగుతూ వుండేవి. వాటిని అదుపు చేయడానికి ధరలను నియంత్రించే చర్యలు తీసుకుంటూ వుండేవారు. అంటే ఆ కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి కన్నా వాటికి డిమాండ్ ఎక్కువగా ఉండేదన్నమాట. కాని నయా ఉదారవాద కాలంలో ప్రభుత్వం ప్రతీ ఏడాదీ ఆహారధాన్యాల అదనపు నిల్వలను ఏ విధంగా నిర్వహించాలి అన్న సమస్యను ఎదు ర్కొంటూ వస్తోంది. పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన ఆహార ధాన్యాల కన్నా ఎక్కువగా ధాన్య సేకరణ జరుగుతూ వస్తోంది.పైగా ఇండియా ఆహారధాన్యాలను ఎగుమతి కూడా చేస్తోంది. 2023-24లో 1040 కోట్ల డాలర్ల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేసింది.


ఒకవైపు తలసరి ఆదాయాలు వృద్ధి చెందుతూంటే మరోవైపు ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?నయా ఉదారవాద సమర్థకులకు ఈ ధోరణి పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడినా, అలా పెరిగిన ఆదాయాన్నంతటినీ ఆహారం కోసమే ఖర్చు చేయరు. కనుక వారి ఆదాయాలతో పోల్చితే ఆహారం కోసం చేసే ఖర్చు శాతం తగ్గుతుందని వారు వివరిస్తారు. ఆహార ధాన్యాల మార్కెట్‌లో మిగులు ఉండడం అంటేనే నయా ఉదారవాద వ్యవస్థలో అన్ని తరగతుల ప్రజలూ మెరుగైన జీవితాలను గడుపుతున్నట్టు లెక్క అని వారంటారు.

వాళ్లు చెప్పే ఈ వాదనకి వాస్తవాలకి ఏ మాత్రమూ సంబంధం లేదు. ఆదాయాలు పెరిగినప్పుడు అందులో ఆహారం కోసం చేసే ఖర్చు శాతం తగ్గవచ్చు కాని ప్రజలు స్వీకరించే ఆహారం పరిమాణం తగ్గిపోదు కదా? ప్రాసెస్డ్ ఫుడ్‌ను, మాంసాహారాన్ని (కోళ్లకు, పశువులకు పెట్టే మేతతో కలుపుకుని) కూడా పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే అటు గ్రామాల్లో గాని, ఇటు పట్టణాల్లో కాని ప్రజలు తీసుకునే తలసరి ఆహారం కేలరీల విలువ తగ్గిపోయింది. 2200 కేలరీల చొప్పున తలసరి కనీస స్థాయిలో ఆహారాన్ని తీసుకోలేకపోయినవారు 1993-94లో 58శాతం ఉంటే వారు 2017-18 నాటికి 80 శాతానికి చేరుకున్నారు. అంటే వారి ఆదాయాలు కుదించివేయబడ్డాయి. ఇదే విషయాన్ని ప్రపంచ ఆకలి సూచిక నుండి జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే వరకూ స్పష్టం చేస్తున్నాయి (ఈ సర్వే ప్రకారం మహిళల్లో రక్తహీనత చాలా ఆందోళనకర స్థాయికి చేరింది).

మనముందు రెండు రకాల అభివృద్ధి పంథాలు ఉన్నాయి. మొదటిది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచే విధానం.ఇది నయా ఉదారవాదానికి ముందు అనుసరించిన విధానం. ఈ విధానం అమలులో ఉన్నప్పుడు ప్రజలు కోరిన మేరకు ఆహారధాన్యాలను సరఫరా చేయలేని స్థితి ఉండేది. ఆకాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి వృద్ధి రేటు మొత్తం వృద్ధిరేటును ప్రేరేపించ గలిగేంత ఎక్కువగా లేదు. ఆహారధాన్యాలకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరిగేవి. అది ద్రవ్యోల్బణానికి దారితీసేది. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటును మొత్తం ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటును ప్రేరేపించగలిగేంత స్థాయిలో పెంచలేకపోవడం ఈ విధా నంలో ఉన్న సమస్య. ఈ విధానం అనుసరించిన కాలంలో మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అని పిలిచేవారు. ఇక్కడ సమస్య పెట్టుబడి తగినంత లేకపోవడం అనేది కానేకాదు. భూపంపకం సమూలంగా జరగకపోవడమే.

ఇక రెండో అభివృద్ధి విధానం నయా ఉదారవాద విధానం. ప్రస్తుతం అమలు జరుగుతున్నది ఇదే. ఇందులో ఆహార ధాన్యాల మిగులు ఉన్నది. ఇక్కడ వృద్ధిరేటు పెరగకపోవడానికి ప్రధాన ఆటంకం ఎగుమతులు పెరగకపోవడమే. అంతర్జాతీయ మార్కెట్‌లోకి తన సరుకులను ఎక్కువగా అమ్ముకోగలిగితే. వీలైతే తక్కిన దేశాల మార్కెట్లను కూడా ఆక్రమించగలిగితే అప్పుడు వృద్ధి రేటు పెరుగుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోడానికి దేశ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక-వ్యవస్థీకృత మార్పులను అమలు చేస్తేనే ఎగుమతులు పెరుగుతాయి.ఆ మార్పులు శ్రామికుల ఉత్పాదకతను పెంచుతాయి. అందువలన కొత్త ఉపాధి అవ కాశాలు పరిమితంగానే ఏర్పడతాయి. కొత్త అవకాశాల కన్నా అధికంగా ఉద్యోగార్థుల సంఖ్య పెరుగుతుంది. వీరిలో కొత్తగా నిరు ద్యోగులుగా వచ్చినవారే గాక, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవస్థీకృత, సాంకేతిక మార్పుల కారణంగా ఉపాధిని కోల్పోయినవారు కూడా ఉంటారు. వారికి అంతవరకూ ప్రభుత్వం నుండి లభించిన మద్దతు (నయా ఉదారవాద విధానాల అములకు పూర్వ కాలంలో) ఇప్పుడు లభించనందున వారు దుర్భర దారిద్ర్యానికి నెట్టబడ్డారు. పనులుచేసే వారితో పోల్చితే నిరుద్యోగుల శాతం క్రమంగా పెరిగిపోతూ వుంటుంది. అందుచేత శ్రామికుల తలసరి ఆదాయాల వాస్తవ విలువలు పడిపోతూ వుంటాయి. ఇలా ఆదాయాలు కుదించబడిన కారణంగానే ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోతూ వుంటాయి.

ఇక్కడ మనం రెండు నిర్ధారణలకు రావచ్చు. **మొదటి అంశం:** ఒక దేశ ప్రగతిని నిర్ధారించడానికి ప్రధాన సూచికగా జీడీపీని పరిగణిస్తూ వచ్చారు. నిజమైన ప్రజాసంక్షేమం ప్రాతిపదికన దేశ అభివృద్ధిని మదింపు చేయాలంటే ఈ జీడీపీని అందుకు ప్రమాణంగా తీసుకోవడం మానేయాలి. దాని స్థానంలో ప్రజల తలసరి ఆహార లభ్యతలో వృద్ధిని ప్రమాణంగా తీసుకోవాలి. ఇతర నిత్యజీవితావసర సరుకుల లభ్యతను కూడా ఆ ప్రమాణంలో కలపాలి. నయా ఉదారవాద విధానాల అమలుకు పూర్వ ఉన్న వ్యవ స్థకు, నయా ఉదారవాద వ్యవస్థకు-రెండింటికీ ఈ ప్రమాణాన్ని వర్తింపజేయవచ్చు. పాత విధానంలో పెట్టుబడుల రాకపోకలమీద నియంత్రణలు ఉండేవి. ఆ కారణంగా దేశీయ మార్కెట్‌లో వృద్ధి ఎంత సాధ్యపడేదో, అంతమేరకే తలసరి వినియోగం కూడా వృద్ధి జరిగేది. అదే నయా ఉదారవాద వ్యవస్థ వచ్చేసరికి ఇక్కడ పెట్టుబడుల రాకపోకలమీద నియంత్రణలు లేవు. ఉత్పత్తిని పెంచు కోవచ్చు. కాని శ్రామిక ప్రజల వద్ద ఉన్న కొనుగోలు శక్తి చాలా పరిమితంగా ఉన్నందువలన ఇక్కడ వృద్ధిరేటు పరిమితం అవుతోంది.



రెండవ అంశం: ఇక్కడ మార్కెట్‌లో సరుకుల మిగులు ఉంది. కనుక వాటిని వినియోగించే వేగాన్ని పెంచాలి. అందుకు ఉపాధికల్పనను విస్తరించాలి. అలా ఉపాధి విస్తరించాలంటే అందుకు ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచాలి. పెరిగే ప్రభుత్వ వ్యయాన్ని బడ్జెట్‌లో ద్రవ్యలోటును పెంచడం ద్వారా గాని, సంపన్నుల మీద అదనపు పన్నులను విధించడం ద్వారా గాని భర్తీ చేసుకోవచ్చు. శ్రామిక ప్రజానీకం మీద పన్నుల భారాన్ని పెంచితే దానివలన వినిమయం ఆ మేరకు తగ్గిపోతుంది. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బడ్జెట్ లోటును పెంచడానికి గాని, సంపన్నుల మీద పన్నులను పెంచడానికి కాని ఒప్పుకోదు. అంటే దేశంలో ఉపాధి పెరగకపోడానికి అసలు అటంకం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాగిస్తున్న పెత్తనం. ఇప్పుడు ఒక పక్క మిగులు ఆహారధాన్యాలు పేరుకుపోవడం, ఇంకోపక్క నిరుద్యోగం పెరిగిపోవడం- ఏక కాలంలో కొనసాగడం అనే అసంబద్ధ పరిస్థితిని అధిగమించాలంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అధిగమించాలి. ఆ పెత్తనం నుండి బయట పడడానికి పెట్టుబడుల రాకపోకలమీద ప్రభుత్వం నియంత్రణలు పెట్టాలి. అటువంటి నియంత్రణలు పెట్టడం అంటే నయా ఉదారవాద వ్యవస్థకు ముగింపు పలకడమే. నయా ఉదారవాద విధానాల సారాంశం పెట్టుబడుల రాకపోకలు ప్రపంచవ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కొనసాగడం. దానికి కళ్లెం వేయడం అంటే నయా ఉదారవాద వ్యవస్థను తిరస్కరించడమే అవుతుంది.

> దేశంలో ఉపాధి పెరగకపోడానికి అసలు అటంకం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాగిస్తున్న పెత్తనం. ఇప్పుడు ఒక పక్క మిగులు ఆహారధాన్యాలు పేరుకుపోవడం, ఇంకోపక్క నిరుద్యోగం పెరిగిపోవడం- ఏక కాలంలో కొనసాగడం అనే అసంబద్ధ పరిస్థితిని అధిగమించాలంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అధిగమించాలి. ఆ పెత్తనం నుండి బయట పడడానికి పెట్టుబడుల రాకపోకలమీద ప్రభుత్వం నియంత్రణలు పెట్టాలి. అటువంటి నియంత్రణలు పెట్టడం అంటే నయా ఉదారవాద వ్యవస్థకు ముగింపు పలకడమే. నయా ఉదారవాద విధానాల సారాంశం పెట్టుబడుల రాకపోకలు ప్రపంచవ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కొనసాగడం. దానికి కళ్లెం వేయడం అంటే నయా ఉదారవాద వ్యవస్థను తిరస్కరించడమే అవుతుంది.

దేశ వృద్ధికి ప్రమాణంగా జీడీపీ వృద్ధి రేటుకు బదులు ప్రజల వినియోగం వృద్ధి రేటును తీసుకున్నప్పుడు నయా ఉదారవాద విధానం కాలం అంతకు మునుపటి కాలం కన్నా చాలా హీనంగా కనిపిస్తుంది. పైగా ఈ విధానం ఆహారధాన్యాల నిల్వలను కూడా మనల్ని వినియోగించుకో నివ్వకుండా, ప్రజల కడుపులను నింపనివ్వకుండా అడ్డం పడుతోంది. మరోపక్క అదనంగా ఉపాధి కల్పించడానికి కూడా ఆటంకంగా ఉంది. అందుచేత పాత విధానం కన్నా నయా ఉదారవాద విధానం హీనమైనది. అంతే కాదు, అది హేతువిరుద్ధమైనది కూడా.

ఇలా చెప్పడం అంటే మనం మళ్లీ గతంలో, నయా ఉదారవాద విధానాలకు పూర్వం ఏ విధానాలను అనుసరించామో ఆ విధానాలవైపు మళ్లమని చెప్పడం కాదు. ఆ పాత విధానంలో వృద్ధిరేటు వ్యవసాయంలో సాధించే వృద్ధిమీద, ఆ రంగంలో ఏర్పడే మిగులు మీద ఆధారపడి వుండేది. ఇప్పుడు ఉపాధి అవకాశాలను పెంచి, వ్యవసాయ ఉత్పత్తులలో వృద్ధిని సాధించే విధంగా ముందడుగు పడితేనే ప్రయోజనం కలుగుతుంది. అది జరగాలంటే భూసంస్కరణలను తీవ్ర స్థాయిలో అమలు చేయాలి. దానితోబాటు ప్రభుత్వం ఆ భూమిఉత్పాదకతను బాగా పెంపొందించే చర్యలు తీసుకోవాలి.

భూ సంస్కరణలు అనగానే కేవలం భూస్వాముల వద్ద కేంద్రీకృతమై ఉన్న భూమిని ముక్కలు చేసి పంచడం అన్న పరిమిత అర్థంలో చూడకూడదు. చాలా విస్తారమైన భూములు ఎప్పటినుండో, స్వాతంత్ర్యానికి పూర్వకాలం నుండీ కూడా, సరైన ఉత్పాదకతను ఇవ్వగలిగిన పరిస్థితిలో లేవు. దేశంలో ఈ విధంగా ఉన్న విస్తారమైన భూములను కూడా పూర్తిస్థాయి వాడుకలోకి తీసుకువచ్చేలా భూ సంస్కరణలు ఉండాలి. ఇప్పుడు నయా ఉదారవాద విధానంలో ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి విధానం ఉంది. దానికి బదులు కేవలం ప్రభుత్వ జోక్యంతో జరిగే వృద్ధి మాత్రమే గాక, వ్యవసాయంలో ప్రభుత్వ పర్యవేక్షణలో సాధించే వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి రావాలి.

> భూ సంస్కరణలు అనగానే కేవలం భూస్వాముల వద్ద కేంద్రీకృతమై ఉన్న భూమిని ముక్కలు చేసి పంచడం అన్న పరిమిత అర్థంలో చూడకూడదు. చాలా విస్తారమైన భూములు ఎప్పటినుండో, స్వాతంత్ర్యానికి పూర్వకాలం నుండీ కూడా, సరైన ఉత్పాదకతను ఇవ్వగలిగిన పరిస్థితిలో లేవు. దేశంలో ఈ విధంగా ఉన్న విస్తారమైన భూములను కూడా పూర్తిస్థాయి వాడుకలోకి తీసుకువచ్చేలా భూ సంస్కరణలు ఉండాలి. ఇప్పుడు నయా ఉదారవాద విధానంలో ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి విధానం ఉంది. దానికి బదులు కేవలం ప్రభుత్వ జోక్యంతో జరిగే వృద్ధి మాత్రమే గాక, వ్యవసాయంలో ప్రభుత్వ పర్యవేక్షణలో సాధించే వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి రావాలి.

(స్వేచ్ఛానుసరణ)

తలనొప్పి ...తలబొప్పి

సురుకు

నీకేదైనా చెప్పాలన్నా, సమజయ్యేలాగ చేయాలన్నా నాకు తలనొప్పిరా బాబూ అన్నాడు నర్సింగ్ యాద్‌గిరితో. అప్పుడే బయటినుండి వస్తున్న దామోదర్ యాద్‌గిరికి మద్దతుగా నిలబడ్డాడు. తనకు అర్థమయ్యేలాగ చెప్పలేక తలనొప్పంటావేమిటి బావా, అర్థమయ్యేలా చెప్పే తీరు తెలుసుకోలేక తలనొప్పి వచ్చిందనూ ఒప్పుకుంటా అన్నాడు. అయినా తలనొప్పికి నూట యాభై కారణాలు ఉంటాయంట తెలుసా? అనీ అన్నాడు దామోదర్. ఒక్కదాంతోనే చస్తున్నా మిగతా నూట నలభై తొమ్మిది నాకెందుకులే, నా తలనొప్పి పోయిందనుకో అన్నాడు నర్సింగ్. నీ తలనొప్పి పోతే పోయింది కాని చెల్లెమ్మను టీ పొయ్యమను, అన్నయ్యొచ్చాడని చెప్పు. మంచి టీ తాగుతూ, ఏమైనా నర్సింగ్ నీ టీ తాగుతూ నీమీద ఓ మంచి మాట చెబుతా విను, సహజంగా టీ తాపినవాడిని అది తాగినంతసేపన్నా గుర్తుపెట్టుకోవడం ఒక కర్తవ్యం. తలనొప్పి ఎవరికొస్తుందంటే, తల ఉన్నోళ్లకు మాత్రమే వస్తుంది. నీకు మంచి తల ఉందయ్యా అనేసరికి నర్సింగ్ ఛాతీ ఓ రెండంగుళాలు పైకొచ్చి మళ్లీ లోపలికి పోయింది. కాబట్టి తలనొప్పి రావడానికి ప్రధాన కారణం తల ఉండడం.

విద్యార్థుల గురించి పంతులమ్మలు, పంతుళ్లు ఒక మాట చెబుతుంటారు, అదేమంటే పిల్లలకు అర్థమవదని అనొద్దు, అర్థమయ్యేలా చెప్పలేక పోయామని చెప్పండి అంటుంటారు. వాళ్లకు తర్ఫీదు ఇచ్చేటప్పుడూ ఇదే చెబుతారు. మొదట తమకర్థమయితే తర్వాత అవతలి వాళ్లకి చెప్పి అర్థం చేయించొచ్చు. ఎంత కష్టమైన విషయాన్నైనా నిదానంగా, స్పష్టంగా చెప్పేవాళ్లది అందరికీ అర్థమవుతుంది. కాబట్టి ఎవరి తలలో గుజ్జు వాళ్లే పెంచుకోవాలి. తర్వాత అవతలివారి తలలో ఉన్న మెదళ్లకు ఎక్కించొచ్చు. అది తెలుసుకోకుంటే తలనొప్పే. సమస్యను సరిగా అర్థం చేసుకుంటే సగం తలనొప్పి అదే పోతుంది.

తలనొప్పి శరీరం లోపల జరిగే ప్రక్రియ అని పైకి అనిపిస్తుంది. కాని లోపల జరిగే ప్రక్రియకు బయటి కారణాలుంటాయి. అవి బాగా ప్రభావితం చేస్తాయి. షేర్ మార్కెట్లో లెక్క పెట్టేటోడికి ఏ అమెరికాలోనో ఎవరో అమ్మకానికి పెట్టిన వాటాల వల్ల ఇక్కడ మార్కెట్ పడిపోవడం తలనొప్పి తెప్పిస్తుంది. కాని ఆ నొప్పికి కారణం తన తలలో జరిగిందనుకుంటాడు. ఇక్కడే ప్రతిదానికీ కార్యకారణ సంబంధం ఉందని గ్రహించాలి. మన వ్యవస్థ బాగాలేదని జీతాలివ్వలేమని, ఉద్యోగాల్లోంచి తీసేస్తామని ప్రభుత్వాలు చెబుతాయి. అబ్బో శ్రీలంక లాగ కాకముందే మనోళ్లు మంచి చర్యలు తీసుకుంటున్నారు అని ఒక వైపు మేధావులు అనుకుంటారు. ఇదంతా పైనుండి అమెరికా, ప్రపంచ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు చెప్పినట్టు ఆడడంవల్ల వచ్చిన చిక్కులని గ్రహించలేరు. మనోళ్లు కూడా అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టు ప్రవర్తిస్తుంటారు. మియాపూర్ దగ్గర ఓ పులి సంచారం అని వీడియోలు చూపిస్తారు. అవును నాకు పులి గోరు కనిపించింది అని ఒకరు, తోక కనిపించింది అని ఒకరు అనేస్తారు. చివరికి అది అడవి పిల్లి అని తేల్చేశారు. పులి పోయి పిల్లి వచ్చే ఢాం ఢాం ఢాం అని పాడుకోవాలి తలకు ఏదైనా మంచి బామ్ పట్టించుకొని. కాబట్టి జరుగుతున్న విషయాలపై సరైన అవగాహన ఉంటే సగం తలనొప్పి దానంతట అదే మాయమవుతుంది.

తలకు బొప్పి కట్టడం అన్నది బయటినుండి ఏదైనా వస్తువు తలకు తగిలితే వచ్చేది. లేదూ ఒక్కోసారి తలనే ఆ వస్తువుకు తగిలే అవకాశమూ ఉంది. నేలకు తగలడం వల్ల కూడా తలకు బొప్పికడుతుంది. బండ మీద గుడ్డు పడ్డా, బండనే వచ్చి గుడ్డు మీద పడ్డా గుడ్డుకే నష్టమని తెలుసుకోవాలి. మల్లిక్ కార్టూన్లు గుర్తు తెచ్చుకుంటే తలపై బొప్పి కట్టడానికి ఇంట్లో వాడే అప్పడాల కర్ర కారణమని, భర్త పరిగెత్తుతూ ఉంటే వెనుక మిస్సైల్‌లాగా అప్పడాల కర్ర వెంట పడటం చూశాం. అవన్నీ తలబొప్పికి సంబంధించిన కార్టూన్లైనా కాస్త నవ్వుకొని తలనొప్పి తగ్గించుకొని కాస్త రిలాక్స్ అవడానికేనని మరవకూడదు. ఒక్కోసారి మన తలకు మనమే బొప్పి కట్టించుకునే పనులు చేస్తుంటాం. ఇంకొన్ని సార్లు ఏదో ఒక బొప్పి కట్టించుకునే పరిస్థితి కల్పిస్తారు. అదెలాగంటే పార్టీలకు ప్రభుత్వానికి పంపేది ప్రజలే. ఐదేళ్లకు ఒకసారి ఏదో ఒక బొప్పి కట్టించుకోవాల్సిందే. బొప్పిలో తేడాలుండొచ్చు కాని బొప్పి మాత్రం గ్యారెంటీ. ఇక కొన్ని తలనొప్పులు అంటు వ్యాధిలాగా వస్తాయి. జెలెన్స్కీనే తీసుకుందాం అందరి సాయంతో రష్యామీదికే దండెత్తినోడు ఒక్కొక్కరు దూరమయ్యేసరికి దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. అందరికీ తలనొప్పి తెప్పించానని తాను అనుకునే లోపు తలపై బొప్పి కట్టించారు, ముఖ్యంగా నమ్ముకున్నోళ్లు,. కాబట్టి తలనొప్పి, తలపై బొప్పి రెండూ ఒకదాని తర్వాత ఒకటి కూడా రావచ్చునన్నది ఇక్కడ సారాంశం. పట్టుదలకు పోవడం, పాత మాతృభూమిని మరవడం, ఎక్కడినుండి వచ్చాము అన్న విషయం మరచిపోవడంవల్ల వచ్చిన తలనొప్పి ఇది. అలాంటి తలనొప్పిని ప్రపంచాని కంతటా పంచాలనుకునే మూర్ఖులు ప్రపంచ యుద్ధాలు తెప్పించి తలబొప్పి కట్టించుకున్నోళ్లు కూడా ఉన్నారు.

ఈ తలనొప్పులను, తలపై కట్టే బొప్పిని ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా పోగొట్టుకోవాలి అని ఓ మిత్రుడు స్వామి స్వచ్ఛానంద దగ్గరికి పోయాడు దక్షిణతో సహా. శిష్యులదగ్గర దక్షిణ ముందే మా మిత్రుడు సమర్పించాడన్న విషయం కూడా మరవరాదు. తలనొప్పి, బొప్పిలకు కారణాలేమిటి? వాటికి సరైన పరిష్కారం ఏమిటి అని అడిగాడు. అప్పుడు స్వామి మొదట కళ్లు తెరిచి, తర్వాత నోరు తెరిచి నీవు అనవసరంగా ఎక్కువగా ఆలోచిస్తున్నందుకు కలిగేదే తలనొప్పి, నాదగ్గరికి వచ్చావు చూడు దానివల్ల కట్టేదే తలపై బొప్పి అని ముగించేసి మళ్లీ జ్ఞాన నిద్రలోకి పోయాడు.

- జంధ్యాల రఘుబాబు, 9849753298

సైనికుని కొడుకు స్వగతం

ఆర్. సుధాభాస్కర్



అవును! ఇది ఎవరో ఒక సైనికుని గురించి కాదు. 'ఆ' సైనికుని గురించే! ఆయన అరుదైన మనుషుల్లో ఒకరు. దానికి కారణం ఆయన ఏనాడూ భారతదేశంలోని ఏ కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు కాదు. కాని మొత్తం కుటుంబాన్ని శాస్త్రీయ ఆలోచనలవైపు నడిచేలా, తనకున్న ఇద్దరు కొడుకులు సీపీఐ(ఎం) పూర్తికాలం కార్యకర్తలైనా మనస్ఫూర్తిగా అంగీకరించి అమ్మనీ ఒప్పించేలా చేసాడు. ఆయనే ఆర్ జనార్దన్.

ఆయన నోటితో చెప్పిన వాటికంటే ఆచరించి చూపినవే ఎక్కువ. అవే ఆయన్ని ఉన్నతంగా నిలుపుతాయి. వాస్తవానికి నిలిపాయి కూడా. ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగిగా చేరి అనతికాలంలోనే దాని జాతీయాకరణ కోసం సాగిన ఉద్యమంలో పాల్గొన్నారు. అది రెండు అంశాలను ఆయనకు నేర్పింది. ఒకటి.. ప్రభుత్వరంగ ఎల్‌ఐసీపై మక్కువ. రెండు.. పోరాడి ఎల్‌ఐసీని సాధించుకున్న సంతృప్తే కాదు, పోరాటమే ఫలితాలనిస్తుందన్న విశ్వాసం. చిటారు కొమ్మనున్న చింతకాయని రాల్చాలంటే రాయితో దెబ్బకొట్టాల్సిందేననేది ఆయన మాట! ఈ దృక్పథం 1968-69 మధ్యలో ఎల్‌ఐసీలో ఆటోమేషన్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో భాగమయ్యేం దుకు తోడ్పడింది. సరిగ్గా ఆ కాలంలోనే కామ్రేడ్స్ సరోజ్ చౌదరి, సునీల్ మైత్రాలను ఒంగోలు నుండి శ్రీకాకుళం వరకు (అప్పటికి అదంతా మచిలీపట్నం డివిజనే) ప్రతి బ్రాంచీకి కార్లో తీసుకెళ్ళారు. ఆ విధంగా ఆ నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడింది.

ఆరు పదుల వయసు నిండి 1991లో ఎల్‌ఐసీ నుండి రిటైర్ అయిన కా॥ జనార్దన్ పీవీ, మన్మోహన్‌ల విధానాలు, ఆ తర్వాత బీజేపీ విధానాలు ఎల్‌ఐసీని దెబ్బతీస్తున్న తీరు, ఇన్సూరెన్స్ వర్కర్ అధ్యయనం ద్వారా తెలుసుకుని పాలకుల వర్గ స్వభావం అర్థం చేసుకునేందుకు తోడ్పడిందని మాత్రం కచ్చితంగా చెప్పగలను. రాత్రి 9.30-10 గంటల మధ్య ఆయన నిద్రపోవాల్సిందే. ఉదయం 4 గంటలకు లేచి కాఫీ తాగి దాదాపు గంటన్నరసేపు ఆసనాలు వేయడంతో ఆయన దినచర్య ప్రారంభమవుతుంది. దీనికి సుమారు డెబ్బయ్యేళ్లుంటాయి. నవతెలంగాణలో పనిచేస్తున్న నాకు కామ్రేడ్ వేణుగోపాల్ ఇన్సూరెన్స్ వర్కర్ ఇస్తే నేను రాత్రి 10-10.30 మధ్య ఇంటికెళ్లి లేపి ఇస్తే మాత్రం దాన్ని ఆబగా రాత్రి 11 దాటే వరకు చదివేవారు.

నేటి పార్టీ కార్యకర్తలు ఆయన్నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉందని నా అభిప్రాయం. తను నమ్మిన విషయాన్ని బ్రహ్మరుద్రాదులు అడ్డుకున్నా అమలు చేసి చూపడం, అటూ, ఇటూ ఊగిసలాటలుండేవికావు. మా తాత చనిపోయిన తర్వాత కొంతకాలం మాసికాలు, తద్దినాలు జరిపి, పిండప్రదానాలు చేసిన వ్యక్తి ఆ తర్వాత తన ఆలోచనా సరళి మారి శాస్త్రీయ దృక్పథం అలవడిన తర్వాత అన్నీ ఆపేశారు. జంధ్యం తీసేశారు. ఇంట్లోకి ఆవును తెచ్చి తిప్పకపోతే అరిష్టమని, పెద్దాయన దెయ్యమవుతాడని పొరుగింటివారు చెప్తే, తన తండ్రి దెయ్యమైతే తనని, తన పిల్లల్నీ ఏమీ చేయడని చెప్పి అదే కిరాయింట్లో మరి కొంతకాలం ఉన్నాం.

మా బామ్మ చనిపోయినపుడు కనీసం గుండు కూడా చేయించుకోలేదు. ఇదంతా తన పిల్లలు, చిన్న తమ్ముడు ఆర్. శామ్‌సుందర్, ఆయన భార్య హేమలతల ప్రభావమేనని చెప్పగలను. తన కింది వారి నుండి, వయసులో చిన్నవారి నుండి కూడా నేర్చుకున్నారు. ఎల్‌ఐసీ హౌసింగ్ లోన్‌తో ఇల్లు కట్టాలనుకున్నారు. అప్పటికే (1962) ఎల్‌ఐసీలో గుమాస్తాగా ఉద్యోగంలో చేరిన మా అమ్మకు లోన్ ఎలిజిబిలిటీ రాలేదు. తన ఎలిజిబిలిటీ రూ.14,100లు. ఒక్కపైసా అదనంగా అప్పు చేయకుండా ఆ రూ.14 వేలలోనే 4 రూముల ఇల్లు కట్టారు. ఆ విధంగా 1969లో చిన్నగూడుకు యజమానయ్యారు జనార్దన్. కనీస అవసరాలు తీరాలి. పటాటోపాలకు ఆ కామ్రేడ్ వ్యతిరేకం. నిరాడంబరత్వం ఆయనకు అదనపు ఆభూషణం. ఆ విలువలు మేమూ అలవరుచుకున్నాం. ఒక దశలో ఇంట్లో మా అమ్మకి, చెల్లికి తప్ప మగవారంతా చాపలపైనే నిద్రించాలనే అలవాటు చేశారు. 2025 మార్చి వరకు ఆయనకు చెక్క బల్లే ఉండింది. రఘు, నేను కూడా ఆ అలవాటునే నేటికీ కొనసాగిస్తున్నాం. ఆ నిరాడంబరత్వం, వొదిగి ఉండే గుణాలే తరువాతి కాలంలో కా॥ సుందరయ్యకు, సీపీఐ(ఎం)కు సానుభూతిపరుడిగా మార్చాయి.

చదువుకున్నది ఎస్‌ఎస్‌ఎల్‌సినే. రామకృష్ణా మఠ్ భావాలతో ఉన్నపుడే ప్రారంభమైన ఇంగ్లీష భాషా తృష్ణ ఇన్సూరెన్స్ వర్కర్‌తో ముగిసిందేమోనని నేను భావిస్తాను. గతంలో పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయాలు, అదీ కా॥ ఎమ్.బీ. ఎడిటర్‌గా ఉన్న రోజుల్లో ఆయన భాషా దాహార్తిని తీర్చేవి. ఆయన రొటీన్ మధ్యాహ్నం అరగంట నిద్ర ఉండేది. ఆ అరగంట పడుకుని హఠాత్తుగా లేచి డిక్షనరీలో ఒక మాట అర్థం వెతుక్కుని మళ్లీ లైట్ స్విచ్ ఆఫ్ చేసినట్టు నిద్రలోకి జారుకునేవారు. ఆయన ఆలోచన అంతకుముందు చదివిన విషయాలను మననం చేసుకుంటూనే ఉండేదని నాకు అర్థమయింది.

ఫలానా పుస్తకం ఇంగ్లీషులో ఉండటంవల్ల చదవలేకపోయానని, తమకు ఇంగ్లీషు రాదని చెప్పే కార్యకర్తలకు ఇటువంటి అంశాలు ఉపయుక్తంగా ఉంటాయని రాశాను. "ఏదీ తనంత తానే నీ దరికిరాదు. శోధించి సాధించాల"నే వెలుగు నీడలు సినిమా పాట ద్వారా శ్రీశ్రీ చెప్పిందిదే!

'సైనికుడు' పదానికి వివరణ అవసరం. బందరులో డా.కుప్పా వెంకటరామశాస్త్రి అని పేరున్న వైద్యులు. మా బాబుకు చాలా గౌరవం. ఒక మీటింగు సందర్భంగా మా బాబును ఆయన 'హనుమాన్' అని పిలవడం నేను విన్నాను. రూపంలో 'కండలు'ంటాయని మాత్రమే కాదు, 'సారం'లో సిన్సియర్ సైనికుడని అర్థం.

ఆయన మచిలీపట్నం డివిజన్ (ఐసీఈయూ) ప్రెసిడెంట్ అయినా, ఇన్సూరెన్స్ పెన్షనర్ల సంఘానికి ఆలిండియా ఆఫీసు బేరర్‌గా ఉన్నా నిండు విస్తరిలా వొదిగి ఉండేవారు. ఎంగిలి విస్తరాకులా ఎగిరెగిరి పడేవారు కాదు. కెమేరా క్లిక్కుల కోసం తాపత్రయ పడలేదు. రామకృష్ణా మఠ్‌లో ఒక కుష్టిరోగికి తన చేతులతో అన్నం తినిపిస్తున్న ఘటన చూసి ఒక స్వామీజీ ఇతర స్వామీజీలను వారెందుకాపని చేయలేదని నిలదీసిన సందర్భం ఉంది. అందుకే డాక్టర్ వెంకట్రామ శాస్త్రి 'హనుమాన్' అన్నది.

మా బాబుకు ఏఐఐఈఏ అంటే ప్రాణం. కామ్రేడ్స్ సరోజ్ చౌదరి, సునీల్ మైత్రాలంటే వల్లమాలిన గౌరవం. ఆయనకి డ్రైవింగ్ లైసెన్స్ ఉండటంతో పై నేతలు ఏపీకి వస్తే కారు డ్రైవర్‌గా ఉండేవారు. ఆయనకి హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉంది. 1977లో దివిసీమ ఉప్పెన సందర్భంగా ఒక మినీ బస్సు ఎల్‌ఐసీ యాజమాన్యం ఇస్తే సరుకుల రవాణాకు ఆయనే సారథి. బందరు, దివితాలూకాల మధ్య వారధిగా వ్యవహరించారు.

> నేటి పార్టీ కార్యకర్తలు ఆయన్నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉందని నా అభిప్రాయం. తను నమ్మిన విషయాన్ని బ్రహ్మరుద్రాదులు అడ్డుకున్నా అమలు చేసి చూపడం, అటూ, ఇటూ ఊగిసలాటలుండేవికావు. మా తాత చనిపోయిన తర్వాత కొంతకాలం మాసికాలు, తద్దినాలు జరిపి, పిండప్రదానాలు చేసిన వ్యక్తి ఆ తర్వాత తన ఆలోచనా సరళి మారి శాస్త్రీయ దృక్పథం అలవడిన తర్వాత అన్నీ ఆపేశారు. జంధ్యం తీసేశారు. ఇంట్లోకి ఆవును తెచ్చి తిప్పకపోతే అరిష్టమని, పెద్దాయన దెయ్యమవుతాడని పొరుగింటివారు చెప్తే, తన తండ్రి దెయ్యమైతే తనని, తన పిల్లల్నీ ఏమీ చేయడని చెప్పి అదే కిరాయింట్లో మరి కొంతకాలం ఉన్నాం.

దీన్లో మా అమ్మ పాత్ర చిన్నదేమీ కాదు. ఆయన ఆదర్శాలను సంపూర్ణంగా ఆమోదించడమే కాదు, వాటిని ఆమె కూడా స్వీకరించబట్టే ఇల్లు ఆనందమయంగా, ఆదర్శాల కేంద్రంగా ఉండింది.

చివరి పది రోజులు ఏమీ మాట్లాడలేక పోయారు. ఘన పదార్థాలేవీ లోపలికి పోలేదు. కొబ్బరి బొండాం నీళ్లయినా మొదట స్పూనుతో పోసేవారం. ఆ తర్వాత ఇంకు ఫిల్లర్ సాయం తీసుకున్నాం. బ్లాడర్‌లో దీర్ఘకాలం మూత్రం నిల్వ ఉండటంతో కుడివైపు కిడ్నీ బాగా వాచిపోయిందని స్కానింగ్ రిపోర్టులో బయటపడింది. ఎడమవైపు ఊపిరితిత్తుల్లో నెమ్ముజేరింది. బహుశా 70 ఏండ్లుగా ఆయన చేసిన ప్రాణాయామం వల్ల గుండెధైర్యంగా నిలబడి పోరాడింది. చివరికి మార్చి 7 తెల్లవారుఝామున 2.15 నిమిషాలకు అదీ ఓడిపోయింది. కామ్రేడ్ జనార్దన్ కనుమూశారు.



ప్రణయ్ హంతకునికి ఉరిశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ ఎస్టీ /ఎస్టీ (పిఓఏ) యాక్టు 1989 , సెక్షన్ 25 (ఐఎస్ఏ) అండ్ 27 (3) ఆఫ్ అండ్ ఇండియన్ ఆర్మ్స్ యాక్ట్ 1959 కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి కోర్టులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఐదేండ్ల పాటు కేసు వాదోపవాదాల అనంతరం నిందితుల్లో ఏ1 మారుతిరావు బెయిల్‌పై బయటకు వచ్చి 2020లో హైదరాబాద్‌లో సూసైడ్ చేసుకున్నారు. ఏ2 సుభాష్ శర్మకు ఉరి శిక్ష, ఏ3 మహమ్మద్ అస్గర్ అలీ, ఏ4 మహమ్మద్ అబ్దుల్ బారి, ఏ5 మహమ్మద్ అబ్దుల్ కరీం, ఏ6 తిరునగరి శ్రవణ్, ఏ7 సముద్రాల శివ, ఏ8 ఎం.ఎ.నిజాంకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ 2వ అదనపు సెషన్స్ కోర్టు సోమవారం తుది తీర్పును వెలువరించింది. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ పి.శ్రీనివాస్ (ఎస్డిపిఓ మిర్యాలగూడ), సబ్ ఇన్‌స్పెక్టర్ బి.సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ పీఎస్, ప్రస్తుతం ఎస్‌డీపీఓ కె.రాజశేఖర రాజు, ఎస్‌డీపీఓ మిర్యాలగూడ పీఎస్‌డి ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మిర్యాలగూడ-1(టి) సైదిరెడ్డి, ఎస్ఐ సిడిఓ సిహెచ్, వీరస్వామి, ఏఎస్ఐ మధుసూధన్, లైజన్ అధికారులు, పినరేందర్, ఎన్.మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.



భారీ పోలీస్ బందోబస్తు..

ప్రణయ్ హత్య కేసులో తుది తీర్పు సందర్భంగా సోమవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో డీఎస్పీ శివరాంరెడ్డి సారథ్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. నిందితులు అస్గర్‌ను గుజరాత్ రాష్ట్రం సబర్మతి జైలు నుంచి, అబ్దుల్ బారి, సుభాష్ శర్మను నల్లగొండ కోర్టుకు తీసుకురావడంతో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఇతరులను ఎవరినీ కోర్టు ఆవరణలోకి అనుమతించలేదు.

ప్రతి ఆధారాన్నీ కోర్టుకు సమర్పించాం
పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ



ప్రణయ్ హత్య కేసులో పోలీసులు సేకరించిన ప్రతి ఆధారాన్నీ కోర్టుకు సమర్పించడంలో కీలకంగా వ్యవహరించామని నల్లగొండ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ చెప్పారు. తీర్పు అనంతరం కోర్టు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ప్రణయ్ దురహంకార హత్య తీర్పు కూడా సంచలనంగా మిగిలిందన్నారు. 2019 నుంచి నేటి వరకు 102 మంది సాక్షులను సేకరించి, 82 మందిని విచారించి, 1600 పేజీల చార్జిషీటును సమర్పించినట్టు వివరించారు.

న్యాయం గెలిచింది

నల్లగొండ జిల్లా కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
కుల దురహంకారులకు కనువిప్పు కలగాలి
బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలి
కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ-నల్లగొండ క్లాక్‌టవర్

ప్రణయ్ హత్య కేసులో న్యాయం గెలిచిందని, కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. నల్లగొండలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, అధ్యక్షులు కొండేటి శ్రీనుతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైశ్య సామాజిక తరగతికి చెందిన అమృతను దళిత యువకుడు పెరుమాళ్ల ప్రణయ్ ప్రేమ వివాహం చేసుకోవడంతో ప్రణయ్‌ను హత్య చేయించిన కేసులో ఏ1 నిందితుడు, యువతి తండ్రి మారుతిరావు 2020లో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మిగిలిన ఏడుగురు నిందితులలో ఏ2 శర్మకు ఉరి శిక్షతోపాటు మరో ఆరుగురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును కేవీపీఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తోందని చెప్పారు. ఈ తీర్పు తర్వాత ప్రణయ్ కుటుంబానికి, అతని భార్య అమృతకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 128 కులదురహంకార హత్యలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కుల దురహంకార హత్యలు, దాడులను పౌర సమాజం, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాలన్నారు. నాడు మారుతిరావుకు మద్దతుగా.. నిందితులకు అండగా నల్లగొండలో ప్రదర్శన చేసిన మతోన్మాదుల వైఖరిని ఖండించాలన్నారు. రాష్ట్రంలో మరో కుల దురహంకార హత్య జరగకుండా చూడాలన్నారు. ఈ కేసులో న్యాయం కోసం మొదటి నుంచి తమ సంఘం ముందుండి పోరాడిందని గుర్తు చేశారు. అమృతకు అండగా ఢిల్లీ నుంచి పార్లమెంటు సభ్యులను రప్పించిందన్నారు. తమిళనాడులో కుల దురహంకార హత్యలో భర్తను కోల్పోయి.. న్యాయపోరాటంలో గెలిచిన కౌసల్యతో అమృతకు భరోసా ఇప్పించినట్టు చెప్పారు. ఈ పోరాటంలో న్యాయం వైపు బాధితుల తరపున నిలబడ్డ న్యాయవాదులకు, పోలీసులకు, మీడియాతోపాటు పోరాటంలో అండగా నిలబడిన సామాజిక సంఘాలకు కేవీపీఎస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రెమిడాల పర్శరాములు, కోడి రెక్క రాధిక, గాదె నరసింహ, బొల్లు రవీంద్ర కుమార్, వంటేపాక కృష్ణ, పెరిక విజయ్ కుమార్, కోడి రెక్క మల్లన్న, దైద శ్రీను, దొంతలా నాగార్జున, దండు రవి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు తీర్పు హర్షణీయం : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రణయ్‌కి సంబంధించిన కులదురహంకార హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ స్వాగతించింది. ఈ తీర్పు హర్షణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులదురహంకారులకు ఈ తీర్పు తీవ్ర హెచ్చరికగా ఉందని పేర్కొన్నారు. 2018లో నల్లగొండలో ప్రణయ్, అమృత కులాంతర వివాహం చేసుకున్నారని వివరించారు. కులదురంహకారంతో అమృత తండ్రి మారుతీరావు ప్రణయ్‌ను నడిరోడ్డుపై అత్యంత కిరాతకంగా హత్య చేయించారని తెలిపారు. ఈ హత్యకు వ్యతిరేకంగా అమృతకు సీపీఐ(ఎం) అండగా నిలబడిందని గుర్తు చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో నేటికీ అనేక కులదురహంకార హత్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తీర్పుతోనైనా కనువిప్పు కలగాలని కోరారు.

నిధులకోసం అవసరమైతే ఢిల్లీలో ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు, బీజేపీకి మధ్య బలమైన సంబంధం ఉందనీ, అందుకే బీజేపీ ఎంపీలు డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి రాలేదని విమర్శించారు. బీసీ కులగణనతో సామాజిక న్యాయం జరిగిందని సీఎం అభిప్రాయపడ్డారు. తాము చేసిన గణన వల్లనే అన్ని పార్టీలు బీసీలకు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చాయన్నారు.

పైశాచిక ఆనందం

రైతులు బాధ పడుతుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తీన్మార్ డ్యాన్సులు వేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీని పెండింగ్‌లో పెట్టిన బీఆర్ఎస్ కాళేశ్వరం కట్టిందన్నారు. అప్పుడే ఆ సొరంగాన్ని పూర్తి చేసినట్టైతే సమస్య తలెత్తేది కాదన్నారు. పంటలు ఎండిపోతున్నాయని పిచ్చిగా మాట్లాడటం మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు పిలుపునిచ్చారు. కరువు ఎక్కడుందని ప్రశ్నించారు. గతంలో 35 లక్షల ఎకరాల్లో పంట వేస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారని వివరించారు.

కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులపై చర్చకు సిద్ధమా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం సవాల్ విసిరారు. చర్చకు తాను, తనతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నుంచి కట్టిన పన్నులు ఎన్ని? కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రానికి ఇచ్చిందెంతో తేలుద్దామన్నారు. కేంద్రం ఒకవేళ అధికంగా నిధులు ఇచ్చినట్టు నిరూపిస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి తానే మెట్రో తెచ్చానని చెబుతున్న కిషన్ రెడ్డి, ఆయన తెచ్చిన మెట్రో ఎక్కడుందో చూపించాలని ఎద్దేవా చేశారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ చేపట్టవద్దని ఓ వైపు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్ ఆందోళనలు చేస్తూ అడ్డుపడుతూ మళ్లీ వారే భూసేకరణ చేయట్లేదని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనని తేల్చి చెప్పారు. రింగ్ ఉంటేనే రింగ్ రోడ్డు అంటారనీ, సగం పూర్తి చేసిన వాటిని రింగ్ రోడ్డు అనరని కిషన్‌రెడ్డిపై సెటైర్ విసిరారు. మోడీ ఇస్తానని చెప్పిన రీజినల్ రింగ్ రోడ్డు ఎక్కడుందని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క అఖిలపక్షాన్ని ఆహ్వానిస్తే బీజేపీ నాయకులు ఎందుకు డుమ్మా కొట్టారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్ సమావేశానికి కిషన్ రెడ్డి ఎందుకు రాలేదని నిలదీశారు. మోడీ బుల్లెట్ ట్రైన్ గుజరాత్‌కు ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాకే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని గుర్తుచేశారు.

కేసీఆర్‌కు ఆ స్థాయి లేదు

కేసీఆర్ చెల్లని రూపాయి అనీ, ఆయన గురించి మాట్లాడటం వృధా అని సీఎం రేవంత్ రెడ్డి తీసిపారేశారు. కేసీఆర్‌ను తమ పార్టీ బండకేసి కొట్టి బీఆర్ఎస్‌ను ఓడించిందని గుర్తుచేశారు. అసెంబ్లీకి వచ్చే స్థాయి కేసీఆర్‌కు లేదని విమర్శించారు. నేరస్తులు కేసులకు భయపడరనీ, ఆ భయమే ఉంటే కేటీఆర్ నేరాలు చేయరని ఘాటుగా విమర్శించారు. డీలిమిటేషన్ కోసం భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ వేసినట్టు సీఎం గుర్తుచేశారు.

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)



రాష్ట్రాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయన్నారు. ఈ పథకంపై ఎంఓయూపై సంతకాలు చేయడానికి మరో 20 రోజులు మాత్రమే గడువు ఉందని చెప్పారు. తమిళనాడు విద్యార్థుల సంక్షేమం పట్ల డీఎంకేకు నిజాయితీ లోపించిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును వారు నాశనం చేస్తున్నారని అన్నారు. "భాషాపరమైన అవరోధాలు కల్పించడం ఒక్కటే వారి పని. వాళ్లు రాజకీయాలు చేస్తున్నారు. రాద్ధాంతం చేస్తున్నారు. అది అప్రజాస్వామికం, అనాగరికం" అని మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకం అవగాహన ఒప్పందంపై సంతకం చేయాలని, అలా చేస్తే ఎన్ఈపీ 2020ని అమలు చేస్తుందని అన్నారు. ప్రతిగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందని పేర్కొన్నారు. దీంతో డీఎంకేతో సహా ప్రతిపక్షాలు ఒక్కసారిగా పోడియం వద్దకు దూసుకొచ్చి ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి, మంత్రి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాల హోరెత్తించారు. దక్షిణాది రాష్ట్రాలను బలిపశువులను చేయడాన్ని ఆపాలని నినాదాలతో సభ దద్దరిల్లింది. దీంతో సభలో తీవ్రమైన గందరగోళం నెలకొంది. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు. అనంతరం డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ మంత్రిపై హక్కుల తీర్మానం ప్రవేశపెతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీపై సంతకం చేయకపోతే, త్రిభాషా విధానాన్ని ఆమోదించకపోతే, తమిళనాడులో పాఠశాల విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.2,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేయమని కేంద్రం చెప్పడం దారుణమన్నారు. ఎన్ఈపీపై డీఎంకే ప్రభుత్వం ఆందోళనలు లేవనెత్తుతుందని, ఆ విధానాన్ని పూర్తిగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు సంబంధించిన నిధులను ఎన్ఈపీతో అనుసంధానించకూడదని అన్నారు. తమ వైఖరిలో మార్పు ఏమీ లేదని, మంత్రి తమను అబద్ధాల కోరులు, అనాగరికులు అని అనడం సిగ్గు చేటని విమర్శించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడారని, తాము ఏ భాషకూ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కానీ తమను అనాగరికులు అని పిలవడం దారుణమని, దీనిపై తమ నాయకులతో చర్చించి మంత్రిపై ప్రివిలేజ్‌మోషన్ ఇస్తామని అన్నారు.

తమిళనాడు మూడు భాషల విధానాన్ని అంగీకరించకపోవడంపై సామాజికంగా, రాజకీయంగా ఏకాభిప్రాయం ఉందని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అన్నారు. తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని ఎప్పటికీ అంగీకరించదని, రెండు భాషల ఫార్ములానే తాము అంగీకరిస్తామని అన్నారు. తమిళనాడులో బీజేపీ పదే పదే ఓటమి చెందుతుందని, అయినప్పటికీ తమ సెంటిమెంట్లను గౌరవించడానికి ముందుకు రావటం లేదని ఎద్దేవా చేశారు. దక్షిణాది ప్రజలకు సమాన గౌరవం ఇవ్వాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. కేంద్ర మంత్రి అసభ్యకరంగా, అవమానకరంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. తమిళులను అనాగరికులు అని అనడం దారుణమని ధ్వజమెత్తారు. ఈ పదం భారత దేశం గురించి బీజేపీ ప్రభుత్వ ఆలోచనను స్పష్టం చేస్తోందని, ఇది ఖండించతగినదని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా అందరం గొంతెత్తుతామని, తమిళ ప్రజలందరికీ సమాన గౌరవం ఇవ్వాలని మేము కోరుకుంటున్నామని అన్నారు. సరిగ్గా సమాధానం చెప్పడానికి బదులుగా కేంద్ర మంత్రి తమిళులను అనాగరిక ప్రజలు అనడం సిగ్గు చేటని విమర్శించారు.

ఓటరు జాబితాపై చర్చ జరగాలి రాహుల్ గాంధీ

సభలో జీరో అవర్‌ను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించారు. ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలు డీఎంకే ప్రభుత్వంతో సహా వివిధ ప్రతిపక్షాలు పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఓటరు జాబితాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని ఆయన తెలిపారు.

రాజ్యసభలో ఆందోళన

రాజ్యసభలో త్రిభాష విధానం, డీలిమిటేషన్ అంశాలను ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తాయి. 'డూప్లికేట్' ఓటరు ఐడీ కార్డుల నుంచి అమెరికా నిధుల వరకు ఓటర్ల సంఖ్య వంటి అంశాలపై చర్చలకు ఇచ్చిన నోటీసులను తిరస్కరించిన తరువాత సభను సభ్యులు వాకౌట్ చేశారు. ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చెలరేగింది. ప్రతిపక్షం వాకౌట్‌పై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు వాయిదా తీర్మానానికి ముందు నిబంధనలను చదువుకోవాలన్నారు. వాళ్లు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేత సహా ప్రతిపక్ష పార్టీ నేతలు రిఫ్రెషింగ్ కోర్సుకు వెళ్లి నియమ నిబంధనలను అవగాహన చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తుండటం పార్లమెంటరీ వ్యవస్థ ప్రతిష్ఠను తగ్గించడమేనని విమర్శించారు. నిబంధనల కింద ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే దీనిపై ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కౌంటర్ ఇచ్చారు. వాయిదా తీర్మానం ఇవ్వడం సభ్యుని హక్కు అని అన్నారు. నిబంధనలు మీరు చదువుకోవాలని హితవు పలికారు.

అంగన్‌వాడీ, మిడ్ డే మీల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సాగరికా ఘోష్, కాంగ్రెస్ ఎంపీలు ప్రమోద్ తివారీ, అజయ్ మాకెన్‌ల ఎన్నికల కమిషన్ రాష్ట్రాల్లో బహుళ 'డూప్లికేట్' ఓటరు ఐడీ కార్డులను జారీని నియంత్రించడంలో విఫలమవ్వడంపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. స్టాక్ మార్కెట్ సూచీలు నిరంతరం క్షీణించడం వల్ల చిన్న పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టంపై చర్చ జరగాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ డిమాండ్ చేయగా, భారతదేశంలో ఓటర్ల సంఖ్యను పెంచడానికి అమెరికా నిధులు సమకూరుస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చర్చ జరగాలని ఎస్పీ ఎంపీ రాంజీ లాల్ సుమన్ డిమాండ్ చేశారు. రూల్ నెంబర్ 267 కింద వివిధ అంశాలపై 12 నోటీసులు వచ్చాయని, వాటిని తిరస్కరిస్తున్నట్టు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ సింగ్ ప్రకటించారు. దీంతో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి.

మార్చిలోనే భానుడి భగభగ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతున్నాడు. ఎండవేడిమితో బెదరగొడుతున్నాడు. ఉక్కపోతతో అల్లాడిస్తున్నాడు. మార్చి రెండో వారంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా నమోదవుతున్నాయి. ఒకటెండ్రు రోజుల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశాలున్నాయి. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఒకటెం డ్రు మినహా అన్ని జిల్లాల్లోనూ పగటి పూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికను హైదరాబాద్ వాతావరణ కేంద్రం జారీ చేసింది.



నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్‌కు చెరుపల్లి పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నవతెలంగాణ దినపత్రిక సంపాదకులు ఆర్.సుధాభాస్కర్‌ను సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు సోమవారం పరామర్శించారు. ఇటీవల సుధాభాస్కర్ తండ్రి జనార్ధన్ మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో చెరుపల్లి... సుధాభాస్కర్‌ను, ఆయన తల్లి ఇంద్రావతిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

కష్టానికి ఫలితమే ఈ తీర్పు

ఆలస్యమైనా తప్పకుండా న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగింది

ప్రణయ్ కేసులో చార్జ్‌షీట్ వేయడంలో ఎంతో కష్టపడాల్సి వచ్చింది
లైఫ్‌లో సెటిల్ అయ్యాకే మంచి నిర్ణయం తీసుకోవాలి :
హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలీసుల కష్టానికి ఫలితంగా నిందితులకు శిక్షపడిందని, ఆలస్యమైనా బాధితులకు తప్పకుండా న్యాయం జరుగుతుందని.. తాజాగా మిర్యాలగూడ ప్రణయ్ కేసులో తీర్పే ఇందుకు నిదర్శనమని హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ తెలిపారు. సంచలనం సృష్టించిన మిర్యాలగూడ పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ కోర్టు వెలువరించిన తీర్పుపై ఆయన స్పందించారు. ప్రణయ్ హత్య జరిగిన సమయంలో ఆ జిల్లా ఎస్పీగా రంగనాథ్ పనిచేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తప్పు చేసిన వారు తప్పించుకోవచ్చు అనుకుంటారుగానీ, వారికి ఎప్పటికైనా తప్పకుండా శిక్షపడుతుందన్నారు. కేసుల విచారణలో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారని, నేరస్థులు తప్పించుకోకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతుందని అన్నారు. దాదాపు ఆరేండ్ల తర్వాత ఈ కేసు సుదీర్ఘమైన ట్రయల్ అయిన తర్వాత నేరస్థులకు శిక్షపడిందని తెలిపారు. ఈ కేసులో ఆలస్యంగా తీర్పు వచ్చేందుకు కొన్ని టెక్నికల్ రీజన్‌లు కూడా ఉన్నాయన్నారు. 2019లో చార్జ్‌షీట్ వేస్తే 2021 డిసెంబర్ వరకు తాను అక్కడే ఉన్నానని, అయితే కొందరు ఆలస్యం చేయడానికి ప్రయత్నించారన్నారు. అమృత తండ్రి మారుతిరావు డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తి అని, ప్రతి దాన్నీ మేనేజ్ చేయడానికి ప్రయత్నిస్తారని తెలుసుకునే కేసు దర్యాప్తులో అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామని తెలిపారు. ఇందులో ముద్దాయిలుగా ఉన్నవారు మామూలు వ్యక్తులు కాదని, ఐఎస్ఐ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వాళ్లని, గుజరాత్, అహ్మదాబాద్‌లో ఓ వ్యక్తిని చంపిన దాంట్లో ఉన్నారని చెప్పారు. ఒక పథకం ప్రకారమే హత్య జరిగిందన్నారు. బీహార్ నుంచి వచ్చి ఇక్కడ రోడ్డుపై నరికారని, వారి మొహం కూడా గుర్తుపట్టలేదని, వెనుక వైపు నుంచి నరికిన వీడియోను చూశామన్నారు. మారుతిరావు తనకు ఏం తెలియదని, తాను హైదరాబాద్‌లో ఉన్నానని ఎంతో అమాయకంగా చెప్పారన్నారు. కానీ, మంచివాడిగా నటిస్తూ ఈ దారుణానికి ఒడిగట్టాడన్నారు. అప్పటి డీజీపీ ఎం.మహేందర్ రెడ్డి కేసును ప్రత్యేకంగా పరిశీలించారన్నారు. ఐజీ స్టీఫెన్ రవీంద్ర గైడ్‌లైన్స్ ఇచ్చేవారన్నారు. అప్పటి మిర్యాలగూడ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌తోపాటు టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు రాత్రింబవళ్లుసాక్ష్యాలను సేకరించడం లో ఎంతో కృషి చేశారన్నారు. టీం వర్క్, పట్టుదలతోపాటు సాక్షులు సహకరించడంతో నిందితులకు శిక్షపడిందని అభిప్రాయపడ్డారు. ఈ కేసు దేశంలోనే కాదు అంతర్జాతీయంగాను సంచలనం రేపిందన్నారు. నిందితులకు శిక్ష పడేవిధంగా అన్ని సాక్ష్యాలూ సేకరించినవారితో పాటు కీలకం గా వ్యవహరించిన అధికారులకు, సాక్షులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



మెచ్యూర్‌గా ఆలోచించాలి..

యువకులు లైఫ్‌లో మెచ్యూర్‌గా ఆలోచన చేయాలని, ఒక డిసిషన్ తీసుకునే ముందు లైఫ్‌లో స్థిరపడాలని, ఆ తర్వాత మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఏ విషయమైనా ఇంట్లో వారికి చెప్పాలన్నారు. ఈ కేసులో అమృత తండ్రిని కోల్పోయిందని, బాలస్వామి కొడుకుని కోల్పోయాడని గుర్తు చేశారు. నేరస్థులు చేసే తప్పు వల్ల వారి కుటుంబాలూ బాధపడతాయన్నారు. ఈ కేసు వల్ల సమాజం సైతం కొన్ని అంశాలను నేర్చుకోవచ్చన్నారు.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank | బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్స్, బొమ్మనహల్లి హెూసూర్ మెయిన్ రోడ్, బెంగుళూరు-560068.

ఏదైతే, క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలను, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయ స్వాధీనం తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	బైరగాని శ్రీనివాస్/ బైరగాని పావణి / LBHYD00006497096/ TBHYD00006368526	యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్-టి.ఎస్ వద్ద ఇంజినీర్స్ కాలనీ వద్దగల సర్వే నం.115 లో ప్లాట్ నం.24 లో 925చ.గ.లు లేదా 773చ.మీ.ల విస్తీర్ణపు పూర్తి ల్యాండ్‌నకుగాను 46.25చ.గ.లు లేదా 38.66చ.మీ.ల విస్తీర్ణంతో విడదీయలేని ల్యాండ్ భాగంతోపాటు 800చ.అ.ల (ఉమ్మడి ఏరియాతో కలిపి) విస్తీర్ణంతో "మహేశ్ అపార్టుమెంట్స్" యొక్క రెండవ అంతస్తు పై జిహెచ్ఎంసి నం.8-3-318/ ఎం/202 (పిటిఐ నం.1100824702)తో ఫ్లాట్ నం.202 యొక్క మొత్తం భాగం. మరియు సరిహద్దులు: ల్యాండ్‌కు సరిహద్దులు: ఉత్తరం: 30'-0" వెడల్పు రోడ్డు, దక్షిణం: పొరుగువారి ల్యాండ్, తూర్పు: డా॥ వై.కిషన్ రావు యొక్క ప్లాట్ నం.23, పడమర: కెఆర్ చౌదమణి యొక్క ప్లాట్ నం.25, ఫ్లాట్ యొక్క సరిహద్దులు: ఉత్తరం: ఫ్లాట్ నం.201. దక్షిణం: ఫ్లాట్ నం.203, తూర్పు: ఓపెన్ టు స్కై&, పడమర: కారిడార్, **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 05.03.2025.**	28/10/2024 Rs. 29,07,841.72/-	హైదరాబాద్
2.	ప్రవీణ్ కుమార్ గంధం / జి. స్వాతి రాణి/ LBHYD00006181755 / LBHYD00003169873	లోన్ డాక్యుమెంట్/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా పీర్జాదిగూడ గ్రామం& మున్సిపాలిటీ, మేడిపల్లి మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్దగల ఆర్‌సిసి ప్లింత్ ఏరియా 703చ.అ.లు కలిగి సర్వే నం.లు 127, 128, 149 & 150 (పాస్ బుక్ ప్రకారం సర్వే నం.లు 128/ఏఏ, 149/ఏఏ & 150/ఏ)లో 125చ.గ.లు లేదా 104.5చ.మీ.ల విస్తీర్ణంతో ప్లాట్ నం.45 దక్షిణ భాగం & ప్లాట్ నం.46 ఉత్తర భాగం పై అసంపూర్తి ఇంటి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.45 ఉత్తర భాగం, దక్షిణం: ప్లాట్ నం.46 దక్షిణ భాగం, తూర్పు: 25' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నం.లు 51&52 / **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 06.03.2025.**	07/08/2024 Rs. 11,74,457.88/-	హైదరాబాద్
3.	నీలిమ పవన్ / కాయిప శేషా పవన్/ LBHYD00003718290/ LBHYD00003750239/ LBHYD00003750256	షెడ్యూలు 'ఎ': రంగారెడ్డి జిల్లా, ఉప్పల్ మండలం, నాగోల్ గ్రామం, మమత నగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్ వద్దగల సర్వే నం.30/యుయు లో 2ఎక.18.34గుంటల విస్తీర్ణపు ల్యాండ్ యొక్క ల్యాండ్ షెడ్యూలు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ స్పేస్ పార్క్, దక్షిణం: 40' రోడ్డు, తూర్పు: కృష్ణా రెడ్డి ల్యాండ్, పడమర: ఎన్విరాన్ ఎస్టేట్ ల్యాండ్. షెడ్యూలు "బి" షెడ్యూలు ఫ్లాట్: జతపరచిన ప్లానులో ఎరుపురంగులో గుర్తించినట్లు రంగారెడ్డి జిల్లా, ఉప్పల్ మండలం, ఎల్.బి.నగర్ మున్సిపాలిటీ, నాగోల్ గ్రామం, మమతా నగర్ కాలనీ, సర్వే నం.30/యుయు, బ్లాక్ నం.1 లో షెడ్యూలు ల్యాండ్ పై నిర్మించిన "ఎన్విరాన్ టవర్స్"గా పేరుగల నివాసిత అపార్టుమెంట్‌లో స్టిల్ట్ ఫ్లోర్ లో 100చ.అ.ల విస్తీర్ణంతో ఒక కార్ పార్కింగ్ ఏరియా కేటాయింపు 50చ.గ.లు లేదా 41.8చ.మీ.ల విస్తీర్ణంతో ల్యాండ్ యొక్క విడదీయలేని భాగంతోపాటు 1240చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియా, బ్లాక్ -బి యొక్క రెండవ అంతస్తులోని అసంపూర్తి డీలక్స్ ఫ్లాట్ నం.8-203 యొక్క మొత్తం ఫ్లాట్. మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: 10' కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై / **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 06.03.2025.**	16/12/2024 Rs. 18,92,986.30/-	హైదరాబాద్
4.	లోకేష్ గురుంగ్ / ప్రీతి రాణా / LBHYD00004923746	రంగారెడ్డి జిల్లా, ప్రస్తుతం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, కాప్రా గ్రామం యొక్క సర్వే నం.లు 662, 663, 667, 668 & 671లో జనప్రియ లేక్ ఫ్రంట్, ఎక.32-17గుంటల విస్తీర్ణపు ల్యాండ్‌నకుగాను ఎక.12-29.4గుంటకుగాను 17.22చ.మీ.లు లేదా 20.60చ.గ.ల విస్తీర్ణంతో ల్యాండ్ మొత్తం ప్రాజెక్ట్ ఏరియా. మరియు సరిహద్దులు: ఉత్తరం: 18 మీ.ల వెడల్పు రోడ్, దక్షిణం: సర్వే నం.671 పార్ట్‌లో ల్యాండ్, తూర్పు: సర్వే నం.671 లో ల్యాండ్, పడమర: సర్వే నం.లు 671, 583 & 666లో ల్యాండ్. ఆస్తి యొక్క షెడ్యూలు: రంగారెడ్డి జిల్లా, ప్రస్తుతం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, కాప్రా గ్రామం యొక్క సర్వే నం.లు 662, 663, 667, 668 & 671లో జనప్రియ లేక్ ఫ్రంట్, ఎక.32-17గుంటల విస్తీర్ణపు ల్యాండ్‌నకుగాను ఎక.12-29.4గుంటకుగాను 17.22చ.మీ.లు లేదా 20.60చ.గ.ల విస్తీర్ణంతో ల్యాండ్ లో విడదీయలేని భాగంతోపాటు సరాసరి ఉమ్మడి ఏరియాలు & వసతులు కలుపుకొని బ్లాక్ నం.డి, (దక్షిణ వింగ్) యొక్క నాల్గవ అంతస్తులో 945చ.అ.ల విస్తీర్ణపు సూపర్ బిల్టప్ ఏరియాతో ఫ్లాట్/ అపార్టుమెంట్ నం.డి-410. మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: మెట్లకు దారి& ఓపెన్ టు స్కై, పడమర: ఫ్లాట్ నం.డి-409 / **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 06.03.2025.**	19/10/2024 Rs. 20,62,656.70/-	హైదరాబాద్
5.	దామెర్ల సుధీర్ కుమార్ / దామెర్ల రమణి / LBHYD00005366312	(లోన్ డాక్యుమెంట్/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా రంగారెడ్డి జిల్లా, ప్రస్తుతం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా, కీసర మండలం, కాప్రా గ్రామం యొక్క సర్వే నం.లు 663, 667, 668, & 671 పార్ట్‌లో షెడ్యూలు'1" పై నిర్మించి "జనప్రియ లేక్ ఫ్రంట్" వద్ద సితార పేరుతో గల ప్రాజెక్ట్ లో బ్లాక్ నం. బ్లాక్-ఎ2 లో 5వ అంతస్తులోని సంపూర్ణమైన అపార్టుమెంట్ నం.ఎ2-528 మొత్తం. మరియు కార్పెట్ ఏరియా 590.44చ.అ.లు, ఎక్స్‌క్లూసివ్ బాల్కనీలు & సర్వీస్ ఏరియా 66.47చ.అ.లు మరియు సరాసరి ఉమ్మడి ఏరియా 208.090చ.అ.లు, 865.00చ.అ. షెడ్యూలు ఏరియా పూర్తిగా కలిగియున్నదానితోపాటు అపార్టుమెంట్ & పై సెల్లార్ లెవల్‌లో 120చ.అ.ల కవరైన కార్ పార్కింగ్ స్పేస్ వినియోగ హక్కుతో ఇంటి ఉమ్మడి వసతులు& సదుపాయాల కొరకు వినియోగించు ఉమ్మడి ఏరియా లో సరాసరి వాటా యొక్క నాన్-ఎక్స్‌క్లూసివ్ పోర్షన్‌తోసహా 15.76చ.మీ.లు లేదా 18.86చ.గ.లు ల్యాండ్ లో విడదీయలేని భాగంతోపాటు 865.00చ.అ.ల షెడ్యూలు ఏరియా పూర్తిగా కలిగియున్నది. సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: మెట్లకు దారి/ **లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 06.03.2025.**	09/12/2024 Rs. 22,41,693.00/-	హైదరాబాద్

పై పేర్కొనబడిన రుణగ్రహీతలు/ హామీదారులకు బకాయి పడిన మొత్తాలను 30 రోజుల్లోగా, తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది, లేని పిమ్మట తాకట్టుపెట్టబడిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన వెంటనే విక్రయించబడుతాయి.

తేది: మార్చి 11, 2025, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత సంతకందారు,ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున.



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతుల ఆత్మహత్యాయత్నం

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు తమ భూములు తీసుకోవద్దని డిమాండ్

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నం

అడ్డుకున్న పోలీసులు

తమకు న్యాయం చేయాలని రైతుల వినతి

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు తమ భూములు తీసుకోవద్దని డిమాండ్ చేస్తూ రైతులు ఆత్మహత్యాయత్నం చేశారు. రావిరాల గ్రామానికి చెందిన రైతులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు రైతులను అడ్డుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొంగరకుర్దు (బి) రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 13లో సుమారు 15 ఎకరాల వరకు పట్టా భూమి గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణంలో పోతోంది. ఈ భూమిలో సుధాకర్ అనే రైతుకు 2.17 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1.31 ఎకరాల భూమి రోడ్డుకు పోతుంది. ఇక మిగిలింది 21 గుంటలు మాత్రమే. సుధాకర్, ఇద్దరు పిల్లలు. వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాడి ఆవులను సాకుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నడుపుతున్నారు. మరో రైతు బాలరాజుకు ఇదే సర్వే నెంబర్‌లో 2.17 గుంటలు భూమి ఉంది. మొత్తం భూమి రోడ్డుకే పోతోంది. ఇదిలా ఉంటే భూ సేకరణలో భాగంగా అధికారులు సోమవారం రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. తమ భూముల్లోకి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. దాంతో అక్కడే ఉన్న పోలీసులు రైతులపై దౌర్జన్యంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో తీవ్ర ఆవేదనకు గురైన రావిరాల గ్రామానికి చెందిన రైతులు నర్సింహ, సుధాకర్, బాలరాజు కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చారు. 'మా భూములు పోయాక మేం బతికి ప్రయోజనం లేదు.. మా పిల్లలను ఎట్లా సాదేది..' అని ఆవేదన వ్యక్తం చేస్తూ పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకునే ప్రయత్నం చేశారు. దీన్ని గమనించిన పోలీసులు.. రైతుల చేతుల్లో నుంచి పెట్రోల్ బాటిల్స్‌ను లాక్కొన్నారు. రైతులకు సర్ది చేప్పే ప్రయత్నం చేశారు. అనంతరం రైతులను జిల్లా రెవెన్యూ అధికారికి కల్పించారు. తమ భూమిని గ్రీన్ ఫిల్డ్ రోడ్డుకు తీసుకోవద్దని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.



రోడ్డెక్కిన పసుపు రైతులు

కనీస ధర రూ.10వేలు కూడా రావట్లేదని ఆవేదన

'పసుపు బోర్డు' పట్టించుకోవడం లేదని ఆగ్రహం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్కెట్‌కు పంట పోటెత్తడంతో అదునుగా భావించిన వ్యాపారులు.. కొర్రీలు పెడుతూ అమాంతం ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పసుపు రైతులు రోడ్డెక్కారు. వారు చెప్పిన ధరకు పంట ఇవ్వట్లేదని నాలుగు రోజులుగా కొనుగోలు నిలిపివేసినట్టు వాపోయారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సోమవారం పసుపు రైతులు రాస్తారోకో చేపట్టి.. 'రైతులకు న్యాయం చేయండి, రైతులను పట్టించుకోండి.. దళారుల మోసాల నుంచి కాపాడండి..' అంటూ నినాదాలు చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి బోర్డు చైర్మెన్ పదవి జిల్లా వాసికే అప్పగించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా రైతులు అన్నారు. రైతుల రాస్తారోకోతో ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంట సైపు రైతులు బైటాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి రైతులను సముదాయించగా.. కలెక్టర్ వస్తేనే ఆందోళన విరమిస్తామని భీష్మించు కూర్చున్నారు.

పోలీసుల సమాచారంతో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. అనంతరం రైతులతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించి పసుపు ఏ విధంగా ఉందో పరిశీలించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్పగంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ గంగు, ఏసీపీ రాజ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కమీషన్ ఏజెంట్లు రైతులతో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు మండ క్వింటాకు కనీసం రూ.8000, పసుపు కొమ్ముకు రూ.9500 ధర నిర్ణయించారు. అంతకంటే ఎక్కువ ధర పలికితే పెరిగిన ధర ప్రకారం కొనుగోలు చేయాలని కమీషన్ ఏజెంట్‌లకు ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులో 34 వేల సంచుల పసుపు ఉండగా.. మంగళవారం సాయంత్రం వరకు పూర్తిగా కొనుగోలు చేయాలని సూచించారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు. ఎండిన పసుపును మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చేలా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించేలా చాటింపు వేయించాలని పసుపు రైతులు అధికారులను కోరారు.

ఇది రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు

పాలన చేతకాకే తప్పించుకునే ప్రయత్నం..

రాష్ట్రంలో కమీషన్ల పాలన సాగుతోంది

దేవాదుల ఫేజ్ 3 మోటార్లతో వెంటనే నీళ్లందించాలి

బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-జనగామ

రాష్ట్రంలో ప్రకృతి తెచ్చిన కరువు కాదని, ఇది ముమ్మాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెచ్చిన కరువేనని బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌చారితో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో పాలన చేతకాక సీఎం ప్రతిపక్షాలపై, ప్రకృతిపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... ఎండలతో ఎండుతున్న పంటలను చూసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావు నవ్వుకుంటున్నారని అనడం అవివేకమన్నారు. తమ పదేండ్ల పాలనలో కూడా ఎండలు అధికంగానే ఉన్నాయన్నారు. కానీ, ఏ ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని తెలిపారు. మే నెల ఎండల్లో కూడా చెరువులు, కుంటలు, వాగుల్లో కూడా నీరు ఉండేవని అన్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపడం చేతగాక ప్రతిపక్షాలపై నెట్టేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ వైఫల్యం వల్లనే వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వెంటనే దేవాదుల ఫేజ్-3 మోటార్లను ప్రారంభించి పంట పొలాలకు నీళ్ల అందించాలని డిమాండ్ చేశారు. దేవాదుల ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు రూ.7000 కోట్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల 33 రోజులు పంపుల మోటర్లు ఆన్ చేయలేదని అన్నారు. 33 రోజులు దేవాదుల పంపుల మోటార్లు ఆన్ చేసి ఉంటే రిజర్వాయర్లు నిండేవని, పొలాలకు నీళ్ల వచ్చేవని తెలిపారు. నీళ్ల ఇవ్వొద్దని మోటార్లకు అడ్డంగా హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు నిలుచున్నారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది 20- 20 మ్యాచ్ అని అన్నారు. ఫైనాన్స్‌లో బిల్లులు ఇవ్వాలంటే 20శాతం కమీషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో భూములకు క్లియరెన్స్ ఇవ్వాలంటే 20శాతం కమీషన్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌లో అపార్ట్‌మెంట్‌లకు, గేటెడ్ కమ్యూనిటీలకు పర్మిషన్ ఇవ్వాలంటే 20శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని ఆరోపించారు. ఈసారి ప్రకృతి కనికరించిందని, పోయినసారి కంటే వర్షాలు సమృద్ధిగా పడ్డాయని అన్నారు. వేలాది టీఎంసీల నీళ్ల గోదావరిలో కలిశాయన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు చుక్క చుక్కను ఒడిసి పట్టేవారని తెలిపారు. సకాలంలో ఓ అండ్ ఎం పనులు పూర్తిచేసుకుని ఎండాకాలం కోసం నీళ్ల సిద్ధం చేసుకోవాల్సిందని, కానీ అలా జరగలేదన్నారు. కృష్ణానదిలో రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు నీళ్ల దోచుకుంటుంటే కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని, ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మౌనంగా ఉన్నారని ఆరోపించారు. వెంటనే దేవాదుల ఫేజ్ 3 మోటార్లను ప్రారంభించి పంట పొలాలకు నీళ్ల అందించాలని, పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రశ్న కనిపించకుంటే...జవాబు రాసేదెలా?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఇంగ్లీష్ పరీక్షను నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఇంటర్ బోర్డు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఇంటర్ వార్షిక పరీక్షలంటే విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. వారి భవిష్యత్తును నిర్ణయించేవి. ఈ పరీక్షల పట్ల ఇంటర్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ప్రశ్నాపత్రాల తయారీ, వాటి నాణ్యత పట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని తెలుస్తున్నది. ఇంటర్ సెకండియర్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో ప్రశ్నలు సరిగ్గా కనిపించకుండా ముద్రించడమే ఇందుకు నిదర్శనం. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రశ్నాపత్రంలో కొన్ని ప్రశ్నలు సరిగ్గా కనిపించడం లేదంటూ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్న కనిపించకుంటే సమాధానాలు ఎలా రాయాలని ఇంటర్ బోర్డు అధికారులను వారు ప్రశ్నిస్తున్నారు. ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో ఏడో ప్రశ్న 'పై డయాగ్రామ్'అనే అంశం గురించి అడిగారు. అయితే ఆ డయాగ్రామ్ సరిగ్గా కనిపించడం లేదు. దీంతో విద్యార్థులు సమాధానం ఎలా రాయాలో తెలియక ఆందోళనకు గురయ్యారు. ఇది ఒక మార్కు, రెండు మార్కుల ప్రశ్న కాదు. ఏకంగా నాలుగు మార్కుల ప్రశ్న కావడంతో విద్యార్థులు మరింత టెన్షన్ పడుతున్నారు. నాలుగు మార్కుల ప్రశ్నకు సమాధానం రాయకపోవడంతో ఆ మార్కులను కోల్పోతామోననే భయాందోళనలో ఉన్నారు. ప్రశ్నాపత్రం ముద్రణ సరిగ్గా లేకుండా, ప్రశ్న కనిపించకుండా ఇంటర్ బోర్డు అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నాలుగు మార్కులను కలపాలని కోరుతున్నారు. పరీక్ష పూర్తయ్యాక కొందరు విద్యార్థులు 'పై డయాగ్రామ్' ప్రశ్న సరిగా కనిపించడం లేదంటూ నాలుగు మార్కులను కలపాలంటూ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్)కు లెటర్ రాశారు.

ఏడో ప్రశ్నకు మార్కులు కలపండి : విద్యార్థులు

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్)కు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులు ఎస్ సువార్త, సిహెచ్ నందినిసాగర్, సిహెచ్ సానియా, జి శ్రావణి, ఎస్ శిల్ప, వైశాలి, స్వాతి, జయ, కీర్తన, లహరి, జి ఈశ్వర్‌రాణి లెటర్ రాశారు. ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం ఏడో ప్రశ్న 'పై డయాగ్రామ్' కనిపించడం లేదని తెలిపారు. ఆ ప్రశ్నకు సంబంధించిన నాలుగు మార్కులను కలపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎస్ ఈ విషయాన్ని జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)కి పంపించారు. పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ర్యాంక్ కోల్పోతానేమో : సుమ శ్రీ, బైపీసీ,ఇంటర్ రెండో సంవత్సరం

నేను భాగా చదువుతాను. మొదటి సంవత్సరం మొదటి ర్యాంక్ తెచ్చుకున్నాను. ఈ ఏడాది ప్రశ్నాపత్రంలో లోపం వల్ల నాలుగు మార్కులు తగ్గితే నేను ర్యాంక్ కోల్పోతానేమోననే ఆవేదనగా ఉన్నది. ఇంటర్ బోర్డు మానవతా దృక్పధం ప్రదర్శించి నాలుగు మార్కులను కలపాలి.

విద్యార్థులకు తగిన న్యాయం చేయాలి : సీఎస్ అల్లు అనిత

ప్రశ్నాపత్రంలో దొర్లిన తప్పిదం కావడంతో విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని అశ్వారావుపేట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అల్లు అనిత అన్నారు. విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందొద్దని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 13,029 మంది గైర్హాజరు

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లీష్ పరీక్షను నిర్వహించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ సబ్జెక్టు పరీక్షకు 4,48,992 మంది దరఖాస్తు చేయగా, 4,33,963 (97.19 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 13,029 (2.91 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు నిజామాబాద్, వరంగల్, సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో పర్యటించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదని పేర్కొన్నారు.

మార్కులను కలుపుతాం ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షలో ప్రశ్నాపత్రంలో ఏడో ప్రశ్న పై చార్ట్‌కు సంబంధించి జవాబు రాసేందుకు ప్రయత్నించిన విద్యార్థులకు మార్కులను కలుపుతామని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నాపత్రం ముద్రణలో గీతల అస్పష్టతను కొందరు విద్యార్థులు గుర్తించి బోర్డు దృష్టికి తెచ్చారని తెలిపారు. దీనిపై సబ్జెక్టు నిపుణులు విపులంగా చర్చించారని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలనే సంకల్పంతో జవాబును సమాధాన పత్రంలో రాసేందుకు ప్రయత్నించిన విద్యార్థులందరికీ ప్రశ్నకు కేటాయించిన మార్కులను ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఐదు నామినేషన్లు

(మొదటిపేజి తరువాయి)

కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి హాజరయ్యారు. అనంతరం బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ నామినేషన్ వేశారు. దాసోజు శ్రవణ్ వెంట ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా నామినేషన్లు దాఖలు చేయడంతో మండలి ప్రాంగణం ఆయా పార్టీల నాయకులతో కోలాహలంగా మారింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేందుకు ఒక్కో అభ్యర్థికి 21 మంది ఎమ్మెల్యేలు అవసరం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 39 మంది గెలిచారు. వారిలో దాదాపు 10 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే.



ఉద్యమకారిణిగా గుర్తించారు :విజయశాంతి

తెలంగాణ ఉద్యమకారిణిగా తనకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యతనిచ్చిందని విజయశాంతి తెలిపారు. నామినేషన్ దాఖలు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల్లా అడుక్కోవడానికి తాము బిచ్చగాళ్లం కాదని విమర్శించారు. తానెప్పుడూ పార్టీని ఏమీ అడగలేదనీ, బీసీ మహిళా నేతగా తన అవసరాన్ని కాంగ్రెస్ గుర్తించి ఎమ్మెల్సీ సీటు ఇచ్చిందని తెలిపారు. పార్టీలో కష్టపడిన వారికి తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. తనను క్యాబినెట్‌లోకి తీసుకోవడం అధిష్టానం నిర్ణయమనీ, ఆ నిర్ణయం మేరకు నడుచుకుంటానని వెల్లడించారు.

అదనపు బాధ్యతగా భావిస్తా :అద్దంకి దయాకర్

ప్రజలకు సేవ చేసే క్రమంలో ఎమ్మెల్సీగా అవకాశం రావడం తనకు పార్టీ అప్పగించిన అదనపు బాధ్యతగా భావిస్తానని అద్దంకి దయాకర్ తెలిపారు. మంత్రిగా అవకాశం దక్కుతుందనేది మీడియాలో వార్తలు మాత్రమేననీ, అధిష్టానం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం ఉందనీ, అందుకే ఉద్యమకారులమైన తమకు అవకాశం వచ్చిందని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా దయాకర్ తెలిపారు.

రూ.వేల కోట్ల టీడీఆర్ స్కాంకు సీఎం కుట్ర

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి రూ.వేల కోట్ల టీడీఆర్ కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ఆధ్వర్యంలో ఈ కుట్ర నడుస్తున్నదని తెలిపారు. తక్కువ రేటుకు భూములు కొని ఎక్కువ రేటుకు అమ్మనున్నారని ఆయన విమర్శిచారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి బీజేపీకి కోవర్ట్‌గా పని చేస్తున్నారనీ, రాహుల్‌గాంధీ కాంగ్రెస్‌లో కోవర్టులున్నారంటూ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికి ముఖ్యమంత్రికి సంబంధించినవేనని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ తర్వాత 11 ప్రతిపాదనలు పట్టుకుని మోడీని కలిసిన రేవంత్ రెడ్డి అసలు ఎజెండా వేరే ఉందనీ, మంత్రి శ్రీధర్ బాబును బయటికి పంపించి రేవంత్ రెడ్డి పీఎంతో ఏం మాట్లాడారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీతో కలిసి పని చేస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు తెచ్చిందేంటో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో చచ్చేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో సీట్ల కేటాయింపు నుంచి డిక్లరేషన్ల వరకు కాంగ్రెస్ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుందని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి దొంగాట ఆడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువగా ఉండే బీజేపీకి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ఒరిగింది శూన్యమని కొట్టిపారేశారు. 15 నెలలుగా ప్రజా సమస్యలపై, ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. బీజేపీ ఒక్క ఆందోళననైనా నిర్వహించిందా? అని ప్రశ్నించారు.

కేసీఆర్ అసెంబ్లీకి వస్తారనీ, అయితే ఆయన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోతారా? అని ప్రశ్నించారు. గతంలో బీజేపీ అడ్డుకున్న బీసీ విద్యావంతుడు దాసోజు శ్రవణ్ కు ఎమ్మెల్సీగా మరోసారి అవకాశమిచ్చి కేసీఆర్ మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితాలు కాంగ్రెస్ కు చెంపపెట్టని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ ఉండదనీ, 15 రోజుల్లో మరోసారి తెరపైకి ఫార్ములా ఈ అంశాన్ని తెచ్చి అటెన్షన్ డైవర్షన్ చేయబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాలం తెచ్చిన కరువు కాకుండా కాంగ్రెస్ తెచ్చిన కరువు ఉన్నదని చెప్పారు.

తనకు తెలంగాణ తర్వాత దేశంలో ఏదైనా రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న ఆకాంక్ష ఉందంటే అది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పారు. తెలంగాణ పరిశ్రమలు ఏపీకి తరలిపోతున్నాయి అన్న ఉద్దేశంతోనే ఆవేదన వ్యక్తం చేసినట్టు స్పష్టం చేశారు. ఏపీ అభివృద్ధి చెందితే సంతోషిస్తామనీ, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ వెనుకబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనాన్ని ప్రశంసించినా సీఎం రేవంత్ రెడ్డికి సిగ్గు రావడం లేదన్నారు. "సీఎం రేవంత్ రెడ్డి త్వరలో హైదరాబాద్ నగరంలో ఎఫ్ఎస్ఐపై పరిమితులు విధించబోతున్నారు. అలోగా హైదరాబాద్‌లో ఉన్న టీడీఆర్ హక్కులను ఆయనకు చెందిన ముఠా కొనుగోలు చేస్తుంది. ఇప్పుడు అతి తక్కువ రేట్లకు కొని ఎఫ్ఎస్ఐ పరిమితి విధించగానే డిమాండ్ పెంచి వాటిని అత్యధిక రేటుకి అమ్ముకోబోతున్నారు. ఇది ముమ్మాటికి ఇన్సైడర్ ట్రేడింగ్ వంటి భారీ నేరం. సీబీఐ, ఈడీ వంటి సంస్థల దర్యాప్తులకు తగిన భారీ కుంభకోణం. ఈ స్కాంపై త్వరలో ప్రకటన రాబోతుంది. టీడీఆర్ పద్ధతిలో వేల కోట్ల రూపాయల విలువైన 400 ఎకరాల భూములను ప్రజావసరాల కోసం ప్రజల నుంచి జీహెచ్ఎంసీ సేకరించింది. ఈ విధానాన్ని కూడా రేవంత్ రెడ్డి తన అక్రమ సంపాదనకు ఒక మార్గంగా మలుచుకున్నారు...." అని కేటీఆర్ విమర్శించారు.సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత క్యాబినెట్‌ను కూడా ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అంతా అధిష్టానమే చూసుకుంటుంది తప్ప ఈయనదేమీ లేదని ఎద్దేవా చేశారు. అయితే డబ్బులు బాగా వెనుకేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వాదాయం తగ్గిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే వరంగల్ ఎయిర్ పోర్టుతో పాటు ఆరు ఎయిర్ పోర్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించినట్టు కేటీఆర్ తెలిపారు. సీఎంకు చేతనైతే వేగంగా ఆ ఎయిర్ పోర్టును పూర్తి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. 30 శాతం కమిషన్‌తో కాంగ్రెస్ సర్కారు నడుస్తున్నదని విమర్శించారు. తమ పార్టీపరంగా ఒక నిర్ణయం తీసుకుని గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపలేదని తెలిపారు.

గవర్నర్ ప్రసంగం రోజున కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారని కేటీఆర్ తెలిపారు. ఆయన స్థాయికి కాంగ్రెస్ నాయకులు సరిపోరని చెప్పారు. రూ.200 కోట్లతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న అందాల పోటీలతో లాభమేంటో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇది వరకే బీసీ రిజర్వేషన్ల పెంపు, కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయడం అనే అంశాలపై తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించిందని కేటీఆర్ గుర్తుచేశారు.



రైతు కన్నీళ్లు పట్టని ప్రభుత్వం

(మొదటిపేజి తరువాయి)

పరిశీలించింది. బచ్చన్నపేట మండలం చిన్నరాంచెర్ల గ్రామం, జనగామ మండలం గానుగుపాడు కుర్రతండా, వడ్లకొండ గ్రామం, రఘునాథ్‌పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జాఫర్‌గఢ్, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఎండిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రైతులు ఎండిన తమ పంటలను బృందసభ్యులకు చూపించుకుంటూ బోరున విలపించారు. ఎకరానికి రూ.30వేలకు పైగా పెట్టుబడి అయిందని, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, ఎండిన పంటను చూస్తే ఆత్మహత్య తప్ప మరో ఆలోచన లేదని రైతులు కంటతడి పెట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చైనా గోదావరి నీళ్లతో ఎండిపోగా మిగిలిన పంటలకైనా నీరు అందించేందుకు తాము కృషి చేస్తామని రైతులకు భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. జాఫర్‌గడ్ మండలంలోని వరద కాలువ పెండింగ్ పనులను పరిశీలించారు. అనంతరం లింగాల ఘనపూర్ మండలం నెల్లూరు గ్రామ సమీపంలోని గుడిసెవాసుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా మార్చిలో గ్రామ, గ్రామాన సర్వేలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 16న సీఎం రేవంత్ రెడ్డి.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పర్యటించనున్నారని, ఈ సందర్భంగా జిల్లాలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించాలని కోరారు. జిల్లాలో దాదాపు లక్షా 60 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తే, సాగునీరు లేక, బోరు బావులు ఎండిపోయి, కుంటలు, చెరువుల్లోకి నీళ్ల రాక, పంటంతా నష్టపోయి అప్పుల పాలయ్యారని అన్నారు. ఎండిన పంటంతా పశువులు మేస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదులతో ఎనిమిది రిజర్వాయర్లలో నీళ్ల నింపితే, జిల్లాలో ఉన్న 769కి పైగా చెరువులు, కుంటల్లో నీళ్ల నిలిచి ఉండేవని, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవని అన్నారు. ఇప్పటికైనా నీళు వదిలితే కనీసం ఈ కాస్త పంటైనా చేతికొస్తుందన్నారు. ప్రభుత్వం వరిపంట నష్టాన్ని సర్వే చేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదని అన్నారు. దేశ సంపదను దోపిడీ చేసి కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకే ఆ విధానాలు ఉన్నాయే తప్ప, రైతులు, కార్మికులు, కూలీలకు కేంద్ర బడ్జెట్ ఉపయోగకరంగా లేదన్నారు. రైతులకిచ్చే సబ్సిడీ గతం కంటే తగ్గించిందని, ఎరువుల సబ్సిడీలో, వ్యవసాయ ఉపాధి కూలీలకిచ్చే నిధుల్లో కోతలు విధించిందని తెలిపారు. ఖాజీపేట రైల్వే కోచ్ ఏర్పాటు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించలేదని తెలిపారు. జనాభా ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు సీట్లు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాలకు మరింత నష్టం జరిగే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి రాగానే అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇంటి స్థలాలు, ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. వాటి పరిష్కారానికి ఇందిరమ్మ ఇండ్లని చెప్పి అందించడం లేదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, కొడేపాక యాకయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కార్యదర్శి మునిగెల రమేష్ చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు

షహీద్ భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలని యువజన, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న షహీద్ భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కొద్దిమంది చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువజన ఉత్సవాలను నిర్వహించడం, "సే నో టూ డ్రగ్స్" నినాదంతో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ క్యాంపెయిన్ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా వారిని చైతన్యం చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటం ఎవరు చేసినా ప్రభుత్వ సహకారం ఉంటుందని చెప్పారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండీ జావీద్ మాట్లాడుతూ.. యువజన ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ నగరంలో విస్తృతంగా సదస్సులు, క్రికెట్, చెస్, 2కే రన్, రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, భగత్ సింగ్ సందేశ్ ర్యాలీ, ముగింపు సభ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు జె.కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్మూలన ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. యువజన ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్ పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థకు కృత్రిమ మేధతో ముప్పే

మానవ భావోద్వేగాలు, నైతిక విలువలు కొరవడతాయి : జస్టిస్ గవాయ్ హెచ్చరిక



నైరోబి : కోర్టు తీర్పులను అంచనా వేయడానికి కృత్రిమ మేధస్సును ఒక సాధనంగా ఉపయోగించే ప్రయత్నాల పట్ల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మానవ భావోద్వేగాలు, నైతిక తార్కికత లేని ఒక యంత్రం చట్టపరమైన వివాదాల సంక్లిష్టతను, సూక్ష్మ నైపుణ్యాలను నిజంగా గ్రహించగలదా అని ఆయన ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థలో కృత్రిమ మేధస్సును చొప్పించడమనేది చాలా జాగ్రత్తగా జరగాలని ఆయన వ్యాఖ్యానించారు. అది కేవలం ఒక అదనపు సహాయంగా మాత్రమే వుండాలి తప్ప మానవ మేధస్సును, తీర్పును భర్తీ చేయదని అన్నారు. న్యాయం యొక్క సారం అనేది చాలా తరచుగా నైతిక పరిశీలనలు, సహానుభూతి, సందర్భోచిత అవగాహనలు వంటి పలు అంశాల సమాహారంగా వుంటుంది. అది అన్ని లెక్కలకు అతీతంగా వుంటుందని అన్నారు. న్యాయవ్యవస్థలో సాంకేతికత ఉపయోగించడంపై కెన్యాలోని నైరోబిలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కెన్యా సుప్రీం కోర్టు ఆహ్వానం మేరకు జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఆరు రోజుల పాటు కెన్యాలో పర్యటిస్తున్నారు. లీగల్ పరిశోధనలకు ఏఐపై ఆధారపడడం కూడా కొన్ని ఇబ్బందికర పరిస్థితులకు దారి తీస్తున్నదని, చాట్‌జీపీటీ వంటి వేదికలు తప్పుడు కేసులను సృష్టిస్తున్న, చట్టపరమైన వాస్తవాలను కల్పిస్తున్నాయని అన్నారు. ఎంత పెద్ద మొత్తంలో డేటాను విశ్లేషించినప్పటికీ, తర్వాత మానవ వివేచనతో మూలాలను సరిపోల్చి సరిచూసుకోవాల్సిన అవసరం వుందని హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ- హయత్ నగర్

డివిజన్‌లోని వివిధ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ నిధుల కోసం జీహెచ్ఎంసీని కమిషనర్ ఇలంబర్తిని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నగర శివారులో ఉండడం వల్ల కాలక్రమేనా నిత్యం అనేకమైన నూతన కాలనీలు ఏర్పడుతున్నాయని, శివారు కాలనీలో ప్రజలు కనీస మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, హయత్ నగర్ డివిజన్ అభివద్ధికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇవ్వాలని వినతిలో పేర్కొన్నారు.

నాగోల్‌లో చైన్ స్నాచింగ్

- వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరు దుండగులు

నవతెలంగాణ- నాగోల్

70 సంవత్సరాల వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్ళిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మర్రిపల్లి గ్రామానికి చెందిన వడ్డే గోని స్వరూప అనే వృద్ధురాలు సోమవారం ఇంట్లో ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్ళినట్టు తెలిసింది. బాధితురాలు అరవడంతో కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల వారు గమనించి దొంగలను వెంబడించినా ఫలితం లేకుండాపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నాగోల్ పోలీసులు తెలిపారు.

ప్రజావాణికి 187 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించడం పై దృష్టి సారించాలన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 79 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 49, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు మూడు చొప్పున, యూసీడీ హెల్త్, ఫైనాన్స్ విభాగాలకు రెండు చొప్పున, జోనల్ ఆఫీస్ (కూకట్ పల్లి), శానిటేషన్, ఎలక్ట్రికల్, లేక్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా రెండు ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 108 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సీపీపీ శ్రీనివాస్, సీ.ఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, అడిషనల్ సీసీపీ గంగాధర్, జోనల్ సీపీలు, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడమే లక్ష్యం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న స్నేహిత సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మహిళలను వ్యాపారవేత్తలుగా రాణించేలా ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల మహిళలచే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేలా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారితను ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధికి ఊతం ఇచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఈ క్యాంటీన్ల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా నగర ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వస్తుందన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘానికి చెందిన ఐదు మంది మహిళలు రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఇట్టి క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, డీసీ ప్రశాంతి, అమీర్పేట్ ఎస్.బీ..ఐ బ్రాంచ్ మేనేజర్, డీపీఓ ఆశ, స్నేహిత స్వయం సహాయక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండికి దారేది..?

- రోడ్డుపై పార్కింగ్‌తో రాకపోకలకు ఇక్కట్లు



నవతెలంగాణ - చంపాపేట్

మాదన్నపేట్ కూరగాయల మండి రోడ్డు అంటే గుర్తుకు వచ్చేది రద్దీతో కూడిన ట్రాఫిక్. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చాంద్రాయణగుట్ట, సైదాబాద్, ఓవైసీ హాస్పిటల్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, షాద్ నగర్, సాగర్ కాంప్లె క్స్, బీఎన్ రెడ్డినగర్, ఇబ్రహీంపట్నం, మాల్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే సైదాబాద్ మాదన్నపేట్ కూరగాయల మండి ప్రధాన కూడలిగా ఉన్నది. అంతే కాకుండా వివిధ వాణిజ్య కేంద్రాలు, కళాశాలలకు ఆవాసంగా ఉంది. ఎప్పుడు జనసంచారంతో, వాహనదారులతో కిటకిటలాడుతుంటుంది. సైదాబాద్ వద్ద సైతం కుర్మా గూడ డివిజన్ పరిధిలోని కూరగాయల రైతు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. అయితే ప్రధాన రోడ్డు పక్కనే చిన్న చిన్న వాణిజ్య వ్యాపారస్తులు తమ వాహనాలను రోడ్డుపైన ఉంచడంతో వాహనదారులకు సరైన పార్కింగ్ సదుపాయం లేక ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కూరగాయల మార్కెట్ చెందిన స్థలంతో పాటు ప్రస్తుతం హోటల్లో టీ పాయింట్ కిరణ్ షాప్ వాణిజ్య సంస్థలలో ముందు పార్కింగ్ వినియోగించేవారు. రోడ్డుకు ఇరువైపులా పెంచడంతోపాటు పార్కింగ్ పనులు చేపట్టిన నాటి నుంచి రెండు పార్కింగ్ స్థలాలు లేకుండాపోయాయి. అప్పటి నుంచి ఉదయం నుంచి సాయంత్రం వేళ ఈ మార్గంలో వెళ్లే వారికి ట్రాఫిక్ చుక్కలు చూపిస్తోంది. మాదన్నపేట్ కూర కాయల మండి సమీపంలో దొప్పుడు బండ్లు ఫ్రూట్స్ అమ్మకందార్లు అడ్డంగా ఉండడంతో సామర్థ్యానికి మించి వాహనాలు వస్తుండడంతో యజమాన్యం ఏం చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. అదనంగా రోడ్లపై నిలుపుతున్న కార్లు, ద్విచక్ర వాహనదారులపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు వాహనదారులు, పాదచారాలు కోరుతున్నారు.

రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

- సంతోష్ నగర్ ట్రాఫిక్ ఎస్సై వెంకటప్ప

నవతెలంగాణ-చంపాపేట్

వాహనదారులు రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సంతోష్ నగర్ ట్రాఫిక్ ఎస్సై వెంకటప్ప వెంకటప్ప హెచ్చరించారు. సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో హైదరాబాద్ జిల్లా ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, సంతోష్ నగర్ ట్రాఫిక్ సిఐ నరసింహ నాయక్ ఆదేశానుసారం గత వారం రోజుల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సోమవారం చంపాపేట్ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని దేవరకొండ రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు బుక్ చేసినట్టు, మరికొందరిపై చలాన్ విధించినట్టు తెలిపారు. ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘిస్తే చలాన్‌తో పాటు కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని వాహన దారులను హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల కృషి ఉన్నతమైంది

- మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల కృషి ఎంతో ఉన్నతమైనదని మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు.సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల బడంగ్ పేట్ ఎస్వీ కంటి వైద్య కేంద్రాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల సలహాలు సూచనలు విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి,నాయకులు ఏదుల ప్రతాప్ రెడ్డి, గోలి రంజిత్ రెడ్డి, గిరి ముదిరాజ్, అనిల్ గౌడ్, నిర్వాహకులు నేనావత్ విమల రాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ
- తాటి చెట్టుపై నుంచి పడి గాయాలపాలైన గీత కార్మికులకు పరామర్శ



నవతెలంగాణ-నాగోల్

కల్లుగీత కార్మికుల ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయదలచిన కాట మయ్య రక్షణ కవచం వెంటనే ఇచ్చి ప్రమాదాలు నివారించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. జనగామ జిల్లాలోని చిటకోడూరు గ్రామానికి చెందిన బాల్న శ్రీనివాస్ , పెద్ద మడ్డూరు గ్రామానికి చెందిన గోడిశాల శ్రీనివాస్, గొల్లపల్లి గ్రామానికి చెందిన తీగల పరశు రాములు గీతా కార్మికులు. శనివారం వారు తాటి చెట్టుపై నుంచి ప్రమాదవ శాత్తు కింద పడడంతో వారికి గాయాలు నాగోల్‌లోని సుప్రజ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారిని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు బోలగాని జయ రాములు, వి. వెంకట నరసయ్య, భాల్నే వెంకట మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి చౌగాని సీతారాములు, బోయపల్లి సుధాకర్ , పరిదుల భాస్కర్ లు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో గోవింద్ అనే గీత కార్మికుడు రక్షణ కవచం వాడడం వల్ల చెట్టు పై నుంచి జారినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి 9 నెలలు అవుతుంది కానీ పంపిణీ నత్త నడక నడుస్తున్నదని చెప్పారు. ఇప్పటివరకు 18 వేల మందికి మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా ఇవ్వాల్సి ఉందని దీనికి తగిన బడ్జెట్ లేకపోవడంతో పంపిణీ, ట్రైనింగ్ నిలిచిపోయాయని తెలిపారు. 9 నెలల కాలంలోనే తాటి చెట్టు పై నుండి జారిపడి 42 మంది చనిపోయారని తెలిపారు. కావున గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాన్ని అందజేయాలని లేకుంటే వారి ప్రమాదా నికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ప్రమాదవశాత్తు గీత కార్మికుడు మరణిస్తే చనిపోయిన 15 రోజుల్లో బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషన్ చెల్లించాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్ గ్రేషియో ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సుప్రజ ఆస్పత్రి వారి ఉచిత వైద్య సేవలు అభినందనీయం.

గత మూడు సంవత్సరాల నుంచి చెట్టు పై నుండి పడి ప్రమాదానికి గురైన వారికి సుప్రజా హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యం అందిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్‌కి కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ తరఫున అభినందనలు తెలియజేశారు. మూడు సంవత్సరాల కాలం లో రెండు కోట్ల రూపాయల పైచిలుకుగా వెచ్చించి ప్రమాదవశాత్తు గాయపడిన 66 మంది గీతా కార్మికులకు ఉచితంగా వైద్యం అందించారని తెలిపారు. సుప్రజ ఆస్పత్రి వారి సేవలు ఇదే విధంగా ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఆస్పత్రి ఎండీ సిగం విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మూడేండ్లలో 66 మంది గీతా కార్మికులకు రెండు కోట్ల రూపాయల విలువ చేసే వైద్య సేవలను అందించినట్టు తెలిపారు. ముందు ముందు ముందు కూడా ప్రమాదం జరిగిన కల్లుగీత కార్మికులకు ఉచితంగా వైద్య సేవలందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం





నవతెలంగాణ - మీర్‌పేట్

వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజశేఖర్ రెడ్డి అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గాయత్రి నగర్ లో వీటీ రాయల్ పౌండేషన్ గ్రూప్ చైర్మెన్ డాక్టర్ కాసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలా సంవత్సరాల నుంచి వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేవలం చలివేంద్రాలే కాకుండా మరెన్నో సమాజ సేవ కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. వీటీ రాయల్ పౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీటీ రాయల్ సీఈఓ ధర్నానేశ్వర్, మేనేజర్ కేరెలు నికిత, కిషోర్ రెడ్డి, రింటూ, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అసమానతలపై పోరాడిన సావిత్రిబాయి పూలే

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి
- పలు ప్రాంతాల్లో ఘనంగా సావిత్రిబాయి వర్ధంతి



నవతెలంగాణ- హయత్ నగర్

సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి,అణగారిన వర్గాల్లో విద్యా వ్యాప్తి కోసం కృషి చేసిన గొప్ప సంస్కర్త అని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా మన్సూరాబాద్ సహారా వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్,టంగుటూరి నాగరాజు,రుద్ర యాదగిరి నేత,విజయ్ భాస్కర్ రెడ్డి,సతీశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే వర్ధంతిని హయత్ నగర్ మండల కేంద్రంలో పారంద స్వామి, ఎర్ర రవీందర్ లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తన జీవిత కాలంలో సనాతవాదులను ఎదిరించి తాను 1848 సంవత్సరంలో స్వయంగా విద్యా సంవత్సరం నెలకొల్పి ఆడపిల్లలకు చదువులను సాధారణం చేసిందని తెలిపారు. దాసరి ముని, శ్రీధర్ ముదిరాజ్, పిట్టల జంగ ముదిరాజు, క్యా దాస్ సతీష్, కందాడి నరసింహ, ఒంజరి బాబి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నాగోల్ : భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సమాజంలోని అణగారిన వర్గాలు అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యను అందించడానికి అనేక త్యాగాలను చేసిన మహిళా మూర్తి సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కష్ణ అన్నారు. సోమవారం న్యూ నాగోల్‌లోని ఎస్ ఏ డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి నాగోల్ డివిజన్ ఆధ్వర్యంలో ఉడతల మల్లేష్ అధ్యక్షతన, పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి కష్ణ మాట్లాడుతూ నేటికీ అట్టడుగు వర్గాలు, నిమ్మన జాతులు సాంఘిక వివక్షతకు గురవుతున్నారని.. పరిష్కారం కోసం నేటి పాలకులు ప్రయత్నించాలని కోరారు. పెట్టుబడిదారీ పోకడలతో తూతూ మంత్రంగా పథకాలు బడ్జెట్లో కేటాయించి అశ్రద్ధ వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జయ, జగన్ యాదవ్, సంగు సైదారావు ,చెరుకు ఈశ్వర్ గౌడ్ ,ఈ కరుణాకర్, పి శివకుమార్, జైనుల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట్ : తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం, శౌర్య ఉత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు, గ్రేటర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, శౌర్య ఉత్తిదారు సంఘం అధ్యక్షుడు మల్లేశం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు చందు నాయుడు, మల్లేష్, నందులు ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులను శాలువాతో ఘనంగా సత్కరించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..



- మాజీ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్

నవతెలంగాణ - మీర్ పేట్

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని మాజీ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఓ ఫంక్షన్ హాల్లో మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపిటిసి ఏనుగుల అనిత యాదవ్ సమక్షంలో మహిళలకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. సమావేశానికి వచ్చిన మహిళలందరిని శాలువాతో సత్కారించి సన్మానించారు. మహిళలు లేనిదే లోకం లేదని, నేడు మహిళలు అన్ని రంగాల్లో రానిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డిని ఆదర్శంగా తీసుకొని రాజకీయ రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీలో సూర్య రామాలయానికి శంకుస్థాపన



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

డాక్టర్స్ కాలనీలో శ్రీ శివ సూర్య రామాలయ దేవాలయం నిర్మాణానికి సోమవారం వేదపండితులు బ్రహ్మశ్రీ సన్నిధానం శ్రీధర శర్మ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అతిథులుగా సరూర్ నగర్, ఆర్. కె. పురం కార్పొరేటర్లుఖు ఆకుల శ్రీవాణి అంజన్, రాధా దిరజ్ రెడ్డి, పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమాలలో జిగిని రామమూర్తి, వక్కలంక శ్రీనివాస రావు, రామాచార్యులు, వన్నాడీ శ్రీనివాస్, శివరాం, వుటుకురి దయాకర్, దండెం జనార్దన్ రెడ్డి, డీఆర్ జగన్ మోహన్ రెడ్డి, జీ కె.సత్యనారాయణ , ఆకారపు కృష్ణ, చంద్రయ్యా, రామన్ గౌడ్, నరేష్, మమత, సరిత, నిత్య, కష్ణకుమారి, సంధ్య, రాధిక, రమ, వాణి, సీత, విజయలక్ష్మి, నాగేష్, ఎలిశెట్టి ప్రకాష్, తోట హనుమంతు, సాగర్, మల్లేష్ పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా సంస్థాన ట్రస్ట్ చైర్మెన్‌గా కొప్పుల



నవతెలంగాణ-హయత్ నగర్

శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన ట్రస్ట్ చైర్మెన్ గా జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆలయ కమిటీ సభ్యులు అంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సోమవారం నిర్వాహకులు తెలిపారు.ట్రస్ట్ చైర్మెన్ మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి తన వంతు కషి చేస్తానని, సహాయ సహకా రాలు అందిస్తానన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తానన్నారు. ఎం నరసింహారెడ్డి. సాయినాథ్ కొప్పుల ఉపేందర్ రెడ్డి. ఎం.రామచంద్రారెడ్డి, మోహన్ రెడ్డి, సత్తయ్య డి ఎస్ రామ రావు , ప్రదీప్ కుమార్. కే జగన్ మోహన్ రెడ్డి జి రవీందర్ రెడ్డి బి రత్నాచారి లను ఆలయ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బీజేవైఎం జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షులుగా నాగార్జున



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బీజేవైఎం జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షులుగా పెబ్బేటి నాగార్జున, కార్యదర్శిగా గుర్రం శివ కుమార్ నియమితులయ్యారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు ఎం.వివేకానంద గౌడ్ సమక్షంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టు తెలిపారు. నాగార్జున మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఏ. శ్రీధర్ గౌడ్,నాయకులు గణపతి చించోలే,మనోజ్ కుమార్,సంతోష్ కుమార్,బోడ హరికష్ణ,సుమిత్ అద్పోలె శ్రీను,మల్లేష్ యాదవ్, ఎం డి జాకీర్,మారుతి తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు'

నవతెలంగాణ-సిటీబ్యూరో

యాదవులకు కీలక పదవులిచ్చినందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడుకి రాష్ట్ర యాదవ మహాసభ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు యల్లావుల చక్రధర్‌యాదవ్, నాయకులు ఎంటీ.కృష్ణ యాదవ్, బొంతు శ్రీదేవియాదవ్, బోయిని మహేందర్‌యాదవ్, నాగెల్లి అంజన్‌యాదవ్, బొట్ట మధుయాదవ్, జంగిటి ప్రవీణ్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఏపీ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీగా కె.విజయానంద్ యాదవ్, మంత్రులుగా కె.పార్థసారథి యాదవ్, వై.సత్యకుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మెన్లుగా పి.కృష్ణయ్య యాదవ్, నూకసాని బాలాజీయాదవ్, నాగేశ్వరరావు యాదవ్, రాజ్యసభ సభ్యులుగా బీదా మస్తాన్‌రావు యాదవ్, ఆర్.కృష్ణయ్య యాదవ్, టీటీడీ సభ్యులుగా జంగా కష్ణమూర్తి యాదవ్, ఎమ్మెల్యేగా యనమల దివ్యా యాదవ్, ప్రభుత్వ విప్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీగా బీదా రవిచంద్ర యాదవ్‌కు అవకాశం కల్పించినట్టు వారు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన దానమ్మ మహేందర్ రెడ్డికి సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.38,500 చెక్కును సోమవారం మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డిలు లబ్దిదారుడికి అందజేశారు. ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం సీఎం సహాయనిధి నుండి ఆర్థిక సహకారం అందేలా చూడాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్ రెడ్డిని కోరగా వెంటనే ఆమె స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం ఇప్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి సొంగారి సత్తిరెడ్డి, నాయకులు బండారి రాజు, కృష్ణారెడ్డి, బొప్పిడి నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద
- ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లి, మంచి ఉద్యోగాలు సాధించడమే సావిత్రిబాయి పూలేకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఐద్వా మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవనంలో ఐద్వా మల్కాజిగిరి మండల అధ్యక్షురాలు ఎస్.నాగమణి అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం. వినోద, మల్కాజిగిరి మండల కార్యదర్శి పి.మంగలు హాజరై సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..1831 ఏడాది జనవరి 3న మహారాష్ట్రలో సహారా జిల్లాలో నయాగాబ్ గ్రామంలో జన్మించారని తెలిపారు. ఆమె వివాహం సంఘసంస్కర్త జ్యోతిరావు పూలేతో తొమ్మిదేండ్లకు జరిగిందని తెలిపారు. జ్యోతిరావు పూలే అభ్యుదయ భావాలు ఉన్న వ్యక్తి అవ్వటం వలన ఆయన బాలిక విద్యాభ్యాసం కోసం ఆలోచించి ఆ మార్గంలో తొలి అడుగు తన ఇంటి నుండే మొదలుపెట్టారని చెప్పారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాభ్యాసం నేర్పించారని తెలిపారు. సావిత్రి భాయి పూలే మహారాష్ట్రలో మహారా అని దళిత కుటుంబంలో జన్మించారని చెప్పారు. ఆ దళిత సామాజిక వర్గం అనేక అసమానతలకు అగ్ర కులాల వారిచే అవమానాలకు గురి అవుతూ ఉండేదని, ఆ అసమానతలను రూపుమాపాలి అంటే విద్య ఒకటే ఆయుధంగా భావించి పూలే దంపతులు 1848 సంవత్సరంలో పూణేలో మొదటి బాలిక పాఠశాలను ఒక ఇంటి అరుగు మీద ప్రారంభించారన్నారు. అగ్రకులాల వారు పూలే దంపతులను మానసికంగా దెబ్బతీయాలని వారి కుటుంబం పై ఒత్తిడి తీసుకు వచ్చారని తెలిపారు. జ్యోతిరావు పూలే తండ్రితో పూలే దంపతులను ఇంటి నుంచి గెంటి వేయించారని చెప్పారు. అగ్ర కులాల వారి ఒత్తిడిలకు తలవంచకుండా పాఠశాలలో పాఠాలు చెప్పడం మొదలుపెట్టారని గుర్తు చేశారు. సావిత్రిబాయి పూలే పాఠశాలకు వచ్చి, వెళ్లే దారిలో ఆవిడపై రాళ్లు విసరటం, పేడ నీళ్లు చల్లటం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఆమె అధైర్య పడకుండా తన సంచిలో పాఠ్యపుస్తకలతో పాటు, ఒక జత బట్టలు పెట్టుకుని పాఠశాలకు వెళ్లిన తరువాత బట్టలు మార్చుకుని విద్యార్థులకు పాటలను బోధించేవారని పేర్కొన్నారు. ఆమె బాల్య వివాహాలు వ్యతిరేకంగాను పోరాడారుని తెలిపారు. బాల్యవివాహాలు చేస్తే ఆనారోగ్య సమస్యలు వస్తాయని వాటిని వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. భర్త చనిపోయిన వితంతు మహిళలను అత్తింటి వారు శారీరకంగానూ, మానసికంగానూ, లైంగికంగానూ, హింసకు గురి చేసేవారని వాటి నిర్మూలనకు సావిత్రిబాయి పూలే కృషి చేశారని తెలిపారు. వితంతువులను పుట్టింటి వారు లేదా అత్తింటి వారు దేవాలయాల వద్ద వదిలేసి వచ్చేస్తే ఆ వితంతువులు భిక్షాటన చేసి జీవించేవారని చెప్పారు. సావిత్రిబాయి వితంతు మహిళలు, బాలికలకు ఆశ్రమం నిర్మించి వారికి అండగా నిలిచిందన్నారు. అభ్యుదయ భావాలు గల యువకులతో వారికి పున:ర్వివాహాలు చేశారని తెలిపారు. పూలే దంపతులు ఆశ్రమల్లో ఒక బ్రాహ్మణ వితంతు కుమారుడిని వారి కుమారుడిగా దత్తత తీసుకున్నారని తెలిపారు. 1848 దశాబ్దంలో మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి విజృంభిస్తే పూలే దంపతులు విరాళాలు సేకరించి మందులు కొని వారికి స్వయంగా సేవలు చేశారని చెప్పారు. చివరకు సావిత్రిబాయి పూలే 1880 సంవత్సరంలో మార్చి10న ప్లేగు వ్యాధితో మరణించారని తెలిపారు. సావిత్రిబాయి సమాజ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించటానికి చదువుల తల్లి సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి.శోభా, ఎస్ రాజలక్ష్మి లలిత, దీపిక, వైష్ణవి, పద్మ లత, సుకన్య, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ కనబరిస్తే రూ.10 వేల బహుమతి



- ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలి
- మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్
- విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

నవతెలంగాణ - జవహర్‌నగర్

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆణిముత్యాలు పేరిట రూ.10వేల నగదును బహుమతిగా అందజేస్తానని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 150 మంది విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా చేసి, ప్రయివేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మేలు అని నిరూపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఏకాగ్రతతో చదవాలని, పదో తరగతి జీవితంలో ఒక మైలురాయి అని అన్నారు. సినిమాలు, ఫోన్‌లు పక్కకు పెట్టి పుస్తకాలకు దగ్గరవ్వాలని సూచించారు. తల్లితండ్రులు కూడా పిల్లలకు తగిన సూచనలు ఇచ్చి చదువుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం మహమ్మద్ అజామొయినుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు వీర భాస్కరరావు, శ్రీనాథ్, నయీమ్, చంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



- దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన

నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులు తమకు మూడు నెలలుగా తమకు వేతనాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని వాపోయారు. తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా రేపు, మాపు అంటూ మూడు నెలలుగా కాలయాపన చేస్తున్నారన్నారు. ఏ నెల వేతనం అదే నెలలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ ఉప్పల్ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులుగా సాయి చరణ్, శ్రీమాన్

నవతెలంగాణ-ఉప్పల్

ఎస్ఎఫ్ఐ ఉప్పల్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సాయి చరణ్, శ్రీమన్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శు అవినాష్, జి.కార్తీక్ హాజరై మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ 1970లో కేరళ త్రివేంద్రంలో ఏర్పడిందన్నారు. అనాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ఉప్పల్ మండల్ నూతన కమిటీ మండలంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉండాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ప్రయివేట్ స్కూల్స్, కళాశాలలు ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని, విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నాయని చెప్పారు. అలాంటి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని తెలిపారు. కాగా 17 మందితో కమిటీ వేశారు. మండల కార్యదర్శి వర్గ సభ్యులుగా ఐదుగురిని ఎన్నుకోగా 12 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బి.సాయి చరణ్, కార్యదర్శిగా శ్రీమాన్, గౌరవ అధ్యక్షులుగా బి.సాయి చరణ్ నాయక్, ఉపాధ్యక్షుడుగా సాయి అజయ్, సహాయ కార్యదర్శిగా రాజేష్, కమిటీ సభ్యులు గిరి, చరణ్, సాను, ప్రణీత్, నీరజ్, రాకేష్, వర్షిత్, సాయి తేజ, పి.సంజయ్, జి.సంజయ్, అనిరుధ్, గణేష్, సాయి రామ్ తదితరులున్నారు.

మహిళా పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు



- కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నవతెలంగాణ - చర్లపల్లి

ప్రతి మహిళా విద్యా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, సమాజంలో గౌరవంగా బతకాలని, మహిళా సాధికారత సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ అన్నారు. నాచారం డివిజన్ వార్డు కార్యాలయం స్నేహపురి కాలనీలో సోమవారం నాచారం డివిజన్‌లో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులు, బీఆర్ఎస్ మహిళలతో కలిసి కార్పొరేటర్ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తొమ్మిదేండ్లుగా నాచారం డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్నందుకు మహిళా పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహిళలందరికీ బహుమతులు ప్రదానం చేశారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే వర్ధంతి

- పలువురు నివాళి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి స్ఫూర్తి గ్రూపు నాయకురాలు శారద, ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళలకు చదువు అవసరాన్ని గుర్తించి బాలికలకు విద్యను బోధించిన ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలిగా గణతికెక్కారాని చెప్పారు. జ్యోతిరావు పూలేతో బాల్యంలోనే వివాహం జరిగినప్పటికీ ఆయన సహకారంతో ఆనాటి సమాజాన్ని ధిక్కరించి విద్యను అభ్యసించారని చెప్పారు. ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొంది మనువాదులు చేసిన దురాగతాలను ఎదిరించి బాలికలకు విద్య బోధించారని చెప్పారు. శారద మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్వయంగా విద్యను బోధించడమే కాకుండా ఫాతిమా షేక్‌ను ప్రోత్సహించి ఆమెను కూడా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని చెప్పారు. వితంతువులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా వారికి ఆశ్రమాన్ని నిర్మించి వారికి వారి పిల్లలకు సేవలు చేశారని చెప్పారు. వితంతువు కుమారుడిని పెంచి డాక్టర్లుగా తయారు చేశారని చెప్పారు. ప్లేగు వ్యాధి బాధితులకు సేవలు చేస్తూనే ఆమె చనిపోయారన్నారు. సావిత్రిబాయి పూలే సమాజం చేసిన కృషి మరువలేదన్నారు. కృష్ణమాచార్యులు, రుక్కయ్య, శ్రీమన్నారాయణ, శివన్నారాయణ ప్రసంగించారు. అధ్యక్షులు యాదగిరి రావు మాటాడుతూ.. నేటికీ మనువాదులు అనేక దుర్మార్గాలతో పేదలకు, అట్టడుగు వర్గాలకు చదువులు దూరం చేస్తున్నారని అన్నారు. మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్నారని దానికి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, పి.బి చారి, గౌస్య, శారద, శోభ, అంజలి, వెంకటసుబ్బయ్య, రుక్కయ్య, యాదగిరిరావు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించండి



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ రోడ్ నంబర్-2లో డ్రయినేజి పొంగిందని కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, గోపాల్ యాదవ్, మహేందర్ గౌడ్, సముక్త కార్యదర్శి శ్రీశైలం, కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబిల్‌పూర్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ- మేడ్చల్

మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామంలో మేడ్చల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 75మంది హెల్త్ క్యాంపులో పాల్గొని షుగర్, బీపీ సహ వివిధ రక్త పరీక్షలు చేయించుకున్నట్లు గ్రామ వైద్యాధికారి క్రిస్టినా తెలిపారు. సేకరించిన రక్త నమూనాల్లో హెచ్ఐవీ టెస్టులు నిర్వహించమన్నారు. అనంతరం గ్రామంలో హెచ్ఐవీ వ్యాధిపట్ల అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వినాకుమారి, కౌన్సిలర్ గోవింద్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ రాంరెడ్డి, దివ్య, ఆశా వర్కర్లు కృష్ణవేణి పద్మ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర కేజీల ఎండు గంజాయి పట్టివేత



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ వద్ద మేడ్చల్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రఘు వెంకటేశ్వరరావు సోమవారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండ గా ఓ వ్యక్తి వద్ద మూడున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పులిమెట్ట ప్రాంతానికి చెందిన సమర్ సర్కార్ మూడున్నర కేజీల ఎండు గంజాయితో పట్టుబడ్డాడని తెలిపారు. అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేయగా గత కొన్ని నెలలుగా మల్కన్‌గిరి జిల్లా నుండి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నాడని తెలిపారు. ఎక్సైజ్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గంజాయి, నార్కోటిక్ మత్తు పదార్థాల రవాణా, అమ్మకంపైన ఇండస్ట్రియల్ ఏరియా, విద్యాసంస్థల వద్ద నిఘా, పెట్రోలింగ్ తీవ్రతరం చేశామని తెలిపారు. ఈ కేసు డిటెక్షన్‌లో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా కల్లెపల్లి రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా పాక రవీందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉప్పర్‌పల్లిలోని జిల్లా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా కల్లెపల్లి రవిచంద్ర, ప్రధాన కార్యదర్శిగా పాక రవీందర్, కోశాధికారిగా దేశం కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా పన్నాల బాల్‌రెడ్డి, రవి కిరణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా జి.రేణు యాదవ్, పి.రామకృష్ణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామారావు, శ్రీరాములు నియమితులయ్యారు. ఈ సమావేవంలో సీనియర్ జర్నలిస్టులు ఎం.వెంకట్ రెడ్డి, టి.మల్లయ్య, రచ్చ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్ గెలుపు



నవతెలంగాణ-కీసర

నాగారం శిల్పానగర్‌లోని పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంట్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికలలో పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్టీ వారు అత్యధిక మెజారిటీతో పారామౌంట్ డెవలప్మెంట్ కమిటీ పార్టీపై అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంట్‌లో గల 208 ఫ్లాట్స్ యజమానులలో ఐదుగురు ఎలక్షన్ ఆఫీసర్స్‌గా, ఎనిమిది మంది "అడ్వైజరీ కమిటీ"గా ఏర్పడి, ఎన్నికలు నిర్వహించారు. 208 ఫ్లాట్లకుగాను 158 ఫ్లాట్ల యజమానులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రక్రియను సీక్రెట్ బ్యాలెట్ మాధ్యం ద్వారా ప్రత్యక్ష ఓటింగ్, దేశ-విదేశాలలో ఉన్న యజమానులు అందరూ సులువుగా ఓటింగులో పాల్గొనుటకు ఈ-ఓటింగ్ పద్దతిని మొబైల్ లింక్ ద్వారా పోలింగ్ విధానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్టీ గెలవడంతో గుడివాడ త్రినాథరావు కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కొట్టె మనోహర్, కోశాధికారిగా హరి సాయి కృష్ణ, జాయింట్ సెక్రటరీ జయ చంద్ర, కార్యనిర్వాహక సభ్యురాలిగా వరలక్ష్మి రెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడిగా మోసూరు శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యుడిగా ఎనగంధుల ప్రసాద్, కార్యనిర్వాహక సభ్యుడిగా శ్రీనాథ్ కశ్యప్ ఎన్నికయ్యారు. "పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్" పార్టీకి 107 ఓట్లు, పారామౌంట్ డెవలప్మెంట్ కమిటీకి 51 ఓట్లతో రన్నర్‌గా నిలిచారని ఓట్ల లెక్కింపు అధికారి సోమ కిరణ్ తెలిపారు. పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్" పార్టీ వారికి సంక్రమించిన 107 ఓట్లలో 26 ఓట్లు ఈ - ఓటింగ్ పద్ధతిలో దేశ-విదేశాలలో ఉన్న యజమానుల ఓట్లు కావడం గమనార్హం. ఈ భారీ మెజారిటీతో కూడిన విజయాన్ని పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్మెంటు వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, టపాసులను కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మల్కాజిగిరి చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక




- అధ్యక్షులుగా విజయ్ కుమార్
- సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చికెన్ షాప్ అసోసియేషన్ ఓనర్స్ ఎన్నికలను సోమవారం మల్కాజిగిరి సర్కిల్ వినాయక్ నగర్ చౌరస్తాలో చికెన్ షాప్ ఓనర్స్ ప్రస్తుత అధ్యక్షులు జి.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఓటర్స్ మొత్తం 109 మంది ఓటర్‌లు ఉన్నారు. ఈ ఎన్నికలలో విజయ్ కుమార్, ఎండీ ఇదాయిద్‌లు పోటీలో నిలబడగా ఎండీ ఇదాయిద్‌కు 34 ఓట్లు పడగా, విజయ్ కుమార్‌కు 75 ఓట్లు పడ్డాయి. ఇదాయిద్‌పై ఎస్.విజయ్ కుమార్ 41 ఓట్లతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ప్రస్తుత అధ్యక్షులు జి. రాజు మాట్లాడుతూ అసోసియేషన్ ఎన్నికలతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. మల్కాజిగిరి సర్కిల్ చికెన్ షాప్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఈ.నరేష్, జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్‌గా నరేందర్ రెడ్డి, అడ్ వైజర్‌గా బి.రాజేష్ కుమార్, డివిజన్స్ ఇన్‌చార్జిలుగా గోపాల్, వెంకటేష్, సత్యనారాయణ, రాజమౌళి, కన్నా యాదవ్, ఖాసీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ, అసోసియేషన్ సభ్యులకు అందుబాటులో ఉంటూ, అసోసియేషన్ అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


బీఎంఎస్ మాజీ అధ్యక్షుడు శంకరన్న చిత్రపటానికి నివాళ్లు..



నవతెలంగాణ-అల్వాల్

గ్రేటర్ హైదరాబాద్ బీఎంఎస్ మాజీ అధ్యక్షుడు శంకరన్న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మూడుసార్లు బీఎంఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. డ్రైవర్ ఉద్యోగం చేస్తూ కార్మిక నాయకుడిగా ఎదిగిన శంకరన్న కార్మికులకు ఎన్నో సేవలు అందించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ, కార్మికులు ఆయన ఆశయాలను కొనసాగించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. అల్వాల్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సూపరింటెండెంట్ స్వామి, నారాయణరావు, లలిత్ కుమార్, మాజీ బీఎంఎస్ నాయకులు స్వామి, జానీ, సాయిలు, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, తిరుపతి, ఔట్సోర్సింగ్ కార్మికుల ప్రెసిడెంట్ వెంకటేష్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం ...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వ్యక్తి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ధర్మారెడ్డి ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి సూరారం, శ్రీరామ్ నగర్ కాలనీలోని, ప్రగతి రెసిడెన్సిలో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి అన్నం తిని పడుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసేసరికి ధర్మారెడ్డి లేకపోవడంతో... మార్నింగ్ వాక్‌కు వెళ్లారనుకున్నారు. కానీ ఎంతసేపటికి తండ్రి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కలంతా వెతికారు. స్నేహితులను విచారించిన ఫలితం లేకపోవడంతో సూరారం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కొడుకు కె శేఖర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రజావాణికి 13 ఫిర్యాదులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో సోమవారం ప్రజావాణిలో మొత్తం 13 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 వరకు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అందాయి. వాటిలో టౌన్ ప్లానింగ్ - 3, శానిటేషన్ -1, ఇంజినీరింగ్ మెయింటనెన్స్ -1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి.

అలాగే గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 8 ఫిర్యా దులు వచ్చాయి. ఇంజినీరింగ్ మెయింటనెన్స్ - 5, టౌన్ ప్లానింగ్ -2, యూబీడీ -1 ఫిర్యాదులు వచ్చాయి. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అర్జీలు పంపిస్తామని వారు తెలిపారు.

పుస్తెలతాడు చోరీ.. నిందితుడు అరెస్ట్..



నవతెలంగాణ-నిజాంపేట్

గృహిణి మెడలోని బంగారు తాడును చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని బాచుపల్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ప్రగతి నగర్ రాజీవ్ గృహకల్పలో నివసించే మొదల ప్రవీణ్ సాగర్ స్విగ్గి. జొమాటోలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను మార్చి 8, 2025న రాత్రి 10 గంటలకు 77వ బ్లాక్ ఆరవ ఫ్లాట్లో నివసించే కెల్ల బాలమ్మ అనే మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును లాక్కొని పారిపోయినట్టు గతంలోనే బాధితురాలు బాలమ్మ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటినుంచి నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. బాచుపల్లి క్రైమ్ పోలీసులు ఎట్టకేలకు సోమవారం సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నుంచి 2/1/2 తులాల పుస్తెలతాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు.

పాసు పుస్తకాలతో పాత లే ఔట్ల కబ్జా



● హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తండ్రులు అమ్మారు, తనయులు వచ్చి పాసు పుస్తకాలు తమ పేరిట సృష్టించుకుని పాత లే ఔట్లను చెరిపేసి పంట పొలాలుగా సాగు చేసేస్తున్నారని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులందాయి. సోమవారం హైడ్రా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 63 ఫిర్యాదులందాయి. ఇందులో పాతలేఔట్ల ఆక్రమణలే ఎక్కువగా ఉన్నాయి. ఇందులో రహదారులు, పార్కులు కూడా ఉన్నాయని వీటిని కాపాడాలని పలువురు ఫిర్యాదులందజేశారు. లే ఔట్లలో రహదారులను కబ్జాచేయడం, పార్కులు కలిపేయడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. అలాగే మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కబ్జాచేస్తున్నారని వారిపై ఫిర్యాదు చేసినా స్థానిక అధికారుల నుంచి స్పందన ఉండటంలేదని పలువురు వాపోయారు. తుర్కయాంజల్ చెరువులోకి వెళ్లే వాన నీటికి అడ్డంగా గోడ కట్టేయడంతో వరద మా కాలనీని ముంచెత్తుతోందని ఏపీనగర్-2కు చెందిన నివాసితులు ఫిర్యాదు చేశారు. ఘట్కేసర్ మండలం, ప్రతాప్ సింగారంలో మొత్తం 25.17 ఎకరాల్లో 390 ప్లాట్లతో 1989లో లే ఔట్ వేయగా, అందులో 88 ప్లాట్లు కబ్జాకు గురయ్యాయని, మొత్తం 6.14 ఎకరాల భూమి తనదంటూ ధరణి ద్వారా పాసు పుస్తకాన్ని సృష్టించి కబ్జా చేశారంటూ ప్లాట్లు కోల్పోయిన వారు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తండ్రి అమ్మగా అతని కుమారుడు ఇప్పుడు కబ్జాచేశారని, రైతు బంధు పథకం కింద డబ్బులు కూడా తీసుకున్నారని వాపోయారు. తాము ఫిర్యాదు చేయగా అధికారులు రైతుబంధును వాపసు చేయాలని నిర్ణయించారని, అయినా కబ్జా నుంచి వైదొలగడంలేదంటూ అక్కడి ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. మొత్తం లే ఔట్లలో రహదారులు, పార్కులు చెరబట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీ సర్వే నంబరు 63/1లఓని 1200 గజాలా ప్రభుత్వస్థలాన్ని కబ్జాచేసేస్తున్నారని, పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయిస్తే మంచి క్రీడామైదానం సమకూరుతుందని దేవేందర్‌నగర్ కాలనీ వీకర్ సెక్షన్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాకు వినతి పత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని శ్రీరంగాపూరంలోని 24వ వార్డులో 1050 గజాల పార్కు స్థలాన్ని అక్కడి మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశారని, శ్రీరంగాపూరం కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అక్కడ 6 కాలనీలకు వెళ్లే దారిని కూడా కబ్జా చేయడంతో దారి లేకుండా పోయిందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించిన అధికారులను వెంటనే విచారణ చేపట్టాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు.

పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భద్రతనిస్తుంది



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చింతల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆదేశాల మేరకు.. సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్‌ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరై రూ.21 లక్షల 46 వేల రూపాయల విలువగల 57 సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదల్లో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భద్రతను ఇస్తుందన్నారు. ఆర్థికంగా సతమతమైతున్న పేదలకు కాస్త ఉప శమనం కల్పించేందుకు సీఎం సహాయనిధి చెక్కులను నేడు లబ్ధిదారులకు అందజేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, అర్వ శంకరయ్య, పోలే శ్రీకాంత్, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు ఇన్సెంటీవ్ ఇవ్వాలి



● ప్రజావాణిలో సీఐటీయూ వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసి 3 నెలలు పూర్తయినా.. ఎన్యుమరేటర్లకు ఇన్సెంటీవ్ ఇవ్వలేదనీ, వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే అధికారులు సెలవు రోజులు, పని గంటలతో సంబంధం లేకుండా సర్వే పూర్తి చేయించుకున్నారని తెలిపారు. కానీ సర్వే చేసిన ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10వేల ఇన్సెంటీవ్ ఇస్తామని చెప్పి ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఎన్యుమరేటర్లు గట్టిగా ఇన్సెంటీవ్స్ గురించి మాట్లాడితే వారిని గ్రూప్ నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇన్సెంటీవ్ ఇవ్వాలనీ లేదంటే ఎన్యుమరేటర్లు పోరాటానికి సిద్ధపడుతారని తెలిపారు.

'నామినేషన్'లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్ఎస్ పార్టీ తరఫున దాసోజు శ్రావణ్ కుమార్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు... నీరు మరిచారు



● ప్రజావాణిలో పల్నాటి శివకుమార్ ఫిర్యాదు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నారు పోసినోడు నీరు పోయాక పోతాడా అనేది సామెత... ఆ సామెతకు పాత్ర వేశారు. పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రోడ్డు మధ్యలో మొక్కలు పెంపకం చేపట్టింది. అయితే కొందరు సిబ్బంది నిర్లక్ష్యంతో మొక్కలకు నీళ్లు పోయడం మరిచారు. దాంతో మొక్కలన్ని ఎండిపోయి ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుంది. వివరాల్లోకి వెళితే.. సూరారం కట్టమైసమ్మ చెరువు నుంచి షాపూర్ నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో నీడనిచ్చే మొక్కలు నాటారు. కానీ నీరు పోయడం మరి చారు. మొక్కలకు ట్యాంకర్లతో నీటిని పట్టాలి. లేదా మొక్కలకు నీటిని సరఫరా చేసేందుకు అండర్ గ్రౌండ్‌ల పైప్ లైన్లు ఏర్పాటు చేయాలి. కానీ ఈ రెండు పనులు చేయకపోవడంతో.. నెల రోజులుగా ఎండకు మొక్కలు ఎండిపోతున్నాయని, మొక్కలను సంరక్షించేందుకు వెంటనే నీళ్లు పట్టాలని... గాజులరామారం సర్కిల్ ప్రజావాణి కార్యాలయ ంలో డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి సోమవారం పల్నాటి శివకుమార్ ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి



నవతెలంగాణ-కొంపల్లి

పేట్ బషీరాబాద్ పరిధిలోని ఆల్వాల్ ఇండియా ప్రయివేటు లిమిటేడ్ కంపెనీలో ప్రతిభ డాలి అనే యువకుడు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుడిని కలవడానికి మార్చి 2వ తేదిన మల్లన్న కాలనీకి వెళ్లాడు. వెళ్లి అదే రోజు రాత్రి సుమారుగా 9.30 నిమిషాలకు తన స్నేహితుడి ద్విచక్ర వాహనం తీసుకొని తిరిగి వస్తుండగా.. మార్గం మధ్యలోనే సాయి గీత ఆశ్రమం దగ్గర తన యొక్క ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటం వలన తలకి బలంగా గాయాలయ్యాయి. వెంటనే తన స్నేహితుడు కొంపల్లిలోని వెల్నెస్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు అస్సాం రాష్ట్రం నుంచి వలస వచ్చి సదరు కంపెనీలో పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేఖరి శర్మని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిందని తెలియగానే ముందుగా ఆస్పత్రి యజమాన్యంతో సీఐ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మూడు రోజులుగా ప్రత్యేక చొరువ చూపించిన సీఐకి కుత్బుల్లాపూర్ మీడియా సిబ్బందికి విలేఖరి శర్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భవనాల సీజ్.. ఎంతవరకు సమంజసం



● కార్పొ రేటర్ సబీహా గౌసుద్దీన్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నిర్మాణంలో ఉన్నటువంటి భవనాలను సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను వివిధ బస్తీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అల్లపూర్ డివిజన్‌లోని పలు బస్తీలలో ప్రధానంగా స్ట్రీట్ లైట్స్, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ అభివృద్ధి పరచాలన్నారు. ప్రజావాణిలో ప్రజా సమస్యలపై వినతి పత్రాలను అందజేయకుండా భవన నిర్మాణాల మీదనే ఇష్టానుసారంగా దృష్టి సారించారని తెలిపారు. కొందరి ఫిర్యాదులను స్వీకరిస్తున్నటువంటి అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తే బాగుంటుందన్నారు. కొందరు వ్యక్తులు ఇస్తున్నటువంటి ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి జోనల్ కమిషనర్‌ని కార్పొరేటర్ అడిగారు. ప్రజలకు జవాబుదారీగా పని చేయాల్సిన అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జాహిద్ షరీఫ్ బాబా, నాగుల సత్యం, జావీదుద్దీన్, బొల్లు శ్రీనివాసరావు, కొండం శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ హమీద్, కందాడి రామ్ రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలకం



● బాలానగర్ సీఐ నర్సింహా రాజు

నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ జోన్ పరిధిలో నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు బాలానగర్ సీఐ నర్సింహా రాజు అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మస్జీద్-ఏ-మహమ్మదీయ, గౌతమ్ నగర్‌లో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మస్జీద్ ఆవరణలో ఎస్ఐ రాంనారాయణ్‌తో కలిసి సీఐ నర్సింహా రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ నిర్వహణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకమని సీఐ నర్సింహా రాజు పేర్కొన్నారు. సీసీ కెమెరాల ద్వారా చాలా వరకు నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. దొంగతనాలు చేసేవాళ్లు కూడా భయపడుతారన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకంగా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన మస్జీద్-ఏ-మహమ్మదీయ పెదలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ పెద్దలు మక్సూద్, సయ్యద్ గౌస్, అజ్మీర్, ముజీబ్, అజీమ్, నజీర్ ఖాన్, కైసర్, ఫిరోజ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుంచి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ టి.నర్సింహరాజు తెలిపిన వివరాల బాలానగర్ డివిజన్ పరిధిలోని బాల్‌రెడ్డి నగర్‌కు చెందిన వివాహిత ఉమా రాణి, ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా ఆచూకీ తేలియలేదు. భర్త రమేష్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణికి 55 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డీఆర్‌వో హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 55 ఫిర్యాదులు అందాయనీ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్డీఓ సాంబ శివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



నవతెలంగాణ-కొంపల్లి

పేట్ బషీరాబాద్ పరిధిలోని వెన్నెలగడ్డ సుచిత్ర ధనలక్ష్మి లేడీస్ హాస్టల్ లో కండెల ప్రియాంక అనే యువతి వయస్సు (27 సంవత్సరాలు) సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సదరు యువతి ప్రయి వేటు ఉద్యోగం చేసుకుంటూ సుచిత్రలోని హాస్టల్లో ఉంటుంది. ఇదే క్రమంలో బంకూరు రవికుమార్ అనే యువకుడు ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకోకపోవడంతో యువతి మనస్థాపానికి గురైంది. సోమవారం ఉదయం 9 గంటలకి తను ఉంటున్న హాస్టల్ రూమ్‌లోనే సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు గద్వాల జిల్లా ఇమాంపూర్ గ్రామానికి చెందిన తులసి రెడ్డి కూతురుగా పోలీసులు గుర్తించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



● సీపీఐ కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్

నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లి మండలంలోని జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ సోమవారం మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో సీపీఐ నేతలు ఫిర్యాదులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతి నగర్ ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను చోటు చేసుకుంటున్నాయని వివరించారు. అలాగే ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నా..స్థానిక అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో పలు పదవులు అనుభవించి నేడు మాజీలు అయినవారు పలువురు ప్రభుత్వ స్థలాల కబ్జాలో పాల్గొంటున్నారని తెలిపారు. దీనిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈశ్వర్, యాదయ్య, కుమార్ తదితరులు ఉన్నారు.

వేసవిలో తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



● కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో వేసవిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎండాకాలంలో నీటి సరఫరాను నిరంతరాయంగా అందించడానికి సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి బాలానగర్ జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాను అందజేయాలని అధికారులకు సూచించారు. ఎండాకాలంలో నీటి డిమాండ్ పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థలో ఏవైనా లీకేజీ వంటి లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేయాలని తెలిపారు. ఒకవేళ నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంటే, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ జలమండలి మేనేజర్ అనిల్ కుమార్, కూకట్ పల్లి జలమండలి మేనేజర్ డి. సతీష్ కుమార్ తో పాటు బాలానగర్ డివిజన్ కు సంబంధించిన లైన్ మెన్లు హాజరయ్యారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్ ప్రాంతంలో గల నల్ల పోచమ్మ ఆలయంలో శివాలయం, నవగ్రహాల ప్రతిష్టాప నోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు రాజకుమార్, నారాయణ గౌడ్,చిన్న, బొగ్గుల సురేష్,యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్,గోవర్ధన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని, సప్తగిరి కాలనీలో గల కార్యసిద్ధి గణపతి, శ్రీ సుబ్రమణ్య స్వామి జంటనాగ, నవగ్రహ సహిత శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయములో స్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో, ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మెన్ అరికెపూడి గాంధీ పాల్గొని.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అల్లం మహేష్, ప్రవీణ్ యాదవ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | మార్చి 11, 2025 | www.navatelangana.com

బీసీ నేతలకు ప్రాధాన్యతనిచ్చిన పార్టీ బీఆర్ఎస్

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



నవతెలంగాణ-బంజారాహిల్స్
బీసీ నేతలకు ప్రాధాన్యతనిచ్చిన పార్టీ అధిష్ఠానానికి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ నేత దాసోజు శ్రవణ్ నామినేషన్ వేయనున్న సందర్భంగా సోమవారం షేక్ పేటలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షులు జెజోల రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

- వాటర్ వర్క్స్ ఎండీకి కార్పొరేటర్ వినతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్
జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్‌నగర్ డివిజన్‌లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్. రెడ్డి సోమవారం వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని ఖైరతాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. బస్తీలు, కాలనీలు ఎక్కువ కలిగిన ప్రాంతం కావడంతో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అందుకు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి తాగునీటి సమస్య రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని మహిళ మృతి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్
సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిట్స్ వచ్చి పడిపోయి ఓ మహిళ చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 55 ఏండ్ల వయసు కలిగిన ఓ గుర్తు తెలియని మహిళ ఈనెల 7న సాయంత్రం శశికళ థియేటర్, భారత్‌నగర్ దగ్గర ఫీట్స్‌తో కింద పడి ఉండగా గమనించిన పోలీస్ సిబ్బంది వెంటనే 108 అంబులెన్స్‌లో ఆమెను గాంధీ హాస్పిటల్‌కి తరలించారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ చనిపోయినట్టు డాక్టర్‌లు పోలీసులకు తెలిపారు. కావున ఈ ఫోటోలో ఉన్న చనిపోయిన మహిళ గురించి తెలిసిన వారు ఎవరైనా ఉంటే.. సనత్‌నగర్ పోలీసు స్టేషను సెల్ నెంబర్ 833101 3246, ఇన్‌స్పెక్టర్ నెంబర్ 94906 17132కు కాల్ చేసి తెలియపరచాలని కోరుతున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో ఉంచారు.

సత్వర ఆరోగ్య సేవలకు ప్రత్యేక యాప్!

- ప్రారంభించిన ఎండీ అశోక్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో
జలమండలి ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ప్రత్యేక యాప్ రూపొందించారు. బోర్డు పరిధిలో హెల్త్ కార్డు ఉన్నవాళ్లకు ఆరోగ్య సేవల్ని మరింత సులభతరం చేసేందుకు "మెడ్ ఫ్లాష్" అనే మొబైల్ అప్లికేషన్ తయారు చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ఈ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగుల కోసం ఇలాంటి యాప్ తయారు చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ యాప్‌ను అర్హులైన వారు వినియోగించాలని తెలిపారు. డివిజన్లలో ఆరోగ్య సేవలకు సంబంధించిన పనిచేసే వాళ్లకు.. ఈ యాప్ వినియోగం



గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులకు సత్వర ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ యాప్ తీసుకొచ్చారు. ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తినప్పుడు ఈ యాప్ ఉపయోగించి సేవల్ని పొందవచ్చు. యాప్ ద్వారా ఆ వివరాలు నమోదు చేసుకుంటే ఏజెన్సీ వాళ్ల వెంటనే స్పందించి.. ఆరోగ్య వివరాలు, మంచి వైద్యం అందించే ఆస్పత్రులను కూడా సూచిస్తారు. అవసరమైతే.. అంబులెన్స్‌ను కూడా ఇంటి దగ్గరకు పంపించే సౌకర్యాన్నీ కల్పించారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్ లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటి సారి కావడం విశేషం. జలమండలిలో ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6685 మందికి హెల్త్ కార్డులు ఉన్నారు. వీరితో పాటు వీరి మీద ఆధారపడిన వారందరు.. దీని ద్వారా ఏడాదికి రూ. 3 లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్. ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ. శ్రీధర్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెండ్ జ్యోతి బాల, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నారీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-కంటోన్మెంట్
నారీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో వర్కింగ్ మహిళ డాక్టర్స్, పోలీసులకు మహిళ దినోత్సవ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన్నట్టు నారీ చారిటబుల్ ట్రస్ట్ చెర్మెన్ డాక్టర్ కీర్తన యాదవ్ తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి నాలుగు మహిళ క్రికెట్ జట్లు రాగా, రూబీ రెబెల్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్‌గా శక్తి వారియర్స్ టీము గెలుపొందాయి. విజేతలకు మల్లారెడ్డి హాస్పిటల్ ప్రతినిధి ప్రీతి రెడ్డి, కార్పొరేటర్ కొంత దీపిక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డా. కీర్తన యాదవ్ మాట్లాడుతూ.. వైద్య రంగంలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఇండియా బుక్ రికార్డు నుంచి మహిళా దినోత్సవం సందర్భంగా తనకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి మహిళ డాక్టర్స్, పోలీస్‌లు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలో ఎండను సైతం లెక్కచేయకుండా మహిళలు ఆడి సత్తా చూపారని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వైద్య ప్రతినిధులు, డాక్టర్లు, లాయర్లు పాల్గొన్నారు.

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి



- ఓయూ విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ
పీడీఎస్‌యూ యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయలని, యూనివర్సిటీలా స్వయం ప్రతిపత్తిని కాపాడలని సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట విద్యార్థులు హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాకేష్ సోనాబోయిన, ఓయూ నాయకులు భరత్, సతీష్, నవీన్, సందీప్, ప్రణయ్, యూనివర్సిటీ విద్యార్థులు, జిల్లా సహాయ కార్యదర్శిలు సాయిప్రసాద్, దీక్షిత, జిల్లా నాయకులు అనిల్ పాల్గొన్నారు.

14న రంగుల రంగేలి



నవతెలంగాణ-బంజారాహిల్స్
హోలీ వేడుక మాధాపూర్‌లోని రౌనాక్స్ హెచ్ఐజీహెచ్ మ్యాన్-మేడ్‌హిల్స్‌లో జరుగనున్నట్టు హైదరాబాద్ మోడల్స్ ఎండీ వంశీ పల్లె, టాలీవుడ్ నటి నిషా సింగ్ రాజ్ పుత్, ఆల్వేస్ ఈవెంట్స్ సుమంత్ నాని, రాజు తబెర్ల తదితరులు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటి కాజల్ అగర్వాల్ హాజరుకానున్నట్టు ప్రకటించారు. అనంతరం వేడుక పోస్టర్‌ను జూబ్లీహిల్స్‌లోని టాబెర్‌నా క్లబ్, కిచెన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిగ్గెస్ట్ హోలినేషన్ 2025 10వ ఎడిషన్ స్టార్-స్టడెడ్ లైనప్‌తో నిర్వహిస్తున్నామని, 7 నుంచి 9 వేల మంది హాజరుకానున్నారని వివరించారు. ఈ వేడుకలో నటి కాజల్ అగర్వాల్ ప్రధాన ఆకర్షణ అని తెలిపారు. ఉత్తేజకరమైన రెయిన్ డ్యాన్స్ సెటప్, అత్యుత్తమ పాపులర్ డీజేలు, బాలీవుడ్ మ్యూజిక్, వాటర్ గన్లు, రంగురంగుల స్ప్లాష్‌లు, రుచికరమైన తండై వంటి ఎన్నో ఏర్పాట్లు చేసినట్టు వంశీ పల్లే వివరించారు. ఇక పర్యావరణ అనుకూల పండుగ స్ఫూర్తికి అనుగుణంగా సహజ రంగులు మరో ప్రత్యేకత అని వారు వివరించారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బంది పెటొద్దు..

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట
నిరుపేదలైన ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బంది పెట్టడం అధికారులు మానుకోవాలని, లేకుంటే వారి ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సోమవారం రాంగోపాల్‌పేట, నల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన ఫుట్‌పాత్ వ్యాపారులు, జీహెచ్ఎంసీకి చెందిన షాపులలో అద్దెకు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు ఎమ్మెల్యేను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎన్నో ఏండ్ల నుంచి అక్కడే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు అద్దెలు పెంచుతామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద వర్గాలకు చెందిన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎన్నో ఏండ్ల నుంచి ఫుట్‌పాత్‌లపై, తోపుడు బండ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారికి జీవనాధారం లేకుండా చేసి వారి కుటుంబాలను రోడ్ల పాలు చేస్తారా? అని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి తప్ప.. అసలు వ్యాపారాలే చేసుకోకుండా ప్రయత్నించడం తగదన్నారు. అసలే వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో అధికారులు షాపుల అద్దెలను పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జీహెచ్ఎంసీ షాపుల అద్దెలను పెంచాలని అధికారులు ప్రభుత్వానికి ప్రపాదించారని తెలిపారు. కానీ పేద వర్గాలను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అద్దె పెంపు ప్రతిపాదనలను తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత షాపుల అద్దెలను ఒక్కసారిగా మూడు రెట్లు పెంచిందని, ఇది పేదలకు ఆర్థికంగా ఎంతో భారం అని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు తమ వైఖరిని మార్చుకోకపోతే వ్యాపారులకు మద్దతుగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, చిరు వ్యాపారులు హలీం, హన్మంతరావు, ఇమ్రాన్, నర్సింగ్ రావు, కిరణ్ తదితరులు ఉన్నారు.

బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ ఇన్‌చార్జి పర్యటన



- సమస్యల పరిష్కారానికి అధికారులతో సంప్రదింపులు

నవతెలంగాణ-కంటోన్మెంట్
కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సోమవారం పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట్‌లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక నాయకులు ప్రస్తావించిన సమస్యలపై ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాల్సిందిగా సూచించారు. డివిజన్ పరిధిలోని సర్వేనెంబర్ 1లో ఉన్న 108 ఎకరాల ప్రభుత్వ స్థలం ప్రస్తుతం కేవలం రెండు ఎకరాలు మాత్రమే ఉందని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై వెంటనే ఎమ్మార్వో ఆర్డీవోలతో ఆయన మాట్లాడారు. కబ్జాకు గురైన స్థలం ఎవరి చేతిలోకి పోయిందో సర్వే చేసి తేల్చాల్సిందిగా సూచించారు. మిగిలిన స్థలంలో స్థానిక ప్రజల అవసరాల మేరకు కమ్యూనిటీ హాలు ఇతర అవసరాల కోసం కేటాయించాలని సూచించారు. వడ్డెర బస్తీ శ్మశాన వాటికలో కనీస అవసరాలు అయిన బోరు, స్నానాలగది ఏర్పాటు చేయాలని సంబంధిత ఈఈకి తెలిపారు. అనంతర అంజయ్య నగర్‌లో ఖాళీగా ఉన్న 2వేల గజాల స్థలం కబ్జా కాకుండా కాంపౌండ్ వాల్ కట్టడం జరుగుతుంది. ఆంజనేయ నగర్‌లో సర్వేనెంబర్ 57లో ఉన్న స్థలంలో యాదవ సోదరులకు మల్లన్న దేవాలయం నిర్మించాలని స్థానికులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దండుగుల యాదగిరి, మల్లికార్జున యాదవ్, రాజేందర్, అస్లాం, అంజాద్, లక్ష్మయ్య విజయలక్ష్మి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ. ఎన్.నాగరాజు



నవతెలంగాణ-ఓయూ
ఇఫ్లూ నూతన వీసీగా ఇటీవలే నియమితులైన ప్రొ.ఎన్.నాగరాజు సోమవారం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్స్, ఉద్యోగులు అయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.

జీవోదయ హోమ్‌కు ఎల్ఐసీ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్
మహిళా దినోత్సవ సందర్భంగా ఎర్రగడ్డ, మోతినగర్‌లోని జీవోదయ బాలికల అనాథ హోమ్‌కు అమీర్‌పేట్ ఎల్ఐసీ బ్రాంచ్ 11 మహిళ అధికారి కన్వీనర్ శ్రీలత ఆధ్వర్యంలో, దుప్పట్లు, నిత్యాసర వస్తువులు, నోట్‌బుక్స్, ఆర్థిక సాయం అందించారు. ప్రతి ఏడాది ఇస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా జీవోదయ హోమ్‌కు ఆర్థిక సహాయం చేయటం జరిగిందని కన్వీనర్ శ్రీలత తెలిపారు.

దోపిడీదారులను తరిమేద్దాం..



- దక్షిణాది జేఏసీ చైర్మెన్ ప్రొ.గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ
మన దక్షిణాది ఉద్యోగాలు, వ్యాపారాలు, ఉపాధి అవకాశలను కొల్లగొడుతున్న ఉత్తరాది దోపిడీదారులను హైదరాబాద్ నుంచి తరిమెయ్యాలని దక్షిణాది జేఏసీ చెర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ పిలుపు ఇచ్చారు. సోమవారం జేఏసీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కో చైర్మెన్‌లు నకిరేకంటి సంజీవరావు, బైగళ్ల నాగేశ్వరావు, నమిడిదొడ్డి ఆనంద్, తాడేం బాలస్వామి, బింగి రాములు, అంకర్ల సుమన్‌తో కలిసి మాట్లాడుతూ.. తెలంగాణ జేఏసీ రాష్ట్ర సాధన కోసం సబ్బండ కులాల సహకారంతో ఎలా ఉద్యమం చేసిందో అలాగే దక్షిణాది జేఏసీ కూడా హక్కుల సాధన ఆత్మ గౌరవం కోసం ఉద్యమిస్థామని అన్ని వర్గాలు ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపు ఇచ్చారు.



రెజిమెంటల్ బజార్‌లో ఉన్న హిల్ స్ట్రీట్ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని మాజీ కార్పొరేటర్ వసంత యాదవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఓబీసీ మోర్చా శరద్ సింగ్ ఠాకూర్, వైశాలి రాష్ట్ర మహిళా మోర్చా కో ట్రెజర్, వైశాలి రాష్ట్రం మహిళా మోర్చా కో ట్రెజర్, వాసు ముదిరాజ్, రాజేష్ గౌలికర్, ఆలం సంతోష్, సురేందర్ సింగ్ చౌహాన్, రమేష్ ముదిరాజ్, రాజేష్ యాదవ్ హిల్ స్ట్రీట్ హైస్కూల్‌లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఓబీసీ మోర్చా ఆనంద్ గౌడ్, తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణను తక్కువ చేసి మాట్లాడితే ఖబర్దార్

- ఓయూ జేఏసీ అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ



నవతెలంగాణ-ఓయూ
రేవంత్ రెడ్డి జాతీయ మీడియా ముందు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రమని సీఎంగా తన చేతిలో 500 కోట్లు కూడా లేవనీ హేళనగా మాట్లాడడం సిగ్గుచేటని ఓయూ జేఏసీ అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ అన్నారు. రాష్ట్ర ఆర్థిక అంశాల మీద అవగాహన లేక ఎదిపడితే అది మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని తక్కువ చేస్తూ రాష్ట్ర పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి ఖబర్దార్ అని హెచ్చరించారు.ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓయూ జేఏసీ అధ్యక్షుడు డా.ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడుతూ..మీకు అవగాహనలేదు కాబట్టి రాష్ట్రంలోని ఆర్థిక నిపుణులతో క్లాసులు చెప్పించుకోవాలని సూచించారు. ఇచ్చిన 6 గ్యారెంటీలు 13 హామీలు అమలు పరచడం చేతకాక అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని అబాసు పాలు చేస్తూ మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.పదేండ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రస్థానంలో ఉన్నట్టుగా ఆర్బీఐ నివేదికలు సర్వే సంస్థలు కుండబద్దలు కొట్టినట్టుగా చెబుతుంటే మీ చేతగాని నాయకత్వం వల్ల 15 నెలల్లో తెలంగాణ కుక్కలు చింపిన విస్తరిలా మారిందన్నారు. ప్రతినెల రాష్ట్రానికి 18 వేల కోట్ల ఆదాయం వస్తే అందులో 6 వేల కోట్లు అప్పులకు గ్యారెంటీలకు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలకు పోగా మిగిలిన 12 వేల కోట్లు ఏం చేస్తున్నావు అన్నారు. శ్వేత పత్రం విడుదల చేయు, రాష్ట్ర సొమ్మును అప్పనంగా ఢిల్లీకి కప్పంగా కడుతున్నది వాస్తవం కదా, తక్షణం తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని దత్తాత్రేయ డిమాండ్ చేశారు. రైతుబంధులో కోతలు, రుణమాఫీలో ఎగవేతలు, రైతు బీమా ఉసేలేదు. 450 రైతుల ఆత్మహత్య, మహిళలపై దాడులు, హైడ్రా పేరుతో కూల్చివేతలు, ఎస్ఎల్బీసీతో కార్మికుల చావులు, కృష్ణా గోదావరి నదిజలాలను ఆంధ్ర దోచుకుపోతుంటే చూస్తూ కూర్చున్న చేతగాని సీఎంవి అన్నారు. ఒక్క రోజు కూడా తెలంగాణకు జై కొట్టని నీవు తెలంగాణకు సీఎం కావడం మా దురదృష్టం ఉద్యమకారులపై గన్ను ఎక్కుపెట్టిన నువ్వు ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణను ఎడారిగా మారుస్తున్నావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నేతలు మంథని మధు, పెద్దమ్మ రమేష్ ముదిరాజ్, శ్యామ్, రామకృష్ణ, శ్రీకాంత్, అనిల్ ప్రజాపతి, కోడూరు రఘు, దయాకర్, రాజు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగాలి

- పద్మశ్రీ డా.మంజుల అనగాని

నవతెలంగాణ-బంజారాహిల్స్
బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. మహిళల బలాన్ని, సాధనలను గౌరవిస్తూ ఆసక్తికరమైన ప్రదర్శనలు, చర్చా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సరోజినీ నాయుడు, సానియా మీర్జా, సుష్మితా సేన్, పీవీ సింధు వంటి ప్రముఖ మహిళలకు అంకితమైన ప్రదర్శనలను, తెలంగాణ గ్రామీణ మహిళల గౌరవార్థం 10 అడుగుల తెలంగాణా గ్రామీణ మహిళ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సినీ దర్శకురాలు బీవీ. నందినీ రెడ్డి, పద్మశ్రీ డా. మంజుల అనగాని (క్లినికల్ డైరెక్టర్-కేర్ వత్సల్య), ఐపీఎస్ అధికారి ఎస్. రష్మి పెరుమాళ్ (డీసీపీ, నార్త్ జోన్), సినీ నటి దివి వాద్య, సీనియర్ జర్నలిస్ట్ స్వప్న ప్రముఖ అంకాలజిస్ట్ డా. ప్రగ్యా చిగురుపాటి పాల్గొనీ ఆవిష్కరించారు. ఈ



సందర్భంగా కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజు నాయర్, వైద్య బృందంతో కలిసి మాట్లాడారు. మహిళల విజయాలను గౌరవించడంతో పాటు, సమాన అవకాశాలు కల్పించే వాతావరణాన్ని రూపొందించడం ముఖ్యమనీ ఈ తరహా కార్యక్రమాలు మార్పుకు దారి చూపుతాయాని నందిని రెడ్డి తెలిపారు. ఆరోగ్యరంగంలో మహిళలు సంరక్షకులుగానే కాకుండా, నాయకులుగా, ఆవిష్కర్తలుగా ఎదుగుతున్నారు. కేర్ హాస్పిటల్స్‌లో మహిళల సాధనలను గుర్తించి, వారికి అవసరమైన అవకాశాలు అందించే బాధ్యతను మేము నెరవేరుస్తామని పద్మశ్రీ డా.మంజుల అనగాని అన్నారు. కేర్ ఆస్పత్రి జోనల్ సీఈఓ బిజు నాయర్, మాట్లాడుతూ.. భారత మహిళలు గతం, వర్తమానం, భవిష్యత్తులో సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నరాని ఈ నివాళి వారి బలానికి గుర్తుగా నిలుస్తుందని అన్నారు. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు, ఇతర నాయకులు హాజరై, మహిళల సాధనలను ప్రశంసించారు. లింగ సమానత్వం కోసం మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని అందరూ గుర్తుచేశారు.

మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..

- మాల సంఘాలు

నవతెలంగాణ-ఓయూ
ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో మాల యూత్ ఫెడరేషన్, మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాల యూత్ ఫెడరేషన్ చైర్మెన్ మందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ ప్రెసిడెంట్ మాదాసు రాహుల్ రావు, అంసా ఓయూ ప్రెసిడెంట్ నామా సైదులు మాట్లాడుతూ.. ఆదివారం మంద కృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తర్వాతే గ్రూప్ 1,2 ఇతర నోటిఫికేషన్స్ లా రిజల్ట్ ప్రకటించాలి అంటూ.. గ్రూప్ 1,2 ఇతర పరీక్షాల ఫలితాలను నిలిపివేయాలి అనడాన్ని తాము మాల విద్యార్థులుగా, యువకులుగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాదిగ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మార్పీఎస్ నాయకులూ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నాట్టు చెప్పారు. మాదిగ మాజీ ఎమ్మెల్యేలు మాల సామజిక వర్గానికి 5శాతం రిజర్వేషన్స్ ఎక్కువ అయ్యాయని చెప్తూ ఎమ్మార్పీఎస్ నాయకుల మాటలను బలపరుస్తూ మాట్లాడటం చాల సిగ్గుచేటు. మాలలను అవమానిస్తూ వారు ఇప్పటికి ఎక్కువ లబ్దిపొందారు మరియు వారికి 5శాతం ఎక్కువ అని మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మాల సామజిక వర్గం కోటాలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్స్ చైర్మెన్‌లు అయినా వారంతా



మాల సామజిక వర్గానికి అన్యాయం జరుగుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు కూడా ఎం మాట్లాడకుండా మౌనంగా ఉంటూ జాతి భవిష్యత్తుని నాశనం చేస్తూ నష్టం జరుగుతున్న కూడా ఎం మాట్లాడకుండా ఉంటే వారి ఇంటి ముందు ధర్నాలు, ముట్టడులు, రాస్తారోఖోలో చేస్తామని హెచ్చరిస్తున్నాం. రిజర్వేషన్ సీట్లలో గెలిచి మాలాల పతనానికి కారణం అవుతున్న ఏ ఒక్కరిని కూడా ఈ సమాజంలో తిరగనివ్వం, రేపటి నుంచి వాళ్ల ఇండ్ల ముందే టెంట్ వేసి నిరసన ప్రదర్శనలు చేస్తామని, వారి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మద్దెల రాజు, సింగి శ్రీకాంత్, మాల శేఖర్, గండమల్ల శ్రీకాంత్, సంఖ్య శివకుమార్, సుధాకర్, గంగారాం, రఘు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు చేసే సేవ మరువలేనిది



● ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతబస్తీ దారుల్‌షిఫాలోని అంధుల ప్రాథమిక పాఠశాల, వసతి గృహంలో పని చేస్తున్న ఆయాలు, వైద్య సహాయకురాలు, పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, విద్యార్థుల పేరెంట్స్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డి శాలువాతో సత్కరించి.. బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధ విద్యార్థులకు చేసే సేవ మరువలేనిదని, ఎంతో ఓపిక శ్రమతో కూడుకున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ వైద్య సహాయకురాలు సుందరి మేరి, ఆయాలు లావణ్య, గీత, ఉమా, పాఠ శాల ఆయా రషీద బేగం, విద్యార్థుల పేరెంట్స్ రేణుక, ఉపాధ్యాయులు జావి ద్ అహ్మద్, రవీందర్ రెడ్డి. జానయ్య, అంజాద్ ఖాన్ తదితరులున్నారు.

అన్ని రంగాలలో మహిళల ముందుండాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ హరిచందర్

నవతెలంగాణ-బాలానగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బాలానగర్ మండల పరిధిలోని మహిళా ఉపాధ్యాయులను మండల కార్యాలయంలో మండల విద్యాధికారి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ హరిచందర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు. మహిళా వివక్షత లేని సమాజం ఏర్పడి మహిళా సాధికారత సాధించే దిశగా వారికి మనమందరం తోడ్పాటు నందించాలనన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయురాళ్లు జీటీఏ, పీఆర్‌డీయూ, టీఎస్‌టీఎస్‌ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన నాయకులు హాజరయ్యారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్లు కదిరివన్, ముకుంద రెడ్డి

● ప్రజావాణికి 80 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ముఖ్యమంత్రి ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, డాక్టర్ ముకుంద రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి 80 దరఖాస్తులు అందాయని వారు తెలిపారు. ఆ అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో గృహ నిర్మాణ శాఖకు 24, పెన్షన్ 29, రేషన్ కార్డ్స్ 7, ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు అందాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఈ. వెంకట చారి, ఆర్డీవో సాయిరాం, జిల్లా అధికారులు పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌వో వెంకటి, డీఈవో ఆర్.రోహిణి, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, సీపీవో సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

● ప్రజావాణిలో జీపీ కార్మికుల వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులకు 4నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వేతనాలు రాకపోవడంతో జీపీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తినడానికి తిండి లేక, ఇంటి కిరాయి కట్టలేక, పిల్లలకు స్కూల్ ఫీజులు, నిత్యావసరాలు తీర్చుకోలేక అనేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు.

ఘనంగా రాజ్‌కుమార్ దంపతుల వివాహా వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, టీఎన్జీవోస్ హయ్యర్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ యూనిట్ ప్రెసిడెంట్ బి.వి.ఆశోకా రాణి దంపతుల వివాహా వార్షికోత్సవ వేడుకలను ఆ యూని ట్ కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి ఎస్.డీ ప్రేమ్ కుమార్, జాయింట్ సెక్రటరీ జయంతిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫెర్రో స్ అహ్మద్, ఈసీ ముజాహిద్, ప్రియాదేవ్ ఠాకూర్, ఎగ్జిక్యూ టివ్ ఫోరం జాయింట్ సెక్రటరీలు రమేష్, సుదర్శన్, పబ్లిసి టీ సెక్రటరీలు శివ, అరుణజ్యోతి, కల్చరల్ సెక్రటరీ అఖిల్, ఈసీ యోగి, కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం డీఈవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతుల చేతులమీదుగా కేక్ కట్ చేయించారు. అనంతరం వారికి శాలువా కప్పి పూలబోకే అందించి ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సూర్య, మీర్జా, జి. రాజ్‌కుమార్, ప్రవీణ, శ్రీకాంత్, చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజేందర్, హైమావతి, అజ్మత్, మంజు, నర్సింహ, బషీర్, జేమ్స్, రాణి, అల్తాఫ్, శశిరత్న, అల్తాఫ్, జాకీర్ గిరిజా, రేణుక, సంతోష్, వెంకటేష్, సీపీరెడ్డి, శ్రీకాంత్, మధుకర్, శిల్ప, కిరణ్, అనిల్, విజయకుమార్, దేవిప్రసాద్, కృష్ణ, లావణ్య, గౌసియా, జంబయ్య లక్ష్మిపతి, చైతన్య, పరమేష్, దామోదర్, మహేందర్, రోషన్, రవీంద్ర, శ్రీకళ, సునీత, లత, రవికాంత్, సౌజన్య, సుకన్య శ్రీదేవి, చైతన్య, సుజాత పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 2025-26 విద్యా సంవత్సరానికి బాల బాలికల కోసం బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. కాయాకింగ్, కెనోయింగ్, సెయిలింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్‌లో గిరిజన బాల బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థినీ, విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీ. ఫ్లయింగ్ స్పోర్ట్స్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800 మీటర్లు, పరుగు పందెం పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 5వ తరగతిలో ఇంగ్లీష్ మీడియంలో 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ పొందే గిరిజన బాల బాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, మాస్, ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏండ్లలోపు వయస్సు కలిగి ఉండి, ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాల బాలికలు రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, బోనఫైడ్, ఆధార్ కార్డ్ జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 15వ తేదీ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో నిర్ణిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన అభి వృద్ధి కార్యాలయంలో సంప్రదించగలరు అని కోరారు.

బొట్టు శ్రీనన్న మృతి టీఎన్జీవో కేంద్ర సంఘానికి తీరని లోటు



● డాక్టర్ ముజీబ్

● శ్రీనివాస్ రావు భౌతికకాయానికి సెంట్రల్ యూనియన్ నాయకులు నివాళి

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవో రాష్ట్ర కోశాధికారి రామినేని శ్రీనివాసరావు (బొట్టు శ్రీనన్న) అకాల మరణం తమను తీవ్రంగా కలిచి వేసిందని, ఆయన మరణం టీఎన్జీవో కేంద్ర సంఘానికి తీరని లోటు అని ఆ సంఘం సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్) తెలిపారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ టీజీవో అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్, టీఎన్జీవో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర కార్యవర్గ సభ్యులతో కలిసి డాక్టర్ ముజీబ్ శ్రీనివాసరావు స్వగృహంలో వారి భౌతిక కాయానికి సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ బొట్టు శీనన్న జీవితమంతా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలతోటే కొనసాగిందనీ, ఆయన లేని ఉద్యమాన్ని ఊహించుకోలేమన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన, ఉద్యమాలతో పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి ఊదిన బొట్టు శ్రీనన్న అకాల మరణం తమను మనోవేదనకు గురించేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతవరకు శ్రీనన్న అమరుడుగా ఉంటాడనీ, వారి ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

బాలకృష్ణ ప్రసాద్‌కు నివాళులు..

నవతెలంగాణ-కల్చరల్

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులు గా ఉన్న అన్నమాచార్య కీర్తనలు తన గానంతో ప్రాచుర్యం చేయటంలో జీవితాన్ని చేసిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ సోమవారం ఉదయం తిరుపతిలోని ఆయన నివాస గృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరంలోని పలువురు సంగీత ప్రియులు, వివిధ రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ నెల 6నే యాదగిరి గుట్టలో బ్రహ్మోత్సవాలలో గాన గోష్ఠి చేసిన బాలకృష్ణ ప్రసాద్ ఆకస్మిక మరణం అయన అభిమానులను దిగ్భ్రాంతి లో ముంచింది. ప్రభుత్వ పూర్వ సలహాదారు గతంలో టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ బాలకృష్ణ ప్రసాద్ స్వరంలో భక్తి తొణికిస లాడుతుందన్నారు. ఆయన తిరుమల తిరుపతి దేవస్థానానికి గొప్ప అసెట్ అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికష్ణ సంతాపం వ్యక్తం చేస్తూ అన్నమయ్య పాడిన విధానం మనకు తెలియదని బాల కష్ణ ప్రసాద్ స్వరం అయన కీర్తనలు ప్రజలకు పరిచయం చేసిందన్నారు. వెంకట్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో 2003లో ఎనిమిది రోజులు, 2008 లో ఎనిమిది రోజులు త్యాగరాయ గానసభలో బాలకృష్ణ ప్రసాద్ సంకీర్తనా యజ్ఞం పేరిట 500, కీర్తనలు గానం చేశారన్నారు. నాడు సంగతుల గుర్తు చేసుకుంటూ సంస్థ స్థాపకుడు గరికపాటి వెంకట్ ప్రతి రోజూ కిక్కిరిసిన శ్రోతలతో నిండి ప్రముఖ వ్యక్తులకు స్థలం దొరకక బయటే నుంచునే పరిస్థితి వచ్చిందన్నారు. ఆయన తో మూడు దశాబ్ది పరిచయంలో పది సంకీర్తన సంపుటలకు సంకలన కర్తగా ఉన్నానన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కిన్నెర రఘు రాం యువ కళా వాహిని లంక లక్ష్మీ నారాయణ, రసమయి డాక్టర్ రాము, స్వర కర్త పివి సాయి బాబా, సంగీత దర్శకుడు రామా చా రి, గాయనీ గాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

● మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి లక్ష్మీ



నవతెలంగాణ-బాలానగర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌లో సీపీఐ నాయకులు చంద్రమ్మ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి మండలం సీపీఐ కార్యాలయంలో మహిళ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి లక్ష్మీ, అధ్యక్షులు హైమావతి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గృహహింస జరగకుండా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాలలో సమాన హక్కు కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళలు ఏ వయసులో అయినా ఉత్సాహంగా ఉండాలంటే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక ఇలా అన్ని రంగాలకు చెందిన మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఎన్నో ఆర్థిక అసమానతలు, విద్య, ఉద్యోగ అవకాశాలు ఇలా ఎన్నో అంశాలపై చర్చిస్తారు. ఈ పనులన్ని సమర్థంగా చేయగలిగే సత్తా రావాలంటే ముందుగా శ్రద్ధ వహించాల్సింది ఫిట్‌నెస్, ఆరోగ్యంపైనే అని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ కె.మనోచారి, జి. ఉమాదేవి, చంద్రమ్మ జి.రాములు, కె.కృష్ణాచారి తదితరులున్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
మంగళవారం | మార్చి 11, 2025 | www.navatelangana.com

ఆత్మరక్షణకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయి



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆత్మ రక్షణకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని కార్పొరేటర్ అమృత అన్నారు. ముషీరాబాద్ ఓమా తైకాండో అకాడమీ, వరల్డ్ ఫేమస్ మార్షల్ ఆర్ట్స్ తైక్వాండో కలర్ బెల్టు టెస్ట్, తైక్వాండో మాస్టర్ ప్రసన్న ఆంజనేయులు ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ అమృత మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రొత్సహించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. తైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసి యేషన్ అధ్యక్ష, గౌరీ శంకర్, కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, జగదీష్, కాలిని సెక్రెటరీ ఉపేందర్, సీనియర్ కోచ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉప్పుగూడ డివిజన్‌లో డ్రయినేజీ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.లక్ష్మమ్మ, ఎల్.కోటయ్యలు డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఉప్పుగూడ డివిజన్‌లో సీపీఐ(ఎం) సౌత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ఉప్పుగూడ ప్రాంతంలో డ్రయినేజీ మురుగు నీరు పొంగి పోర్లడంతో ఆ దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ మురుగు నీళ్ల రోడ్డుపై పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో సమస్యను ఫోన్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మమ్మ, ఎల్.కోటయ్య, శేఖర్, స్వరూప, సత్యవతి, ఈశ్వరమ్మ యశోద, జ్యోతి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.



నీటి సరఫరాలో ఇబ్బందులు కలగొద్దు

- లీకేజీ ఘటనపై ఎండీ అశోక్ రెడ్డి జూమ్ మీటింగ్
- పనులు సత్వరమే పూర్తి చేయాలని సూచన
- ప్రభావిత ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఆదేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నీటిసరఫరాలో నగరవాసులకు ఇబ్బందులు కలుగొద్దని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఘల్ రెస్టారెంట్ వద్ద 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్ లీకేజీ ఘటనపై ఎండీ సోమవారం జలమండలి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతుల పనులపై తాజా పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్‌మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. లీకేజీ వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో ఈడీ పరిశీలన

ఈ సందర్భంగా ఎండీ మరమ్మతులును పనులను సమీక్షించాలని జలమండలి ఈడీకి సూచించారు. ఈమేరకు ఈడీ మయాంక్ మిట్టల్ మరమ్మతులను క్షేత్రస్థాయిలో గంట గంటకు అధికారులతో సమీక్షించారు. సాయంత్రం వరకు పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరణ చేయడానికి అవసరమైతే మరిన్ని గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఈడీ ఆదేశించారు. పనులను వేగవంతం చేయడానికి మైక్రో లెవల్లో ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్ సన్



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ఉద్యమ చరిత్రలో అత్యంత కీలకమైన మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిద్దామని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న విజ్ఞప్తి చేశారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సందర్భంగా సోమవారం అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి సభ్యులు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రూబీ స్టీవెన్ సన్, తెలంగాణ వెంకన్నలు మాట్లాడుతూ మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణ సకల జనులు మొత్తం ఉద్యమ బాట పెట్టారని వారు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర పాలకులు మిలియన్ మార్చ్‌ను విఫలం చేయాలని తీవ్ర ప్రయత్నం చేసినా ఉద్యమకారులు తిప్పి కొట్టారని వారు గుర్తు చేశారు. ఉద్యమ కారుల రాజీలేని పోరాటం అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ సాధ్యమైందని రూబీ, తెలంగాణ వెంకన్నలు స్పష్టం చేశారు. మిలియన్ మార్చ్ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమకారులు ఉద్యమాన్ని ఉధృతం చేశారని వారు వివరించారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ఉద్యమకారుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి కృషి చేస్తుందని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె రూబీ స్టీవెన్ సన్ ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్నలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టీజేఏసీ నేతలు ఉద్యమ నాయకులు రామగిరి ప్రకాష్, బండి రమేష్, ఉప్పు సుధాకర్, విద్యాసాగర్, అశోక్, వాసు, శ్రీనివాస్, పాండు, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆరె కటిక మహాసభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ధూల్‌పేట

తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక మహాసభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నామని అఖిల భారత ఖటిక్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్. విజయ భాస్కర్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకోలేకార్ శ్రీనివాస్‌తో సమావేశంలో తెలిపారు. ఈ తెలంగాణ ఆరెకటిక మహాసభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు నరేందర్‌రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ కుమార్, మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ చకోలేకార్ లక్ష్మీ శ్రీనివాస్, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. ఆరె కటికలు పెద్ద ఎత్తున పాల్గొని ఆరె కటికలకు కార్పొరేషన్ ఏర్పాటు, కోకాపేట్‌లోని ఆరెకటికలకు కేటాయించిన ఎకరం భూమిలో భవన నిర్మాణం, బీసీ డీ నుంచి బీసీ ఏ లోనికి మార్చడం, శాసనమండలిలో ఆరెకటికలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా జంట నగరాలలోని గౌలిపుర, జియాగూడ, కాచిగూడ, బోయిగూడ కమేళాలను ఆధునికరించి ఆరెకటికలకు కేటాయించాలని ఇంకా అనేక సమస్యల పరిష్కారానికి ఆరెకటిక మహాసభ దోహదం చేస్తుందని విజయ భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరె కటికలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'ఏ రంగంలో రాణించాలన్నా శిక్షకులు అవసరం'

తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సమాజంలో మార్పుకు శిక్షకుల పాత్ర ఎంతో కీలకమైందని, ఏ రంగంలో రాణించాలన్న నాణ్యత కలిగిన శిక్షకుల అవసరం ఎంతో ఉంటుందని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్ తెలిపారు. సోమవారం హైదర్‌గూడలోని హెూటల్ సెంట్రల్ పార్క్‌లో 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ సమాజంలో పెరిగిపోతున్న విపరీత ధోరణలకు మానసిక బలహీనతే కారణమని, మానసికంగా ధృఢంగా ఉండేలా సమాజానికి దిశా నిర్దేశం చేయాల్సిన బాధ్యత శిక్షకులపై ఉందన్నారు. సైకాలజిస్టులతో పాటు ఉత్సాహవంతులైన యువతలో వ్యక్తిత్వ వికాసం, మార్పు, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుటకు మంచి శిక్షకులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నేటి నుండి 13వ తేదీ వరకు 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' అనే అంశంపై శిక్షణ నిర్వహించబడుతుందన్నారు. ఎంతో మంది ట్రైనర్లు ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా ఉన్నారని, అలాంటి వారికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ ఈ కార్యక్రమం తెలుగు రాష్ట్రాలలో అందిస్తున్న ఏకైక సంస్థ తమదేనన్నారు. ఈ ఐదు రోజుల శిక్షణలో భాగంగా సమాచార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, టీం బిల్డింగ్, మోటివేషన్, నిర్ణయాలు తీసుకోవడం ఎలా, సృజనాత్మకత, స్వీయ నిర్వహణ, స్టేజ్ ఫియర్, ట్రైనర్ లక్షణాలు, మంచి ట్రైనర్‌గా ఏ విధంగా ఎదగాలి, ఆడియో విజువల్స్ వంటి తదితర అంశాలపై సమగ్ర శిక్షణ కోల్ కత్తాకు చెందిన రిసోర్స్ పర్సన్ డా. గౌతమ్ నంద చేత అందించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డా.శ్రీపూజ, ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జి జగదీశ్వరరావు, నాయకులు లక్ష్మి సౌజన్య, ఏ.వి.శాంతి, సుబ్బారాయుడు, రవి, వేణుగోపాల్, సందీప్ రెడ్డి, వసుంధర, లక్ష్మణ్ కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల పోరాటాన్ని ఆపడం ఇక అసాధ్యం

టీపీఎస్‌కే రాష్ట్ర గౌరవాధ్యక్షులు అధ్యక్షులు జి.రాములు, రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా హక్కుల పోరాటాన్ని ఆపడం ఇక అసాధ్యమని, మహిళా చైతన్య మొలక 'ఇక మొలకెత్తడం ఆగదని టీపీఎస్‌కే రాష్ట్ర గౌరవాధ్యక్షులు అధ్యక్షులు జి.రాములు, రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి 128వ సభ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే)అవతరణలో విద్యార్థుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీఎస్‌కే రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.రాములు, రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సావిత్రిబాయి సామాజిక స్ఫూర్తిని గత 11 ఏండ్లుగా కొనసాగిస్తున్నామని ఆమె వర్ధంతి జయంతి సభలను అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి నేటికీ 29 ఏండ్లు ఐనా అమలు కాకుండా అడ్డుకుంటున్నది ఎవరన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే హైదరాబాద్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు జి.నరేష్, కవి రాజయ్య, ఎస్.శంకర్, న్యూయార్క్‌సర్ టీచర్ శారద, సాత్విక, తదితరులున్నారు.

సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహాత్మ జ్యోతిరావు పూలే యువ మంచ్ ఆధ్వర్యంలో క్రాంతికారి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు పరిష్కారం లింగ సమత్వాన్ని సాధించడం కోసం ప్రతి ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. 1975 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. జర్మనీలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ మహిళా కార్యాలయంలో నాయకురాలు కార్ల జెట్‌కిన్ అనే మహిళ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆలోచనను సూచించి ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలో ప్రతి సంవత్సరం ఆరోజునే మహిళా దినోత్సవం జరుపుకోవాలని ఆమె ప్రతిపతించింది. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్నతో సత్కరించాలని యువ మంచ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కుష్బు గుప్తాజీ, గవర్నమెంట్ టీచర్లకు సావిత్రిబాయి పూలే సేవా రత్న అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు తీసుకున్న టీచర్లు ప్రసన్న రాణి, టీ.వసంత, యువ మంచ్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.ప్రభాకర్, రాష్ట్ర యువజన అధ్యక్షులు పి.మహేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమ్ రాజ్, కార్యూన్ ఎం.అభిషేక్, జ్యోతిలక్ష్మి, సీహెచ్ యాదగిరి, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ డివిజన్‌లో దోమలను నిర్మూలించాలి

- సీపీఐ(ఎం) నేత పి.నాగేశ్వర్



నవతెలంగాణ-ధూల్ పేట్

గోషామహల్ డివిజన్‌లో దోమలను నిర్మూలించాలని సీపీఐ(ఎం) నేత పి.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. గోషామహల్ జోన్ సీపీఐ(ఎం) కమిటీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని దేవినగర్‌లో ప్రజాసమస్యల పరిష్కారానికి ఇంటింటికీ సర్వే చేశారు. ఈ సర్వేలో స్థానికులు సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో దోమల విహారంతో ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయని వాపోతున్నార న్నారు. పొద్దంతా పనిచేసి వచ్చే కార్మిక వర్గ ప్రజలు సాయంత్రం దోమల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని దోమలను నిర్మూలించాలన్నారు.

'మహిళల పథకాలపై ఆర్భాటం తప్ప సమీక్ష లేదు'

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొ.సుధారాణి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మహిళలకు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై ప్రభుత్వాల ఆర్భాటం తప్ప సమీక్ష లేదని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి అన్నారు. భారత మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్ నగర్‌లోని సమితి కార్యాలయంలో సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా 'బడ్జెట్ కేటాయింపులో మహిళల వాటా ఎంత?'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పాలకులు మహిళల కోసం అనేక స్కీములు, సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ ఆర్భాటంగా ప్రకటిస్తున్నారన్నారు. బడ్జెట్ సమావేశాలలో కేటాయింపులు చేసి వాటిపై ఏ రకమైన సమీక్ష నిర్వహిం చకపోవడం, జవాబుదారితనం లేకపోవడం వలన మహిళలు నష్టపోతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం భేటీ పడావో బేటీ బచావో పథకం ద్వారా కేటాయించిన బడ్జెట్‌లో 70 శాతం నిధులు ప్రచారానికి ఖర్చు పెట్టారన్నారు. ఐక్య రాజ్య సమితి ఐదు శాతం జీడీపీలో ఆయా దేశాలు ఖర్చు చేయాలని ఆదేశాలున్నప్పటికి మన ప్రభుత్వం కేవ లం ఒక్క శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకు న్నారని ఆమె విమర్శించారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షురాలు డా.రజనీ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని, సమాఖ్య రాష్ట్ర కార్య దర్శి ఎస్.జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు నళిని, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమీద, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు హైమావతి, అరుణ, చందన, సుజాత, విజయలక్ష్మి, దేవమ్మ తదితరులున్నారు.

ప్రజలు గ్లకోమో పట్ల అప్రమత్తంగా ఉండాలి

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



నవతెలంగాణ-మెహదీపట్నం

ప్రజలు కంటికి సోకే గ్లకోమా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. వరల్డ్ గ్లకోమా అవేర్నెస్ వీక్ సందర్భంగా ఆయన మెహిదీపట్నంలోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో గ్లకోమా అవేర్నెస్ వాక్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండ్లకు సోకే వ్యాధులలో గ్లకోమా అతి ముఖ్యమైనదని దీనిపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సెక్రటరీ క్రిస్టినా మాట్లాడుతూ గ్లకోమా మన కంటి చూపును అకస్మాత్తుగా చంపే ఒక సైలెంట్ కిల్లర్ అని అన్నారు. ప్రతి ఒక్కరూ రెగ్యులర్‌గా కంటి పరీక్షలు చేయించుకుంటే ఆదిలోనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని ఆమె తెలిపారు. సరోజిని దేవి ఆసుపత్రి గ్లకోమా వ్యాధి నిపుణులు డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ గ్లోకోమా వచ్చిన సగం మంది రోగులలో ప్రారంభంలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించవని వారికి ఆ వ్యాధి వచ్చినట్లు కూడా తెలవదన్నారు. ప్రతి ఒక్కరూ తరచుగా కంటి పరీక్షలు చేసుకోని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జున చారి, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, సరోజినీ దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సమస్యలను ప్రజావాణిలో ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వె కన్న తెలిపారు. చాంద్రాయణగుట్ట నర్కి ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. స్థానికంగా నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కా రానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏ యం సీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సీటి ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్ , ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు



నవతెలంగాణ-ముషీరాబాద్

చేనేత మగ్గాన్ని అవమానపరిచిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు డిమాండ్ చేశారు. యావత్ పద్మశాలీల చేనేత కళాకారుల చేనేత కార్మికుల పవిత్రమైన చేనేత మగ్గంపై సీఎం రేవంత్ రెడ్డి కాళ్లకు నల్ల బూట్లు వేసుకొని చేనేత మగ్గం నేసిన తీరును విధానాన్ని నిరసిస్తూ అశోక్ నగర్ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియ జేశారు. ఈ సందర్భంగా చిక్కా దేవదాసు మాట్లాడుతూ యావత్ పద్మశాలీలు చేనేత కార్మికులు వివిధ రాష్ట్రాల్లో జిల్లాల్లో ముక్త కంఠముతో సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆత్మగౌరవ పోరాటం చేయాలని అన్ని రాష్ట్రాల్లో జిల్లాల్లో మార్కండేయ స్వామితో సమానమైన తల్లితో సమానమైన అపవిత్రమైన చేనేత మగ్గాన్ని మగ్గానికి పద్మశాలీలు చేనేత కార్మికులు పాలాభిషేకాలు చేయాలని చిక్కా దేవదాసు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరకూ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ నరేందర్, మార్గం అమర్, వంశీ చింతకింది బల్లా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

- గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్, జవహర్ నగర్, ఉల్లి గడ్డ బస్తీ వాసి కె.శ్రీనివాస్ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ డివిజన్ బీజేపీ నేతలతో కలిసి సోమవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తండ్రి కె.భూమయ్య, భార్య కె.సుజాతను పరామర్శించారు. చికిత్స వివరాలను తెలుసుకొని, వారికి ఆర్థిక సాయం అందచేశారు. అనారోగ్యం నుండి త్వరలో కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఆనంద్ రావు, లక్ష్మి నారాయణ,శివ తదితరులు పాల్గొన్నారు.



104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కోఠి ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత ఐదు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే ప్రభుత్వం పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని తెలంగాణ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.ప్రకాష్ అన్నారు. సోమవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో ఉన్న ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 104 ఉద్యోగుల అందరితో కలిసి పెద్ద ఎత్తున పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వై.ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం 104 కాంట్రాక్ట్ ఉద్యోగులకు గత ఐదు నెలలుగా జీతాలు రాక తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. తాము 2008 నుంచి 198 వాహనాల ద్వారా 2022 సంవత్సరం వరకు పల్లె పల్లెకు వైద్య ఆరోగ్య సేవలు 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్‌ల విద్యార్హత ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. సమస్యలపై ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్.కర్ణన్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సమస్యలపై స్పందించిన ఆయన డీఎంఈకి సిఫారసు చేస్తానన్నారు. మా సమస్యలు పది రోజుల్లోగా పరిష్కరించకుంటే 20న పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు గాడే శ్రీనివాస్, సీహెచ్ ప్రవీణ్, ఎ.హేమలత, సిద్ధూ, శ్రావణ్ కుమార్, ఎ.వెంకటేష్, కరుణాకర్, కె. మాణిక్యం, సైదమ్మ, స్వప్న, సురేష్, శ్రీనివాస్, జి. గోపాల్, సురేందర్, నాగరాజు, వెంకటేష్, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ వర్తించే చట్టం తేవాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



నవతెలంగాణ-ముషీరాబాద్

మార్చి 12 నుంచి జరగబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకువస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని ఆగస్టు 1న అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రూపొందించి (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ ఆక్ట్ 2000) ఆ చట్టంలో గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్ కు వర్గీకరణ సూత్రం వర్తింపజేసేలా 4వ నిబంధనను పొందుపరిచారని దాని వల్ల ఆనాడు మాదిగ నిరుద్యోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఇప్పుడు ఆ చట్టాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పరిశీలన చేయాలని కోరారు. వర్గీకరణ వ్యతిరేక తీర్పును వేగంగా అమలు చేయాలని వర్గీకరణ అనుకూల తీర్పును అమలు చేయడానికి మాత్రం కొర్రీలు పెడుతున్నారన్నారు. మాదిగలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు కొనసాగుతున్నాయని తరువాత శాంతియుతంగా ధర్నాలు, రాస్తారోకోలు, ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయల ముట్టడిలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. పృథ్వీ రాజ్ యాదవ్, తెలంగాణ విఠల్,సయ్యద్ ఇస్మాయిల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో ఒక రోజు హరికథ కాలక్షేపం జరుగుతోంది. అక్కడ ఒక చిన్నారి హరికథ వింటూ తన్మయత్వం పొందుతోంది. ఆ హరికథ చెప్తోంది ప్రముఖ భాగవతార్లు కోట సచ్చిదానంద శాస్త్రి. మహాభారతాన్ని హరికథ రూపంలో చెప్తుండగా విన్న ఆ చిన్నారి ఇంటికి వచ్చి అదే మహాభారతంలోని అంశాలను రాగయుక్తంగా పాడసాగింది. ఆ రోజు ఎవరూ ఊహించి ఉండరు, ఈ చిన్నారి తన హరికథల ద్వారా దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచం గుర్తించేలా చేస్తుందని. ఆ చిన్నారి మరెవరో కాదు... ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అందుకున్న తొలి భారతీయ మహిళగా గుర్తింపు పొందిన ప్రముఖ హరికథా కళాకారిణి డి.ఉమామహేశ్వరి. అలాంటి గొప్ప కళాకారిణి తన హరికథా ప్రస్థానాన్ని మానవితో పంచుకున్నారు.

హరికథకు జీవం పోస్తున్న ఉమామహేశ్వరి

ఉమామహేశ్వరి తల్లి తండ్రులు ఇద్దరూ సంగీత విద్వాంసులు. వీరికి ఆరుగురు సంతానం. ఉమా మహేశ్వరికి ఒక అన్న ముగ్గురు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. ఈమెకు చిన్నతనం నుండి హరికథ అంటే ప్రాణం. మహాభారతంలోని పద్యాలను అవలీలగా చెప్పేవారు. అంతేకాకుండా ఏ పాట విన్నా ఎంతో చక్కగా పాడేవారు. ఇంట్లో అందరూ సంగీత విద్వాంసులు కావడం వల్ల శృతి, లయ పట్ల ఎంతో అవగాహన ఉండేది. తను పాట



పాడుతున్నప్పుడు అగ్గిపెట్టెలు తెచ్చుకొని చిడతలు లాగా వాయిస్తూ పాడేవారు. అన్నయ్య ఒక పెట్టేమీద కూర్చుని దరువు వేస్తూ ఉండేవాడు.

మొదటిసారిగా...

ఇంటి విద్య వంట పట్టదు అంటారు కదా! ఇంట్లో అందరూ సంగీత విద్వాంసులు అయినప్పటికీ ఉమామహేశ్వరి మాత్రం చిన్నతనంలో ఇంటికి దగ్గరలో ఉన్న సంగీత విద్వాంసులు వద్ద సంగీత పాఠాలు నేర్చుకునేందుకు వెళ్లేవారు. హరికథను దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సత్యనారాయణ గారు కాళిదాసు రాసిన కుమార సంభవం శ్లోకాలను హరికథగా మార్చారు. ఉజ్జయిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మొదటిసారిగా సంస్కృతంలో ప్రదర్శించారు. ఆమె ప్రదర్శనకు లభించిన స్పందన వర్ణనాతీతం. పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నప్పుడు ఉమామహేశ్వరి ఆనందానికి అవధులు లేవు. హరికథ అనే కళను సజీవంగా ఉంచడానికి ఈమె ఎంతో కృషి చేశారు. తనకు హరికథలను నేర్పించినటువంటి గురువులను స్మరించుకుంటూ వారికి నిత్యం కృతజ్ఞతలు తెలియజేసుకుంటూనే ఉంటారు.

తల్లిదండ్రులను విడిచి ఉండలేక

1960, మే 21వ తేదీనా కృష్ణా జిల్లాలో పుట్టిన మహేశ్వరి చిన్న వయసులోనే శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. తూర్పు గోదావరి కపిలేస్వరపురానికి చెందిన చల్లపిల్ల రాజావారు, జమీందారు ఎస్బీకే సత్యనారాయణ, వారి భార్య రాజరాజేశ్వరమ్మ ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి మచిలీపట్నం వచ్చేవారు. అప్పుడు అనుకోకుండా చిన్నారి ఉమామహేశ్వరి పాటలు విన్నారు. ఆమెను పిలిపించి వివరాలు కనుక్కొని కపిలేశ్వరంలోని తమ ఆశ్రమంలో చేర్చుకుంటామనీ, వసతి, భోజనం అన్నీ ఉచితంగా ఉంటాయని చెప్పారు. అయితే తల్లిదండ్రులను విడిచి ఉండలేక ఈ విషయం ఆమె ఇంట్లో వారికి చెప్పలేదు.

కుటుంబానికి ఆసరా...

మరుసటి ఏడాది ఆ దంపతులు మళ్ళీ వచ్చారు. ఈ అమ్మాయి విషయం ఇంట్లో చెప్పలేదని తెలుసుకొని, వారి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అప్పుడు ఉమామహేశ్వరి తండ్రి 'ఇంత పెద్ద కుటుంబం నడవాలంటే కష్టం, నువ్వు హరికథలు చెబితే కుటుంబానికి, నాకూ కొంచెం ఆసరాగా ఉంటావు' అని అన్నారు. వెంటనే ఉమను తీసుకుని కపిలేశ్వరపురం వెళ్లారు. అయితే ఆరోజు జమీందారు గారి కుటుంబం ఏదో ముఖ్యమైన పని మీద మద్రాసు వెళ్లిందనీ, రావాడానికి నెల రోజులు పడుతుందని అక్కడ ఉన్న గురువుగారు చెప్పారు. కడలి వీరదాసు విషయం తెలుసుకుని మళ్ళీ రావడం కష్టమవుతుందని ఉమను వాళ్ల ఇంట్లోనే పెట్టుకుని ఆ నెల రోజుల్లో గౌరీ కళ్యాణం నేర్పించారు. రాణిగారు మద్రాసు నుండి వచ్చిన తర్వాత వరలక్ష్మీ వ్రతం రోజు హరికథను ఏర్పాటు చేస్తే ఉమమహేశ్వరి చెప్పిన విధానం చూసి అభినందనల వర్షం కురిపించారు.





జమిందారు ప్రోత్సాహంతో...

ఉమామహేశ్వరి 1975లో కపిలేశ్వరపురంలోని సర్వారాయ హరికథా పాఠశాలలో చేరారు. జమిందారు ప్రోత్సాహంతో సంస్కృతం కూడా నేర్చుకున్నారు. 'హరికథకు కావల్సిన ఉపాంగాలు నాలుగు. అవి ఏమిటంటే సంస్కృతము, తెలుగు, నాట్యము, సంగీతం ఈ నాలుగు నేర్చుకుంటూ హరికథ నేర్చుకోవాలి. హరికథ అంటే ఉపన్యాసంలా చెప్పాడం కాదు. జమీందారు గారు పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ గారు మంచి స్నేహితులు. వీరిరువురి సలహాలతో సంగీతం, నాట్య కళలను ప్రభుత్వం పోషించేది. హరికథలకు ప్రోత్సాహం ఉండాలి. వాటిని ముందుకు తీసుకుని వెళ్ళాలి. ఆదిభట్ల నారాయణ దాసు గారు హరికథ పితామహుడు. ఆయన తన వారసత్వాన్ని ముందుకు తీసుకుని వెళ్ళాలని జమీందారు గారితో అనగా, జమీందారుగారు ఆ బాధ్యతలను నటరాజ రామకృష్ణగారికి అప్పగించారు. అపుడు హరికథకు కావాల్సిన అంశాలను ఉటంకిస్తూ కోర్సు రాసారు' అని ఆమె పంచుకున్నారు.

మరుగున పడుతుందనీ...

హరికథ అంటే ఏదో స్పీచ్ ఇచ్చినట్లు కాదు. ఏ పాత్రకు తగ్గట్టుగా ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి. ఉమామహేశ్వరి ఇప్పటివరకు తెలుగులో 800, సంస్కృతంలో 600 ప్రదర్శనలు ఇచ్చారు. 'మిగతా రంగాల వారికి కొద్దో గొప్పో ప్రోత్సహం లభిస్తుంది కానీ హరికథ మరుగున పడిపోతుంది. దీన్ని గుర్తించిన డా.రమణాచారి గారు ఇచ్చిన ప్రోత్సాహాన్ని మర్చిపోలేను. నాకు ఈ పురస్కారం రావడానికి కూడా ఒక విధంగా ఆయన ప్రోద్భలం ఉంది' అని ఆమె చెప్పారు. ఉమా మహేశ్వరికి పద్మశ్రీ వచ్చిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆమె కృషికి హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ హరికథా కళారూపాన్ని ఉమామహేశ్వరి మరింత ముందుకు తీసుకెళ్ళాలని, తన వారసత్వాన్ని తర్వాతి తరాల వారికి అందించాలని, యువతలో వీటిపై ఆసక్తి కలిగించాలని, ఎందరో హరికథా కళాకారులను మన దేశానికి అందించాలని కోరుకుంటూ...

- పాలపర్తి సంధ్యారాణి

వేసవిలో ఇలా...

వేసవిలో ఒకవైపు వేడి, చెమట కారణంగా చికాకుగా ఉంటుంది. ఏపని చేయాలన్నా విసుగ్గా ఉంటుంది. ఇక చర్మం చెమట పట్టి జిడ్డుగా మారుతుంది. మరోవైపు మొటిమలు, వేడి కారణంగా చర్మం పొడిబారడం వంటి సమస్యలు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. సమ్మర్‌లో మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం..

రోజుకు రెండుసార్లు స్నానం చేయండి..

వేసవిలో రోజుకు రెండుసార్లు కచ్చితంగా స్నానం చేయాలి. చాలామంది ఎండవేడి కారణంగా.. చల్లటి నీళ్లతో స్నానం చేస్తూ ఉంటారు. దీని కారణంగా చర్మం నిర్జీవంగా మారుతుంది. గోరు వెచ్చని నీటితో స్నానం చేసి.. చివర్లో రెండు మగ్గులు చల్లని నీరు పోసుకోండి. శరీర వేడి తగ్గడమే కాదు.. చాలాసేపు రిఫ్రెష్‌గా అనిపిస్తుంది.



సరిపదా నీళ్ల తాగండి..

ఈ కాలంలో చర్మం రిఫ్రెష్‌గా, శరీరం యాక్టివ్‌గా ఉండాలన్నా సరిపడా నీళ్ల తాగడం చాలా ముఖ్యం, ఎండ వేడి కారణంగా నీరు చెమట రూపంలో బయటకు వెళ్తుంది. దీని కారణంగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశముంది. దీంతో చర్మం నిర్జీవంగా మారతుంది. రోజుకు రెండు నుండి మూడు లీటర్ల నీటితోపాటు కొబ్బరి నీళ్ల , మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను తీసుకుంటే మంచిది.

సన్‌స్క్రీన్ అప్లై చేయండి..

ఏ సీజన్‌లో అయినా బయటికి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవడం తప్పనిసరి. ఎందుకంటే ఇది ఎండ నుంచి మన చర్మాన్ని కాపాడుతుంది. బయటికి అడుగుపెట్టే ముందు కచ్చితంగా సన్‌స్క్రీన్ రాసుకోవాలి, అది కూడా బయటకు వెళ్లటానికి ముందు 20 నిమిషాల ముందే రాసుకోవాలి.

ఈ ఆహారం తీసుకోండి..

వేసవి కాలంలోనూ చర్మాన్ని తాజాగా మార్చుకోవడానికి, మెరిపించుకోవడానికి విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. దీంతో మచ్చలేని మెరిసే చర్మం సొంతమవుతుంది.

ఇలాంటి దుస్తులు ప్రిఫర్ చేయండి..

ఈ సీజన్‌లో స్టైల్ కంటే సౌకర్యానికి ప్రాధాన్యమివ్వండి. వదులుగా, మెత్తగా ఉన్న దుస్తులు శరీరానికి హాయిగా ఉంటాయి. లైట్ కలర్ దుస్తులు ఇంకా కంఫర్ట్‌గా ఉంటారు. దీంతో శరీరమూ చల్లబడుతుంది.?

కులదురహంకార హత్యలపై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ కుల దురహంకార హత్యపై నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. సోమవారంనాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రణయ్, అమృత 2018లో కులాంతర వివాహం చేసుకున్నారని అన్నారు. అయితే అమృత తండ్రి మారుతీ రావు కుల మదంతో రూ.కోటి సుపారీ ఇచ్చి ప్రణయ్‌ను దారుణంగా హత్య చేయించారని గుర్తు చేశారు. తెలంగాణ సమాజం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిందనీ, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా ఉద్యమం నడిచిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం తన వంతు కృషి చేసిందనీ, దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టిందని చెప్పారు. హత్య చేయించిన మారుతి రావు 2020లో ఆత్మహత్య చేసుకున్నారనీ, మిగిలిన ఏడుగురిలో రెండో ముద్దాయికి మరణ శిక్ష, మిగిలిన ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నల్గొండ జిల్లాకోర్టు గొప్ప తీర్పునిచ్చిందన్నారు. పోలీసు అధికారులు దర్యాప్తులో సానుకూలంగా వ్యవహరించారనీ, వారికి ఏఐఏడబ్ల్యూయూ అభినందనలు తెలుపుతున్నదని చెప్పారు.

దేశంలో వందల కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయనీ, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరింతగా పెరిగాయని అన్నారు. ప్రభుత్వాలు దోషులకు అండగా ఉంటున్నాయనీ, ఈ నేపథ్యంలో వచ్చిన ఈ తీర్పు ఎంతో గొప్పదని చెప్పారు. శిక్షలే కాకుండా వీటికి పాల్పడేవారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు ఇస్తేనే, కులమదంతో ఉన్నవారికి భయం వస్తుందని అన్నారు. అలా అయితే బాధితులు ధైర్యంగా పోరాడుతారని వ్యవసాయ కార్మిక సంఘం భావిస్తోందని వివరించారు. కుల దురాగతాలపై దేశవ్యాప్తంగా పోరాటాలకు కోరుతున్నామన్నారు. అందుకు రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనీ, హిందూత్వ మనువాదాన్ని ఓడించాలని సూచించారు.

అసెంబ్లీ హుందాతనాన్ని పెంచేలా ఏర్పాట్లుండాలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సంబంధించి సభ హుందాతనాన్ని పెంచేలా ఏర్పాట్లు చేయాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సోమవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో ముందస్తు సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పీకర్‌తో పాటు మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్) -రామకృష్ణారావు, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, హెూం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేశ్ భగవత్, డీజీ(ఫైర్) నాగిరెడ్డి, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు సివి ఆనంద్, సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్ కర్నాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, శాసనసభ అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్ సమావేశాలు ఎక్కువ రోజులు నడిచే అవకాశాలున్నందున గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారమందించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని సూచించారు. సభలో సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే పంపితే వాటిని సభ్యులు చదువుకొని సభలో మాట్లాడడానికి, చర్చించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ బాషలలో ముద్రించి సభ్యులకు ముందస్తుగా అందించాలని ఆదేశించారు. ఒక శాఖపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలనీ, మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశాలు సజావుగా సాగేందుకు సభ లోపలితో పాటుగా, పరిసరాల్లో కూడా శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. సభా సమయంలో ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలనీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థ సమర్థవంతంగా, చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. సభకు సభ్యులు చేరుకోవడానికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సమావేశాల జయప్రదానికి అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో చాలా సంఘాలు చలో అసెంబ్లీ కార్యక్రమాలకు పిలుపునిచ్చే అవకాశమున్నందున పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ చుట్టూ మూడంచెల భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అలాగే వీఐపీల నివాసాలు, అసెంబ్లీకి వచ్చే రూట్‌లలో కూడా భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు జవాబులను త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి శాఖ తరపున ఒక నోడల్ అధికారిని నియమిస్తామనీ, తద్వారా అనుసంధానానికి సులభమవుతుందని చెప్పారు.

గ్రూప్-1 ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన మెయిన్స్ పరీక్ష ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలో అభ్యర్థులు పొందిన ప్రొవిజినల్ మార్కుల వివరాలను వెల్లడించింది. అభ్యర్థులు పొందిన మార్కుల వివరాలను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రకటించింది. సోమవారం టీజీపీఎస్సీ పాలకమండలి సమావేశాన్ని చైర్మెన్ బుర్రా వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఎస్సీ సభ్యులు అమీర్ ఉల్లాఖాన్, నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజినికుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించామని తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా 31,403 మంది అభ్యర్థులు ఎంపికైతే వారిలో 21,093 మంది మెయిన్స్‌కు హాజరయ్యారని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థులు టీజీపీఎస్సీ ఐడీ, మెయిన్స్ హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలతోపాటు క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేసి పేపర్ల వారీగా అభ్యర్థులు మార్కులను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ మార్కులను ఈనెల 16న సాయంత్రం ఐదు గంటల వరకు అంటే వారం రోజులపాటు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని వివరించారు. అభ్యర్థులు మెయిన్స్‌లో సాధించిన మార్కుల షీట్లను డౌన్‌లోడ్ చేసుకుని గ్రూప్-1 నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు దాచి ఉంచుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ మార్కుల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజులపాటు అవకాశం కల్పించామని తెలిపారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఈనెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని కోరారు. రీకౌంటింగ్‌కు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తిరస్కరించిన, అర్హత లేని అభ్యర్థుల మార్కులను అందుబాటులో ఉంచలేదని వివరించారు. వారి పేపర్లను రీవాల్యుయేషన్ చేయబోమని తెలిపారు. రీకౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక అభ్యర్థులందరి మార్కులను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఆ తర్వాత తుది జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేస్తామని తెలిపారు. దాని ఆధారంగా ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో సూచించినట్టుగా అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తుది జీఆర్ఎల్‌కు ఎంపికైన అభ్యర్థు లకు వ్యక్తిగతంగా, టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తామని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్-1 మెయిన్స్‌లో సాధించిన మార్కులను వెల్లడించబోమని తెలిపారు. మార్కుల షీట్‌ల డౌన్‌లోడ్, రీకౌంటింగ్ దరఖా స్తుకు సంబంధించి ఏమైనా సాంకేతికపరమైన సమస్యలు ఎదురైతే అభ్యర్థులు 040-23542185, 23542187 నెంబర్లు లేదా helpdesk@tspsc.gov.in మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే.

రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11:00 గంటలకు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. వెంటనే సభ మరుసటి రోజుకు వాయిదా పడనున్నది. ఈసారి బడ్జెట్ సమావేశాలు 10 రోజులకుపైగా నడిచే అవకాశముంది. 13న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం తర్వాత బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరుగనున్నది. అందులో అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు? బడ్జెట్ ఏ తేదీన ప్రవేశపెడతారు? తదితరాంశాలపై స్పష్టత రానున్నది. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించే అవకాశమున్నది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, ఆరు గ్యారంటీల అమలు, టీడీఆర్‌పై అవినీతి ఆరోపణలు, సాగునీటి ఇబ్బందులు, తదితర అంశాలపై రాష్ట్ర సర్కారును ఇరుకున పెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. అందులో భాగంగానే ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత కేసీఆర్ మంగళవారం సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అయితే, బీజేపీ, బీఆర్ఎస్‌లను ధీటుగా ఎదుర్కొనేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నది. మరోవైపు అసెంబ్లీ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నారు. అందులో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అసెంబ్లీ, ఆయా శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్ష నిర్వహించారు.

ఈసారైనా కేసీఆర్ వచ్చేనా?

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పెద్దగా బయటకు రావడం లేదు. గత బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో కేవలం ఒకే రోజు వచ్చారు. కొద్దిసేపు అలా ఉండి వెళ్లిపోయారు. సాంకేతికంగా శాసనసభ్యునిగా పదవీచ్యుతుడు కావొద్దనే ఇలా వచ్చి అలా వెళ్లారనీ, ఆయనకు అసెంబ్లీకి రావడం ఇష్టం లేదనే విమర్శలున్నాయి. అధికారం లేకపోతే అసెంబ్లీకి కేసీఆర్ రారు? ఆయనకు అధికారదర్పం తప్ప అభివృద్ధి పట్టదనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ ఇప్పటివరకూ సక్సెస్ అయ్యింది. ఆ అపవాదును తొలగించుకోవాలంటే ఈ బడ్జెట్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలనే ఆలోచనకు కేసీఆర్ వచ్చినట్టు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగానే శాసనసభ, శాసనమండలిలో సభ్యులు ఎలా వ్యవహరించాలి? ప్రభుత్వాన్ని ఏయే అంశాల్లో ఇరుకునబెట్టాలి? ప్రజల్లో బీఆర్ఎస్ పట్ల సానుభూతి పొందేందుకు ఏమేం చేయాలి? ఆరు గ్యారంటీల హామీలు, కాంగ్రెస్ మంత్రులపై పదేపదే చేస్తున్న ఆరోపణలను చట్టసభలో ఏవిధంగా చర్చకు తీసుకురావాలి? మొత్తం మీద రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ఏవిధంగా ఉక్కిరిబిక్కిరి చేయాలి? తదితర అంశాలపై కసరత్తు చేసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు. అందులో భాగంగానే సమావేశాలకు ముందురోజైన మంగళవారం బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం కూడా జరుగనున్నది. అయితే, ఇటీవల కాలంలో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఆ పార్టీ ప్రతిరోజూ ఏదోఒక అంశంపై మాట్లాడుతూ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను తమ ఎజెండా చుట్టూ తిప్పుకుంటున్నది స్పష్టంగా కనిపిస్తున్నది. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపుతూ అతి చేస్తున్నారనే విమర్శ కూడా ఉంది. దీన్ని ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎలా బ్యాలెన్స్ చేసుకుంటుందనే దాన్ని మున్ముందు చూడాలి.

గెలిచినా..ఆగాల్సిందే..

ఇటీవల పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ కోటాలో ముగ్గురు శాసనమండలి సభ్యులు కొత్తగా ఎన్నికయ్యారు. అయితే, టెక్నికల్‌గా ఆ మూడు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి, జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి ఆ పదవిలో ఈ నెల 29 వరకు ఉండనున్నారు. ఎమ్మెల్సీ హోదాలో వారే మండలికి హాజరుకానున్నారు. దీంతో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు శ్రీపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్క కొమరయ్య మండలిలో అడుగు పెట్టేందుకు వచ్చే సమావేశాల వరకు ఆగాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం గనుక 20 రోజులకుపైగా సమావేశాలు నిర్వహిస్తే మాత్రమే వారికి అవకాశం దక్కనున్నది. కానీ, అన్ని రోజులు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయా? అన్నది ధర్మసందేహమే.

శాసనసభ్యులు, మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తిసమాచారంతో సమాధానాలివ్వండి

అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతికుమారి

ఈ నెల 12 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలనీ, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సీఎస్ సూచించారు.

బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలనీ, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్, దాన కిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యూఎస్ఏఐడీలో కటాఫ్


(మొదటిపేజీ తరువాయి)

కొన్ని కార్యక్రమాలకే ఆర్థిక సాయాన్ని అందిస్తామని చెప్పారు. ఆరు వారాల సమీక్ష అనంతరం దాదాపు 5200 కార్యక్రమాలను రద్దు చేయాలని నిర్ణయించామని చెప్పారు." యూఎస్ఎయిడ్‌లోని 83 శాతం కార్యక్రమాలకు అధికారికంగా ముగింపు పలుకుతున్నాం. 5200 కాంట్రాక్టులను రద్దు చేశాం. ఇప్పటివరకు వేలాది కోట్ల డాలర్లు ఖర్చు పెట్టినా ఫలితమివ్వకపోగా.. కొన్ని సందర్భాల్లో ప్రతికూల ఫలితాలు ఇచ్చాయి. ఏదేమైనా అమెరికా జాతీయ ప్రయోజనాలే ముఖ్యం. ఈ సంస్కరణల కోసం తీవ్రంగా శ్రమించిన 'డోజ్' సిబ్బందికి ధన్యవాదాలు" అని విదేశాంగ మంత్రి మార్క్ రుబియో ట్వీట్ చేశారు. కాంగ్రెస్‌లో సంప్రదింపుల అనంతరం మిగిలిన కార్యక్రమాలను కొన సాగించాలని నిర్ణయించామన్నారు.అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్య తలు స్వీకరించిన ట్రంప్ యూఎస్ఎయిడ్ ప్రక్షాళనకు నడుం బిగించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అంతర్జాతీయంగా వేలాది కార్య క్రమాలకు అందజేస్తున్న నిధులను తాత్కాలికంగా నిలిపివేసిన ఆయన.. వాట కోసం పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులను తొలగించారు. మరోవైపు ట్రంప్ తీసుకున్న నిధుల సాయం నిలిపివేతకు సంబంధించి న్యాయస్థానాల్లో అనేక దావాలు నమోదవుతున్నాయి.

కేంద్ర సర్వీసులపై ఐఏఎస్‌ల అనాసక్తత

పెద్ద రాష్ట్రాల నుంచి డిప్యుటేషన్లు తక్కువే

భిన్న వైఖరి తీసుకుంటున్న చిన్న రాష్ట్రాల అధికారులు



న్యూఢిల్లీ : దేశంలో అఖిల భారత సర్వీసుల్లో (ఏఐఎస్‌లు) పనిచేస్తున్న అధికారుల్లో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వారే. అయినప్పటికీ వీరిలో కేంద్రంలో కార్యదర్శి స్థాయికి చేరుకుంటున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. కార్యదర్శి హోదా పొందేందుకు అర్హత కలిగిన 37 మంది అధికారుల్లో మహారాష్ట్రకు చెందిన వారు ఒక్కరు మాత్రమే ఉండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. 2024 అక్టోబర్ నాటికి కేంద్రంలో కార్యదర్శి, అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు పనిచేస్తున్న వారిలో మహారాష్ట్రకు చెందిన ఏడుగురు, యూపీకి చెందిన 12 మంది మాత్రమే ఉన్నారు. అఖిల భారత సర్వీసులు అంటే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఐఎఫ్‌ఎస్‌లు అనే విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్ 652 మంది ఐఏఎస్‌లు, 541 ఐపీఎస్‌లు, 217 మంది ఐఎఫ్‌ఎస్‌లతో దేశంలో ప్రథమ స్థానంలో ఉండగా మహారాష్ట్ర 435 మంది ఐఏఎస్‌లు, 317 ఐపీఎస్‌లు, 206 మంది ఐఎఫ్‌ఎస్‌లతో నాలుగో స్థానంలో ఉంది. అయితే ఈ రెండు రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లి పనిచేస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఒడిషా నుండి 584 మంది ఏఐఎస్ అధికారులు ఉంటే వారిలో 11 మంది కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే హర్యానా నుంచి 417 మంది అధికారులు ఉండగా 9 మంది, కేరళ నుంచి 510 మంది అధికారులు ఉండగా 11 మంది కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవులు చేపట్టారు. గుజరాత్ రాష్ట్రం నుండి 646 మంది ఏఐఎస్ అధికారులు ఉంటే వారిలో 12 మంది ఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్నారు. అస్సాం, మేఘాలయలో 600 మంది ఏఐఎస్ అధికారులు ఉంటే 11 మంది కేంద్ర సర్వీసులకు వెళ్లారు.

సౌకర్యాల లేమితో...

వివిధ రాష్ట్రాలకు చెందిన ఏఐఎస్ అధికారులు డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లకపోవడానికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. యూపీ వంటి పెద్ద రాష్ట్రాలు, మహారాష్ట్ర వంటి సుసంపన్నమైన, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు చెందిన ఏఐఎస్ అధికారులు కేంద్రానికి వెళ్లడానికి సుముఖత చూపడం లేదు. ఎందుకంటే వారికి తమ సొంత రాష్ట్రాల్లోనే అనేక అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడ పనిచేసినప్పటికీ పిల్లల్ని రాజధాని నగరంలో చదివించుకుంటారు. చిన్న రాష్ట్రాల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటాయి. అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఏఐఎస్ అధికారులు ఢిల్లీలో పనిచేయడానికి ఇష్టపడతారు. ఎందుకంటే వారి పిల్లలకు అక్కడ మంచి పాఠశాలలు అందుబాటులో ఉంటాయి. వారికి, వారి కుటుంబాలకు సామాజిక జీవనం కూడా మెరుగ్గా ఉంటుంది. ఇది చాలా విచారించవలసిన విషయమని అస్సాంకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హెచ్‌ఎస్ బ్రహ్మ తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో పనిచేయడానికి ఎవరూ ఇష్టపడరని ఆయన అన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలను బట్టి కూడా రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎంత మంది ఏఐఎస్‌లు వెళుతున్నారనేది నిర్ధారణ అవుతుంది. అనేక సంవత్సరాలుగా పశ్చిమ బెంగాల్ నుంచి చాలా కొద్ది మంది మాత్రమే కేంద్రానికి డెప్యుటేషన్‌పై వెళుతున్నారు. గత సంవత్సరం అక్టోబర్ నాటికి బెంగాల్ నుండి కేవలం ఐదుగురు అధికారులు మాత్రమే ఢిల్లీలో పనిచేస్తున్నారు. రాష్ట్రాలు తమ అధికారులను రిలీవ్ చేయకపోవడంతో పాటు వారు కూడా దేశ రాజధానిలో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ వేర్వేరు పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఈ పరిస్థితి కన్పిస్తోంది. యూపీకి చెందిన ఏఐఎస్ అధికారులు ఇటీవలి కాలంలో ఢిల్లీలో పనిచేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. యూపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉండడమే దీనికి కారణంగా చెప్పవచ్చు.

పాలకుల మెప్పుతో కీలక పదవులు

ఇక్కడ మరో విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు తమ పనితీరుతో పాలకుల మెప్పు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా రిటైరైన తర్వాత కూడా వారిని కీలక పదవులు వరిస్తుంటాయి. ఉదాహరణకు కేంద్ర హోం కార్యదర్శిగా ఐదేండ్లు పనిచేసి గత సంవత్సరమే రిటైరైన ఏకే భల్లా ఇప్పుడు మణిపూర్ గవర్నరుగా పనిచేస్తున్నారు. అదే విధంగా 2019 నుండి పీకే మిశ్రా ప్రధానికి ప్రిన్సిపల్ కార్యదర్శిగా ఉంటున్నారు. ఆయన గుజరాత్ కేడర్‌కు చెందిన అధికారి. కానీ ఆయన స్వరాష్ట్రం ఒడిశా. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ఫిబ్రవరిలో ప్రధాని ప్రిన్సిపల్ సెక్రెటరీ-2గా నియమి తులయ్యారు. ఈయన తూర్పు ప్రాంతానికి చెందిన అధికారి. ఇటీవలే ఫైనాన్స్ సెక్రెటరీగా పదవీ విరమణ చేసిన తుహిన్ కాంత పాండే సెబీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈయన కూడా ఒడిశా కేడర్‌కు చెందిన వారే.

రగులుతున్న సిరియా

- 830మందికి పైగా సామాన్యులు బలి
- అసద్ అనుచరులు, ప్రభుత్వ బలగాల మధ్య కొనసాగుతున్న దాడులు

డమాస్కస్ : సిరియాలో గత నాలుగు రోజులుగా భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. అసద్ ప్రభుత్వం పతనమైన తర్వాత అత్యంత అధ్వాన్నమైన హింసాకాండను దేశం చవిచూస్తోంది. ఇప్పటికి 830మందికి పైగా అమాయకులు దాడుల్లో మరణించారు. శుక్ర, శనివారాల్లో పశ్చిమ తీరంలో మైనారిటీలైన అలవైట్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని, 830మందికి పైగా పౌరులు బలయ్యారని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే సిరియా మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ తెలిపింది. సిరియాను గత ఐదు దశాబ్దాలుగా ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన అసద్ అలవైట్ వర్గానికి చెందినవారే, అసద్ పాలనలో మతపరంగా మైనారిటీలైన వీరిదే రాజ్యంగా వుండేది. అసద్ పదవీచ్యుతుడైన తర్వాత ఇక వారిపై మూకుమ్మడిగా దాడులు ప్రారంభమయ్యాయి. దీంతో దేశంలో తీవ్ర స్థాయిలో అంతర్యుద్ధం నెలకొంది, సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మద్దతుదారులని తెలిస్తే చాలు ఎక్కడబడితే అక్కడే వారిని ఊచకోత కోస్తున్నారు.దీంతో వీధుల్లో ఎక్కడ చూసినా శవాలే కనిపిస్తున్నాయని మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ తెలిపింది. కాగా అసద్ విశ్వాసపాత్రులను ఏరిపారేస్తామని కొత్త నేత అహ్మద్ అల్ షరారా ప్రతిన చేశారు. అయితే పౌరులకు ఎవరైనా హాని కలిగిస్తే వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

అత్యుత్తమ కెప్టెన్‌గా

రోహిత్ శర్మ

రెండు ఐసీసీ ట్రోఫీలు కైవసం



ముంబయి : భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా నిలిచాడు. రోహిత్ సారథ్యంలో టీమిండియా ఏడాది తిరగకుండానే రెండు ఐసీసీ ట్రోఫీలను కైవసం చేసుకున్నాడు. కేవలం ఎనిమిది నెలల్లోనే టీమిండియా రెండో ఐసీసీ టైటిల్‌ను నెగ్గింది. రోహిత్ నాయకత్వంలో భారత జట్టు గతేడాది టి20 ప్రపంచకప్‌ను గెలిచింది. తాజాగా ఐసిసి చాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. టోర్నీలో ఐదు వరుస విజయాలతో ట్రోఫీని గెలుచుకుంది. ఈ ట్రోఫీని గెలువడంతో రోహిత్.. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ స్పెషల్ క్లబ్‌లో చేరాడు. భారత్‌కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్‌గా ఘనత సాధించాడు. ధోనీ కెప్టెన్సీలో టీమిండియా మూడు ఐసీసీ టైటిల్స్‌ను గెలిచింది. సౌరవ్ గంగూలీ, కపిల్ దేవ్ నాయకత్వంలో భారత జట్టు ఒక్కో ఐసీసీ టైటిల్‌ను గెలుచుకుంది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని అందుకున్న మూడో భారత కెప్టెన్ రోహిత్ శర్మ కావడం విశేషం.

పర్సంటేజీలోనూ టాప్‌లోనే...

రోహిత్ 142మ్యాచ్‌ల్లో భారత్‌కు నాయకత్వం వహించగా.. ఇందులో 105 మ్యాచ్‌లను గెలిపించాడు. 33 మ్యాచుల్లో ఓటమిపాలైంది. రోహిత్ విన్నింగ్ పర్సంటేజ్ 73.94శాతంగా ఉంది. ఏ కెప్టెన్‌తో పోల్చినా ఇదే అత్యుత్తమం. రోహిత్ తర్వాత రికీ పాంటింగ్ 324 మ్యాచుల్లో ఆస్ట్రేలియాకు కెప్టెన్‌గా వ్యవహరించి... 220 మ్యాచ్‌లను గెలిపించి, 77 మ్యాచ్‌లను ఓటమిని చవిచూశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా పాంటింగ్ విన్నింగ్ పర్సంటేజ్ 67.90గా ఉంది. ఆ తర్వాత స్టీవ్ వా నాయకత్వంలో ఆస్ట్రేలియా 163 మ్యాచుల్లో 108 విజయాలు నమోదు చేయగా.. 44 మ్యాచుల్లో ఓడిపోయింది. విజయశాతం 66.25శాతంగా ఉంది. విరాట్ కోహ్లీ నాయకత్వంలో 213 మ్యాచులు భారత్ 137 మ్యాచుల్లో గెలిచింది. 60 మ్యాచుల్లో ఓడగా.. విజయశాతం 64గా నమోదైంది.

ఫైనల్ దిశగా ముంబయి

ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై గెలుపు

అదరగొట్టిన హర్మన్ ప్రీత్



ముంబయి : మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ముంబయి ఇండియన్స్ ఫైనల్ దిశగా సాగుతోంది. సోమవారం గుజరాత్ జెయింట్స్‌తో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ముంబయి 9 పరుగులతో విజయం సాధించింది. ముంబయి విధించిన 180 పరుగులు లక్ష్య సాధనలో గుజరాత్ ఆఖరిఓవర్‌లో బోల్తా పడింది. గుజరాత్‌లో ఓపెనర్లు, టాప్ ఆర్డర్ విఫలం చెందిన జట్టులో భర్తి పుల్మాలి ముంబయి బౌలర్లకు చుక్కలు చూపింది. కేవలం 25 బంతుల్లోనే నాలుగు సిక్స్‌లు, ఎనిమిది ఫోర్లతో 61 పరుగులు చేసింది. దీంతో 19 ఓవర్లు ముగిసేసరికి గుజరాత్ ఏడు వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఆఖరి ఓవర్‌లో విజయం కోసం 13 పరుగులు చేయాల్సి పరిస్థితి. అయితే ఈ ఓవర్‌లో మూడు వికెట్లు కోల్పోయి కేవలం 3 పరుగులు మాత్రమే గుజరాత్ చేసింది. ఈ విజయంతో ముంబయి ఫైనల్ దిశగా సాగుతోంది. ఇప్పటి వరకూ 7 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 10 పాయింట్లు సాధించి ఢిల్లీతో సమానంగా పాయింట్ల పట్టికలో నిలిచింది. అయితే ఢిల్లీకి అన్ని మ్యాచ్‌లు పూర్తిగా, ముంబయి ఈ నెల 11న బెంగళూరుతో తలపడ్డాల్సి ఉంది. ఈ టోర్నీలో ఇదే చివరి లీగ్ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంతో ముంబయి నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. బెంగళూరు కేవలం రెండు పాయింట్లతో పట్టికలో చివరి స్థానంలో ఉంది.

కాగా, సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన గుజరాత్ ముంబయి ఇండియన్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ముంబయి జట్టులో కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. కేవలం 33బంతుల్లో 9ఫోర్ల సాయంతో 54పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. స్కీవర్ బ్రంట్, మాథ్యూస్, అమన్‌జ్యోత్ కౌర్ తలా ఒక చెయ్యి వేయడంతో ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 179పరుగులు చేసింది. గుజరాత్ జెయింట్స్-ముంబయి ఇండియన్స్ ఇప్పటికే ప్లే-ఆఫ్ చేరుకోగా.. నామమాత్రపు మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి శుభారంభం దక్కలేదు. మాథ్యూస్(27) రాణించినా.. అమేలియా కెర్(5) నిరాశపరిచింది. దీంతో ముంబయి జట్టు 17పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత స్కీవర్(38) రాణించినా.. మాథ్యూస్ ధాటిగా ఆడే క్రమంలో ఔటయ్యింది. దీంతో ముంబయి జట్టు 46పరుగుల వద్ద రెండో వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత స్కీవర్-కెప్టెన్ హర్మన్ కలిసి 3వ వికెట్‌కు 59 పరుగులు జోడించారు. వీరిద్దరి భాగస్వామ్యంలోనే ముంబయి స్కోర్‌బోర్డు పరుగెత్తింది. అర్ధ సెంచరీ పూర్తయ్యాక హర్మన్ ధాటిగా ఆడే క్రమంలో కెప్టెన్ హర్మన్(54) ఔటవ్వగా.. చివర్లో యాస్తికా(13; 4బంతుల్లో ఫోర్, సిక్సర్) చెలరేగడంతో ముంబయి జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. గుజరాత్ బౌలర్లు తనూజ, కశ్వీ గౌతమ్, ప్రియా మిశ్రా, గార్డినర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

తెలంగాణలో పికిల్ బాల్ ఆటను ప్రోత్సహిస్తాం

హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు

హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్ బాల్ క్రీడను తెలంగాణ వ్యాప్తంగా అందరికీ చేరువ చేసి ఆటను ప్రోత్సహిస్తామని హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు అన్నారు. ఈ ఆటలో ప్రతిభావంతులను గుర్తించి వాళ్ల అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తామని చెప్పారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్ సమీపంలో పాడిల్ వెవ్ అనే సంస్థకు చెందిన పికిల్ బాల్, బాక్స్ క్రికెట్, సాకర్ కోర్టులను శ్రీనివాస్ బాబు ప్రారంభించారు. అమెరికా లాంటి దేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన పికిల్ బాల్ క్రీడను హైదరాబాద్ వాసులకు చేరువ చేసేలా కోర్టులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు సుమిరన్, సత్యదీప్‌ను అభినందించారు. ఈ ఆటకు రాష్ట్రం అంతటా గుర్తింపు తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని శ్రీనివాస్ బాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి పికిల్ బాల్ రాకెట్‌ను బహూకరించారు.



ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి శ్రీధర్ ముదిరాజ్, సంయుక్త కార్యదర్శి అజయ్ కందుల పాల్గొన్నారు.

నవచిత్రం

క్రేజీ కాంబినేషన్‌లో నయా సినిమా షురూ..




హీరో గోపీచంద్, సంకల్ప్ రెడ్డి కాంబినేషన్ ఓ ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ చేయనుంది. ఈ మూవీని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

భారీ స్థాయిలో నిర్మించనున్న ఈ హిస్టారికల్ ఎపిక్ మూవీని సోమవారం గ్రాండ్‌గా లాంచ్ చేశారు. 'ఐబి 71' (స్కై బ్యాక్ డ్రాప్), 'ఘాజీ' (వాటర్ బ్యాక్ డ్రాప్), అంతరిక్షం (స్పేస్ బ్యాక్ ట్రాప్) చిత్రాలతో విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి. ఇప్పుడు సరికొత్త టెరిటరీలోకి అడుగుపెడుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో ఫైర్ ఎలిమెంట్‌ని క్రియేటివ్‌గా ఎక్స్‌ప్లోర్ చేయనున్నారు. భారతీయ చరిత్రలో కీలకమైన, మరచిపోయిన సంఘటన విజువల్ వండర్‌గా ప్రజెంట్ చేయనున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ నెవర్ బిఫోర్ రోల్‌లో కనిపించనున్నారు.

7వ శతాబ్దంలో జరిగే ఈ సినిమా ఒక ముఖ్యమైన, ఇంకా అన్వేషించబడని చారిత్రక సంఘటనని ప్రేక్షకుల ముందుకు అద్భుతంగా తీసుకురానుంది. అలాగే భారతీయ వారసత్వం మరచిపోయిన అధ్యాయానానికి జీవం పోస్తుంది.

ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. 'హిట్ 1, హిట్ 2, గీత గోవిందం, సైంధవ్' వంటి విజయవంతమైన చిత్రాలకు పనిచేసిన మణికంధన్ ఎస్ డీవోపీగా పని చేస్తున్నారు. చిన్నా ప్రొడక్షన్ డిజైనర్‌గా, పృథ్వీ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి, రైటర్స్ :సురేష్ బాబు, ప్రకాష్, కాస్ట్యూమ్ డిజైనర్: హర్ష యాక్షన్: పృథ్వీ మాస్టర్.



మంచు విష్ణు, ప్రీతి ముకుందన్

'సగమై.. చెరి సగమై'

'కన్నప్ప' నుంచి విష్ణు మంచు, ప్రీతి ముకుందన్‌పై చిత్రీకరించిన 'సగమై.. చెరిసగమై' అంటూ సాగే ప్రేమ పాటను మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు. హీరో విష్ణు మంచు నటిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రమిది. 'శివా శివా శంకర..' పాట, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ మూవీని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో మరింతగా ప్రమోషనల్ కార్యక్రమాలను పెంచేశారు. ఈ సందర్భంగా ఓ బ్యూటీఫుల్ లవ్ మెలోడీ సాంగ్‌ను సోమవారం రిలీజ్ చేశారు.

విష్ణు మంచు, ప్రీతి ముకుందన్ కనిపించే 'సగమై.. చెరిసగమై' అంటూ సాగే ఈ పాటను రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. స్టీఫెన్ దేవస్సీ బాణీ హృదయాన్ని హత్తుకునేలా ఉంది. శ్రీమణి సాహిత్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సాంగ్ చిత్రీకరించిన తీరు, ప్రభు దేవా, బృందా కొరియోగ్రఫీ చేసిన విధానం, విష్ణు మంచు-ప్రీతి ముకుందన్‌ను చూపించిన తీరు, వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది.

శివ భక్తుడైన కన్నప్ప పురాణ కథను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. విష్ణు మంచు కన్నప్పగా, అక్షయ్ కుమార్ శివుడిగా, ప్రభాస్ రుద్రుడిగా, కాజల్ పార్వతీ మాతగా ఈ చిత్రంలో కనిపించనున్నారు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, బ్రహ్మానందం వంటి అద్భుతమైన తారాగణంతో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల అంచనాలకు అతీతంగా ఉంటుందని మేకర్స్ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మంచు విష్ణు మాట్లాడుతూ, 'ఇటీవల కాలంలో ఈ తరహా సినిమాలు రాలేదు. పైగా 'కన్నప్ప' భక్తి గురించి ఈ తరమే కాదు భవిష్యత్ తరాలు సైతం గొప్పగా చెప్పుకునేలా మా సినిమా ఎంతో కొంత దోహదం చేస్తుందని నమ్ముతున్నాను. ఇందులో అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్, మోహన్‌లాల్, మోహన్‌బాబు, బ్రహ్మానందం.. ఇలా ఎంతో మంది హేమాహేమీలు అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయబోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతుంది. పైగా ఇలాంటి పాత్రలో తమ హీరోలు నటించడాన్ని వారి అభిమానులు సైతం గర్వంగా చెప్పుకుంటారు' అని తెలిపారు.

లాయర్ల మీద గౌరవం పెరిగింది


హీరో నాని సొంత నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించారు. రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం హీరో ప్రియదర్శి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



ప్రియదర్శి

- 2022లో నేను, రామ్ జగదీష్ వేరే సినిమా చేస్తున్న టైంలో రామ్ జగదీష్ ఒక కథ ఉంది అని చెప్పారు. కథ విన్న తర్వాత, ఇలాంటి కథలు ఇప్పుడు ఎవరు చేస్తారని అనుకున్నా. అయితే ఇది హిట్ అయితే ప్రేక్షకులకు గుర్తుండిపోయి సినిమా అవుతుంది అనే గట్టి నమ్మకం కలిగింది. 'హాయ్ నాన్న' సినిమా చేస్తున్న టైంలో ఈ కథ గురించి నానికి చెప్పాను. ఆయన కథ విని, మనం సినిమా చేస్తున్నాం అని చెప్పారు. అలా స్టార్ట్ అయింది ఈ 'కోర్ట్' సినిమా.
- లాయర్ పాత్రలో మొదట నన్ను అనుకోలేదు. ఎవరైన పెద్ద ఆర్టిస్ట్ చేస్తే బాగుంటుంది అని అనుకున్నాడు రామ జగదీష్. కానీ నేనే ఈ క్యారెక్టర్ చేస్తానని బతిమిలాడాను (నవ్వుతూ). ప్రతి కోర్టు రూమ్ డ్రామాలో ముఖ్యంగా మనకి ఎవిడెన్సెస్, ఫ్యాక్ట్స్ అలానే వాటికి అమలు అయ్యే చట్టాలు ఇవన్నీ కూడా మనకి కొంతమేరకు తెలియాలి. అలానే కొంత మంది లాయర్ల దగ్గరికి వెళ్లి పోక్సో కేసు అంటే ఏమిటి?, దానికి ఎలాంటి శిక్షలు ఉంటాయి?, అలానే కొంతమంది జడ్జీలు దగ్గరనుంచి కొన్ని జడ్జిమెంట్స్ స్వీకరించి వాటి నుంచి ఒక మెటీరియల్ తయారు చేశాడు రామ్ జగదీష్. అవి నాకు కూడా ఇచ్చాడు.
- నేను కూడా రియల్‌గా కోర్టులో లాయర్లు, జడ్జీలు ఎలా ఉంటారు?, ఎలాంటి బట్టలు వేసుకుంటారు? వారి భాష ..ఇలా ప్రతి ఒక్కటి చూసి ఎగ్జాట్‌గా అలా ఉండేలా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాం.సెక్షన్లు కూడా మర్చిపోకుండా గుర్తుపెట్టుకున్నాను. ఈ క్యారెక్టర్ చేసేటప్పుడు లాయర్లు మీద రెస్పెక్ట్ పెరిగింది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మనకి ఎంతగా ఉపయోగపడుతుంది అని అర్థం అయింది. ఈ సినిమాని అత్యంత సహజంగా తెరకెక్కించాం.
- 'సారంగపాణి జాతకం', 'ప్రేమంటే', అలాగే గీత ఆర్ట్స్‌లో ఓ సినిమాకి సైన్ చేశాను. బయోపిక్ చేయాలనేది నా డ్రీమ్. ఒకవేళ చేస్తే శాంతా బయోటెక్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కే ఐ వరప్రసాద్ బయోపిక్ చేయాలని ఉంది.

మాస్ బీట్‌తో 'అది ధ సర్‌ప్రైజ్' సాంగ్



కేతిక శర్మ

వెంకీ కుడుముల దర్శకత్వంలో హీరో నితిన్ నటించిన చిత్రం 'రాబిన్ హుడ్'. ఈ చిత్రం నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడవ సింగిల్ 'అది ధ సర్ప్రైజ్‌ను సోమవారం మేకర్స్ విడుదల చేశారు.

మొదటి రెండు పాటలు బ్లాక్‌బస్టర్స్ అయిన తర్వాత ఈ పాటను ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించింది.

టైటిల్‌కి తగినట్లుగా ఈ పాట కేతిక శర్మ పాత్ర చుట్టూ ఉన్న ఆశ్చర్యకరమైన, హాస్యభరితమైన సంఘటనల శ్రేణిని ప్రదర్శిస్తుంది. జివి ప్రకాష్ కుమార్ మాస్ బీట్‌లతో కూడిన హై-ఎనర్జీ సాంగ్‌ని అందించారు, అంతేకాదు వీణ, నాదస్వరం జోడించడం వలన దానికి ప్రత్యేకమైన క్లాసీ టచ్ వచ్చింది.

ఈ ప్రత్యేక పాటలో కేతికా శర్మ తన అద్భుతమైన జాస్మిన్ బ్లౌజ్, ఎనర్జిటిక్ డాన్స్ మూవ్స్‌కి తన గ్లామర్‌ని జోడించి, పాటను విజువల్ ట్రీట్‌గా మార్చింది. సోషల్ మీడియాలో ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచిన ఈ పాట థియేటర్స్‌లో ప్రేక్షకులను డాన్స్ చేయించడం పక్కాగా కనిపిస్తుంది.

నీతి మోహన్, అనురాగ్ కులకర్ణి తమ అద్భుతమైన గాత్రాలతో ఈ పాటకు ప్రాణం పోశారు. చంద్రబోస్ రాసిన సాహిత్యం పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది.

శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ పాట వైబ్‌కి తగ్గట్టు మంచి ఎనర్జిటిక్‌గా ఉంది. 'అది ధ సర్ప్రైజ్' నిస్సందేహంగా ఈ సంవత్సరం అత్యంత హాటెస్ట్ పాటలలో ఒకటిగా స్థానాన్ని సంపాదించుకుంది. ఈ పాటలో చివరి విజువల్స్‌లో నితిన్, శ్రీలీల కలిసి చేసిన డాన్స్ నెక్స్ట్ లెవెల్‌కి తీసుకువెళ్ళింది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 28న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

హీరో నితిన్ ఇప్పటివరకు నటించిన చిత్రాలకు, ఆయన పోషించిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. ముఖ్యంగా రాబిన్‌హుడ్‌గా ఆయన ఏం చేయబోతున్నారు అనేది మాటల్లో కంటే వెండితెరపై చూస్తేనే మాజా వస్తుంది. దర్శకుడు వెంకీ కుడుమల ఈ చిత్రాన్ని ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు' అని మేకర్స్ అన్నారు.

శ్రీకాంత్ ఓదెల కథతో భిన్న ప్రేమ కథా చిత్రం



శ్రీకాంత్ ఓదెల

బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా'తో గ్రాండ్‌గా అరంగేట్రం చేసిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నాని హీరోగా 'ది ప్యారడైజ్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే తన మూడవ చిత్రాన్ని చిరంజీవితో తెరకెక్కించబోతున్నారు.

తాజాగా సొంత బ్యానర్ సమ్మక్క సారక్క క్రియేషన్స్‌ను ప్రారంభించి, చిత్ర నిర్మాణంలోకి అడుగు పెడుతున్నారు. సినిమా రంగంలో అద్భుతమైన అభిరుచి గల చిత్రాలకు పేరొందిన చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్‌కు చెందిన అనురాగ్ రెడ్డి, శరత్ చంద్రలను నిర్మాణ భాగస్వాములుగా చేస్తూ శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి కథను కూడా అందిస్తున్నారు, ఈ చిత్రానికి నూతన దర్శకుడు చేతన్ బండి రచన, దర్శకత్వం వహించనున్నారు.

అద్భుతమైన పోస్టర్ ద్వారా ఈ సినిమా టైటిల్ "ఏఐ అమీనా జరియా రుక్సానా గులాబీ' అని ప్రకటించారు. ఈ పోస్టర్‌లో నల్లటి చీరలో ఒక అమ్మాయి సరిహద్దు వెంట నడుస్తూ, ఎర్ర గులాబీలు చెల్లాచెదురుగా పడి ఉండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. టైటిల్, ఆకర్షణీయమైన పోస్టర్ కలయిక ప్రేక్షకులలో మరింత ఆసక్తిని కలిగిస్తుంది. 2009లో గోదావరిఖని అనే బొగ్గు పట్టణం నేపథ్యంలో జరిగిన నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కనున్న ఒక ప్రేమకథ. ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను ట్రెజరీ టోకెన్ తేదీ ఆధారంగా చెల్లించాలి

- అర్నెల్లలో పూర్తిగా ఇస్తే ప్రయోజనకరం : ఉప ముఖ్యమంత్రి భట్టికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను ట్రెజరీ టోకెన్ నెంబర్ తేదీ ఆధారంగా మొదట పెండింగ్‌లో ఉన్న బిల్లును మొదట చెల్లించాలనే నిర్ణయం చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్నెల్ల కాలంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లిస్తే ప్రభుత్వానికి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులపై ఉద్యోగ జేఏసీతో సమావేశాన్ని నిర్వహించారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను 16 వాయిదాల్లో చెల్లిస్తామనీ, ఏప్రిల్ నుంచి బిల్లులను మాత్రం వెంటనే చెల్లిస్తామంటూ ప్రస్తావించారని పేర్కొన్నారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో మరిన్ని సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మార్చి వరకు ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను 16 వాయిదాల్లో 16 నెలల్లో చెల్లించడం వల్ల 16 నెలల తర్వాత చెల్లించినట్లవుతుందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ట్రెజరీలో వేసిన బిల్లులను వెంటనే చెల్లిస్తారని పేర్కొన్నారు. అంటే గతేడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ట్రెజరీలో వేసిన జీపీఎఫ్/ మెడికల్ రీయింబర్స్‌మెంట్/ సరెండర్/ టీఎస్‌జీఎల్ఐ బిల్లులు పెండింగ్‌లో ఉంటాయని వివరించారు. ఈ ఏడాది మార్చిలో రిటైర్ అయ్యే వారికి ఏప్రిల్ లేదా మేలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వస్తాయని తెలిపారు. కానీ గతేడాది జులై లేదా ఆగస్టులో రిటైర్ అయిన వారికి ఈ ఏడాది డిసెంబర్‌లో బెనిఫిట్స్ చెల్లిస్తారని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉపయోగం లేకపోగా నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ బిల్లులు ముందు చెల్లించాలనే విషయం కూడా ఉద్యోగ జేఏసీ నాయకులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటారని తెలిసిందని వివరించారు. దీనివల్ల పైరవీలు, అవినీతికి తావిస్తుంది తప్ప ప్రయోజనముండబోదని పేర్కొన్నారు.



పరస్పర బదిలీల ఉత్తర్వులను వెంటనే ఇవ్వండి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పరస్పర (మ్యూచువల్) బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాను సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. 317 జీవోలో భాగంగా ఇచ్చిన పరస్పర బదిలీలు ఇప్పటికే ఆలస్యమైందని తెలిపారు. పరస్పర బదిలీలను వెంటనే ఇవ్వాలని కోరారు. సాధారణ పరిపాలన శాఖ ఆమోదం తెలిపిందనీ, మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర్వులను జారీ చేస్తామని ఆమె హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ బదిలీలకు సంబంధించి దరఖాస్తు పెట్టుకుని రిటైర్ అయిన ఉపాధ్యాయులకు, నూతనంగా డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను ఊడా అనుమతించాలని సూచించారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామన్నారని తెలిపారు. ఏకీకృత సర్వీస్ నిబంధనలు రూపొందించి ఉన్నత స్థాయి పదోన్నతులతోపాటు ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి (ఎంఈవో), జిల్లా ఉప విద్యాధికారి (డిప్యూటీఈవో) పోస్టులకు పదోన్నతులను ఇవ్వాలనీ, తద్వారా పాఠశాలల పర్యవేక్షణ సజావుగా సాగుతుందని కోరారు. త్వరలోనే సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిశీలిస్తామని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, నాయకులు సతీశ్‌రెడ్డి, చిత్తలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-2 జీఆర్ఎల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-2 రాతపరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మంగళవారం విడుదల చేయనుంది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారి కోసం గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 33 జిల్లాల్లో రాతపరీక్షలను నిర్వహించారు. వారిలో పేపర్-1కు 2,57,981 (46.75 శాతం) మంది, పేపర్-2కు 2,55,490 (46.30 శాతం) మంది, పేపర్-3కి 2,51,738 (45.62 శాతం) మంది, పేపర్-4కు 2,51,486 (45.57 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు.

14న గ్రూప్-3 జీఆర్ఎల్

రాష్ట్రంలో గ్రూప్-3 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్షల జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఈనెల 14న విడుదల చేయనుంది. గతేడాది నవంబర్ 17,18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-3 రాతపరీక్షలను టీజీపీఎస్సీ నిర్వహించింది. తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-3కి రాష్ట్రవ్యాప్తంగా 5,36,400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 2,69,483 (50.24 శాతం) మంది పరీక్షలకు హాజరయ్యారు.

థాయ్‌లాండ్‌లో బందీలుగా ఉన్న 540 మంది యువతకి విముక్తి

కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యంతో భారత్‌కు తరలింపు

ఏపీ, తెలంగాణకు చెందిన పలువురికి సైతం విముక్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యోగాల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగా మారి వెట్టిచాకిరికి గురవుతున్న వందలాది మంది భారతీయ యువతకు విముక్తి లభించింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జోక్యంతో వారందరినీ స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. మొత్తం 540 మంది బందీలను గుర్తించగా వీరిలో తెలంగాణ, ఏపీకి చెందిన 42 మందిని గుర్తించారు. తొలివిడతలో భాగంగా 270 మందిని సోమవారం ఢిల్లీకి తీసుకొచ్చి విముక్తి కల్పించారు. తొలుత వారిని థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణానికి తరలించిన అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకొచ్చారు. మంగళవారం మరో 270 మందితో రెండో విమానం ఇండియాకు రానుంది. ప్రస్తుతం వారంతా మయన్మార్‌లోని మేవాడీ జిల్లాలో ఆర్మీ పరిరక్షణలో ఉన్నారు. వాస్తవానికి వారంతా విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు వెళ్లి అక్కడ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగాఉద్యోగాలిప్పిస్తామని స్థానిక ఏజెంట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు యువతకు ఆశ చూపారు. ఉద్యోగాలు ఖరారయ్యాయని నమ్మబలికిన ఏజెంట్లు థాయ్‌లాండ్‌తోపాటు పొరుగునున్న కాంబోడియా, లావోస్, మయన్మార్‌లలో పలు సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో వీరిని విక్రయించారు. అక్కడికి వెళ్లాక వారితో బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నారు. ఒకవేళ సైబర్ నేరాలు చేయకపోతే యువతీ, యువకులకు కరెంటు షాకులిచ్చి హింసిస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు ఇలాగే కొలువు కోసం వెళ్లి బందీగా మారిన విషయం మీడియాలో వచ్చింది. వెంటనే స్పందించిన కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వారిని రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భారత విదేశాంగశాఖకు స్వయంగా లేఖ రాశారు. మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్యకార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో మయన్మార్ ప్రభుత్వం తన ఆర్మీని పంపి సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లలో బంధీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. అనంతరం బండి సంజయ్ చొరవతో కేంద్రం వారందరినీ స్వదేశానికి రప్పిస్తుండటం గమనార్హం. ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్లు వేసే వలలో చిక్కుకుని మోసపోవద్దని కేంద్ర మంత్రి బండి సంజయ్ యువతకు సూచించారు.

గృహజ్యోతికి ఏడాది



లబ్ధిదారులు 50,36,680 మంది

డిస్కంలకు రూ.1775.16 కోట్లు

చెల్లించిన ప్రభుత్వం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పథకం గృహజ్యోతి. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీని ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమల్లోకి తెచ్చి ఏడాది పూర్తయ్యింది. 2025 ఫిబ్రవరి నాటికి ఈ పథకం లబ్దిదారుల సంఖ్య 50,36,337 కు చేరింది. ఇప్పటివరకు 5,11,61,104 జీరో బిల్లుల్ని జారీ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) గృహజ్యోతి జీరో బిల్లుల పద్దు కింద ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.1,775.16 కోట్ల సొమ్మును చెల్లించింది. డిస్కంల వారీగా టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 25,86,027 మంది గృహ వినియోగదారులు లబ్ది పొందుతున్నారు. ఈ డిస్కం పరిధిలో 2,46,34,860 జీరో బిల్లుల్ని ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జారీ చేసి, రూ.850.58 కోట్ల సొమ్మును ప్రభుత్వం చెల్లించింది. ఎన్పీడీసీఎల్ పరిధిలో 24,50,653 మంది లబ్దిదారులు ఉండగా, 2,65,26,244 జీరో బిల్లులు జారీ చేసి, రూ.924.58 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. ఈ పథకం ద్వారా అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 2.81 లక్షల గృహ వినియోగదారులు లబ్ది పొందుతున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఖమ్మం జిల్లాలో 2.64 లక్షలు, నల్గొండ జిల్లాలో 2.42 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 2.20 లక్షలు, జగిత్యాల జిల్లాలో 2.06 లక్షల మంది గృహ వినియోగదారులు లబ్ది పొందుతున్నారు. ఈ పథకం పేద కుటుంబాల విద్యుత్ ఖర్చుల్ని తగ్గించి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవకాశం ఏర్పడుతున్నది. ప్రభుత్వ పరిశీలనలో గతంలో అతి తక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారులు కూడా 200 యూనిట్ల వరకు ఉచితం కావడంతో, ఎక్కువ కరెంటును వాడుతున్నట్టు గుర్తించారు. ప్రభుత్వ ఆరుగ్యారెంటీల అమల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. గృహజ్యోతి ద్వారా కూడా పేదలకు ఆర్థికలబ్ది కలుగుతున్నదని ప్రభుత్వం భావిస్తుంది.

రెండో పాయింట్ వద్ద తవ్వకాలు

రెస్క్యూ సిబ్బంది పనులు ముమ్మరం

గురుప్రీత్ సింగ్ మృతి పట్ల మంత్రి జూపల్లి సంతాపం

టన్నెల్ సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష

ప్రగాఢ సంతాపం ప్రకటించిన ఉన్నతాధికారులు

నేటి నుంచి రంగంలోకి రోబోలు : కలెక్టర్

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి



దాదాపు 300 మంది రెస్క్యూ సిబ్బంది 16 రోజులపాటు ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం సొరంగంలో చేపట్టిన సహాయక చర్యల ఫలితంగా టీబీఆర్ ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ మృతదేహం బయట పడింది. దాంతో సోమవారం తవ్వకాలను ముమ్మరం చేశారు. క్యాడవర్ డాగ్స్ రెండు ప్రదేశాల్లో కార్మికుల ఆనవాళ్లను పసిగట్టాయి. ఒక ప్రదేశంలో తవ్వకాలు చేయగా ఒక మృతదేహం లభించింది. రెండో పాయింట్ దగ్గర సోమవారం ఎలాంటి ప్రమాదమూ జరగకుండా జాగ్రత్తగా తవ్వకాలు జరుపుతున్నారు. చనిపోయిన గురుప్రీత్ సింగ్‌కు సంతాపం ప్రకటించి వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఉన్నతాధికారులు రూ.25 లక్షలు అందజేశారు. మిగతా కార్మికుల కోసం తవ్వకాలను తీవ్రం చేశారు. సోమవారం టన్నెల్ ఆఫీసులో డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన క్యాడవర్ డాగ్స్ స్క్వాడ్, సహాయక చర్యల్లో పాల్గొంటున్న విభాగాల అధికారులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన సహాయక చర్యలను సమీక్షించి, పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని వెలికి తీసిన సహాయక బృందాలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. ఈ దుర్ఘటనలో గురుప్రీత్ సింగ్ మృతి చెందడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యల నిర్వహణ కోసం అవసరమైన అన్ని రకాల వనరులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. టన్నెల్ ప్రాంతానికి సహాయక బృందాలు సులభంగా చేరుకునేందుకు వాహన సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు వివరించారు.

ప్రాణ నష్టం జరగకూడదనే ..

సొరంగంలో చిక్కుకున్న కార్మికులను కాపాడాలన్న లక్ష్యంతో ముందుకు కదులుతున్న రెస్క్యూ టీంకు ఎటువంటి ప్రాణ నష్టం ఉండరాదనే కోణంతో తవ్వకాలు చేస్తున్నారు. గురుప్రీత్‌సింగ్ మృతదేహం పక్కనే మరో పాయింట్ దగ్గర తవ్వకాలు చేస్తున్నారు. టీబీఎం మిషన్ తీస్తే... పై భాగం పడిపోయి రెస్క్యూ టీం మొత్తం ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా టీబీఎం మిషన్‌ను కట్ చేస్తూ.. సిబ్బంది అన్ని జాగ్రతలూ తీసుకుంటోంది. సోమవారం సాయంత్రానికి సహాయక చర్యలు ఓ కొలిక్కి రాకపోతే మంగళవారం నుంచి రోబోల ద్వారా తవ్వకాలు మొదలు పెడతామని కలెక్టర్ చెప్పారు.

15న టెన్త్ ప్రీఫైనల్ పరీక్ష, పీటీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకేరోజు పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్ష, అదే సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం కూడా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకేరోజు రెండు కార్యక్రమాలను ఎలా నిర్వహించాలని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15న శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం)ను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అయితే అదేరోజు పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా సోషల్ స్టడీస్ పరీక్షను నిర్వహించాల్సి ఉన్నది. ఒకే రోజు పరీక్ష, సమావేశాన్ని నిర్వహించడం ఎలా సాధ్యమవుతుందని విద్యాశాఖను ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఆలోచించి పీటీఎంను తర్వాత మరోరోజు నిర్వహించాలని సూచిస్తున్నారు. ఇంకోవైపు పీటీఎంకు తల్లిదండ్రులు వంద శాతం హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

జర్నలిస్టుల ఐక్యత చాటుతాం

ఇండ్ల స్థలాల సాధనకు ఉద్యమం

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బసవపున్నయ్య, సోమయ్య

టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరికలు, సభ్యత్వ నమోదుకు భారీ స్పందన

ఖమ్మంలో జర్నలిస్టుల బైక్ ర్యాలీ.. అంబేద్కర్‌కు నివాళి



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో జర్నలిస్టులు కదం తొక్కారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు సభకు విశేష స్పందన లభించింది. దాదాపు 300కు పైగా జర్నలిస్టులు తరలివచ్చి సభ్యత్వాలు నమోదు చేయించుకున్నారు. వివిధ జర్నలిస్టు యూనియన్‌ల నుంచి టీడబ్ల్యూజేఎఫ్‌లో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు చేరారు. దీనికి ముందు ఖమ్మంలోని కాల్వొడ్డు జూబ్లీ క్లబ్ నుంచి రోటరీ నగర్‌లోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జూబ్లీ క్లబ్ వద్ద ఈ ర్యాలీని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ సెంటర్ మీదుగా జడ్పీ సెంటర్‌కు ర్యాలీ చేరుకుంది. అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి జర్నలిస్టులు నివాళి అర్పించారు. తిరిగి ప్రారంభమైన మోటార్ బైక్ ర్యాలీ ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా రోటరీ నగర్‌లోని సభాస్థలికి చేరుకుంది. సభా ప్రారంభానికి ముందు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జక్కంపూడి కృష్ణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో మృతి చెందిన జర్నలిస్టులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య మాట్లాడుతూ.. ఓ రెండు జర్నలిస్టు యూనియన్లు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి వత్తాసు పలుకుతూ.. జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఈ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పోరాడే టీడబ్ల్యూజేఎఫ్‌ను పాత్రికేయులు ఆశ్రయిస్తున్నారని చెప్పారు. ఇంత భారీగా తరలివచ్చి సభ్యులుగా చేరిన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2006లో ఫెడరేషన్ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి నేటి వరకు టీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న పోరాటాలకు జర్నలిస్టులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఇండ్ల స్థలాల విషయంలో ఖమ్మం జర్నలిస్టులను మభ్య పెట్టే రీతిలో కొందరు వ్యవహరించారని ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ ఆరోపించారు. వందల సంఖ్యలో సభ్యత్వం తీసుకొని టీడబ్ల్యూజేఎఫ్‌ను బలోపేతం చేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకూ యూనియన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్‌లో చేరిన సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలపై నికరంగా పోరాడే రియల్ ఫైటర్స్ టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరేందుకు ముందుకు రావడం గర్వకారణంగా ఉందని వ్యాఖ్యానించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా.. ఏ సమయంలోనైనా ఫోన్ చేస్తే ఇట్టే వచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం టీడబ్ల్యూజేఎఫ్ చేరే జర్నలిస్టులకు కండువాలు కప్పి స్వాగతించారు. రాష్ట్ర నాయకులకు జిల్లా కమిటీతో పాటు నూతన సభ్యులు శాలువాలు కప్పి పూల మొక్కలిచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు పారుపల్లి కృష్ణారావు, యూనియన్ కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాగుల్ మీర, విష్ణు, శ్రీధర్, రామకృష్ణ నాయక్, నాగమణి, రామచంద్రమూర్తి, పాష, అర్షద్, ఉపేందర్, ఫయాజ్, శరత్, సతీష్, రిషి, మూర్తి, నర్సింహారావు, పత్తి శ్రీను, సాగర్, ఆవుల శ్రీనివాస్, ఎగినాటి మాధవరావు, మానుకొండ రవి కిరణ్, కొత్త యాకేష్, కూరాకుల గోపీ, జానీపాష, తాళ్ళూరి రమేష్, పెండ్ర అంజయ్య, రాంపుడి నాగేశ్వరరావు, కొమెర వెంకటేశ్వర్లు, మధుశ్రీ, సంజీవరావు, సుభాన్, మాధవరావు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకనంలో మోడల్ స్కూల్ టీచర్లకు ప్రాధాన్యత ఇవ్వండి

ఇంటర్ బోర్డు కార్యదర్శికి టీఎంఎస్టీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)లో మోడల్ స్కూల్ టీచర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం అధ్యక్షులు భూతం యాక మల్లు, సహ అధ్యక్షులు బి ధనుంజయ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 ఏండ్ల అనుభవం ఉందని తెలిపారు. వారికి చీఫ్ ఎగ్జామినర్ (సీఈ), సబ్జెక్టు నిపుణులు (ఎస్ఈ), చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో) విధులను కేటాయించాలని కోరారు. ఈ విధుల కేటాయింపులో మోడల్ స్కూల్ టీచర్లకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి స్పందించి సీఈ, ఎస్ఈ నియామకంలో మోడల్ స్కూల్ టీచర్లకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ)కి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ చెల్లించండి : టీఆర్టీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావును సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. గతేడాది రెమ్యూనరేషన్‌ను చెల్లించని జిల్లాలకు వెంటనే నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ ఏడాది స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్‌ను స్పాట్ ముగిసిన వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెండింగ్ రెమ్యూన రేషన్‌కు సంబంధించి వారం రోజుల్లో చెక్కులను జారీ చేస్తామని సంచాలకులు కృష్ణారావు హామీ ఇచ్చారని తెలిపారు.

గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించండి

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల్ని ఎంపిక చేయండి : అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ఇందిరమ్మ ఇండ్ల కోసం జనవరి మూడవ వారంలో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనవరి 26వ తేదీన మోడల్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేసిన 562 గ్రామాల్లో ఎదురైన పరిస్థితులు, సమస్యలను అంచనావేసి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా అనర్హులని తేలితే వాటిని రద్దుచేస్తామని ప్రకటించారు.ఇండ్ల కోసం దరఖాస్తు చేసిన సమయంలోనే వారి అర్హతలను నిర్ధారించి, అనర్హులు లబ్దిదారుల జాబితాల్లో చేరకుండా ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలని చెప్పారు. అనర్హులకు ఇండ్లు ఇచ్చామనే చెడ్డ పేరు ప్రభుత్వానికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యవసాయ మహిళా కూలీలకు సమానవేతనమివ్వాలి

పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి : వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు పురుషులతో సమానంగా వేతనం చెల్లించాలనీ, రోజు కూలి ఎనిమిది వందలకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ జవహర్ నగర్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అంబాల స్వరూప అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారనీ, దీనికి ఆహార భద్రత లేకపోవడమే కారణమని చెప్పారు. తెల్ల రేషన్ కార్డుదారులందరికీ 14 రకాల సరుకులివ్వాలని కోరారు అర్హత కలిగిన వాళ్ళందరికీ తెల్ల రేషన్ కార్డులివ్వాలని విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు వడ్డీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12 వేల రూపాయలు మహిళలందరికీ రూ. 2500, సబ్సిడీ గ్యాస్, ఉచిత కరెంటు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్వరూప(హన్మకొండ), సుజాతబేగం(సంగారెడ్డి), నాగమణి(మెదక్), పోచమ్మ, శంకుతల(ఆదిలాబాద్), తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న లాలిత్య అనే బాలిక అనుమానాస్పదంగా మరణించిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినిలు చనిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలంటూ అనేక ఏండ్లుగా కోరుతున్నా పాలకులు స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 14 నెలల కాలంలో ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నివారణ కోసం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యారంగాన్ని సమీక్ష చేసి సమస్యలను పరిష్కరించడం లేదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో చనిపోయిన లాలిత్య మరణంపై సమగ్ర విచారణ జరిపించాలనీ, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

20న రానూ నాయక్ వర్ధంతి సభలు

గోడ పత్రిక విడుదల చేసిన టీజీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, జాటోత్ రానూ నాయక్ 76వ వర్ధంతి సభలను ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా జరపనున్నట్టు తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) తెలిపింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు జి రాములు, భూపతి వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం హైదరాబాద్ నగర నాయకులు ఆంగోత్ కృష్ణా నాయక్, ఎం గోపి నాయక్, శ్రీను నాయక్ తదితరులు గోడ పత్రికను విడుదల చేశారు. జనగాం తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి, వుసుకూరు రాఘవరావు, కడారి నరసింహారావు, బాబూదొర తదితర భూస్వాములకు వ్యతిరేకంగా రానూ నాయక్ పోరాడారని తెలిపారు. రజాకార్ల అండతో ప్రజలపై సాగిన దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు.

'సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ '

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పదవులు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతున్నాయని తెలిపారు. మొదట వచ్చిన ఎమ్మెల్సీల్లో రెండు బీసీ, ఒకటి మైనార్టీకి, రెండు రాజ్యసభ సీట్లతో ఒకటి బీసీకి, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి మూడు వస్తే ఒక ఎస్టీ, ఒక ఎస్సీ, ఒక బీసీ మహిళకు ఇచ్చినట్టు తెలిపారు.

భగత్ సింగ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలి

- ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి
- ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

భగత్ సింగ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ-డీవైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీల ఆధ్వర్యంలో ఓయూలో సీ గ్రౌండ్‌లో హైదరాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌ను సోమవారం రిజిస్ట్రార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్ సింగ్ లాంటి యువకిశోరాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్లాలని సూచించారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. భగత్ సింగ్ త్యాగం గొప్పదని, చెరసాలలు ఉద్యమాలను ఆపలేవని.. ఆ తెగువతో విద్యార్థి, యువత సమాజ అభివృద్ధి కోసం ఉద్యమించాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. కొండ నాగేశ్వర్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ జీవితాన్ని విద్యార్థులు చదవాలని, ఆయన స్ఫూర్తితో పోరాటాలు చేయాలని చెప్పారు. మతం, కులాలతో ప్రజలను విభజించే రాజకీయాలను యువత వ్యతిరేకించాలన్నారు. నార్త్ రాష్ట్రాలలో మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని, భగత్ సింగ్ చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నిర్వహిస్తున్న ఈ క్రీడలు జయప్రదం కావాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యారంగం, సమాజాభివృద్ధి కోసం పోరాటాలు చేయాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. యువతను మత్తులో ఉంచాలని పాలకవర్గాలు అనుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యలో అసమానతలపై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొ.రాజేష్ నాయక్, ప్రొఫెసర్ డిప్లా, సీఐటీయూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావేద్, సీఐటీయూ రాష్ట్ర యూనివర్సిటీస్ బాధ్యులు మహేందర్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ రమ్య, నాయకులు స్టాలిన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ ఫీడర్ల పర్యవేక్షణ

- టీజీఎస్పీడీసీఎల్‌లో ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం : సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఫీడర్లలో సాంకేతిక మరమ్మతులు ఏర్పడితే, వాటిని గుర్తించి, సరిచేయడం కష్టంతో కూడిన వ్యవహారం. దాన్ని అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీసీఎస్పీడీసీఎల్) పరిధిలో ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టంను అమల్లోకి తెచ్చారు. తొలి దశలో 11కేవీ ఫీడర్లలో ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ వెల్లడించారు. ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం టెక్నాలజీ ద్వారా ఫీడర్‌లో దెబ్బతిన్న, లోపం గల ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తిస్తారు. దీనికి జీఐఎస్ డేటాను అనుసంధానం చేసి, సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కు 'సాసా' యాప్ ద్వారా బజర్ సౌండ్ వస్తుంది. దీనితో విద్యుత్ అధికారులు అప్రమత్తం అవుతారు. మరమ్మతు బృందాలు లోపం జరిగిన ప్రాంతానికి సకాలంలో చేరుకొని విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడతాయి. దీనికి రియల్ టైంను జోడిస్తారు. దీనివల్ల డిస్కం పరిధిలోని మొత్తం 8621 (జీహెచ్ఎంసీలో 3412, గ్రామీణంలో 5209) 11 కేవీ ఫీడర్లలో ఈ టెక్నాలజీని అనుసంధానం చేస్తారు. తొలి దశలో 4433 ఫీడర్ల పరిధిలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈనెలాఖను నాటికి మరో రెండువేల ఫీడర్లు, ఏప్రిల్ చివరినాటికి మిగిలిన ఫీడర్లలో ఈ సాంకేతికను అనుసంధానం చేస్తారు.

వత్తి చేసే వారందరికీ రక్షణ కవచం ఇవ్వాలి

- కేజీకేఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లుగీత కార్మికుల ప్రమాద నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కాటమయ్య రక్షణ కవచాలను వృత్తి చేసుకునే వారందరికీ ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) డిమాండ్ చేసింది. ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వృత్తిదారులను సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బోలగాని జయ రాములు, వెంకట నరసయ్య, భాల్నే వెంకట మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి చౌగాని సీతారాములు, బోయపల్లి సుధాకర్ , పరిదుల భాస్కర్ సోమవారం పరామర్శించారు. జనగామ జిల్లాకు చెందిన బాల్నే శ్రీనివాస్, గోడిశాల శ్రీనివాస్, తీగల పరశురాములు అక్కడ చికిత్స పొందుతున్నారు. వీరికి రక్షణ కవచం ఇచ్చి ఉంటే ఈ ప్రమాదాలు జరిగి ఉండేవి కాదని సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో గోవింద్ అనే గీత కార్మికుడు రక్షణ కవచం వాడడంతో చెట్టు పైనుండి జారినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం వృత్తి సీజన్ నడుస్తోంది కాబట్టి.. చాలామంది తాటి చెట్టు పైనుంచి జారి పడుతున్నారని తెలిపారు. సీఎం చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించి 9 నెల్లయినా రక్షణ కవచాల పంపిణీ నత్తనడక నడుస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 18 వేల మందికి మాత్రమే ఇచ్చారనీ, ఇంకా 2 లక్షల మందికిపైగా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 360 మంది చెట్టుపై నుండి జారిపడ్డారనీ, 42 మంది చనిపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గీత కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనీ, లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఫిబ్రవరి జీతం తక్షణమే ఇవ్వాలి :తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్

నవతెలంగణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు పది నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలనీ, ఫిబ్రవరి జీతం వెంటనే ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటడంతో టీచర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మినీ టీచర్లకు పది నెలల వేతనం పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొందని వాపోయారు. ప్రతి నెలా ఒకటో తేదీనే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనాలు ఇచ్చే విధానాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మార్చి నాలుగో తేదీన ప్రజావాణిలో ఇదే అంశంపై వినతిపత్రమిస్తే వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లిస్తూ జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చారనీ, ఇప్పటి వరకూ జీవో విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల బాధల్ని గుర్తించి వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీశ్‌రావు

మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు వడ్డీలు చెల్లించట్లేదన్న వ్యాఖ్యలకు ఖండన

- ఐదేండ్లలో రూ. 3485 కోట్లకుగానూ మీరు ఇచ్చింది రూ.409 కోట్లే
- మహిళా సంక్షేమం మీద మాట్లాడే అర్హతలేదు : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు చేసిన అన్యాయాన్ని అసెంబ్లీ సాక్షిగా బయటపెడతామని హెచ్చరించారు. మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు ప్రజా ప్రభుత్వం వడ్డీలు చెల్లించడం లేదన్న ఆయన వ్యాఖ్యలను ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వ బండారాన్ని బయటపెడతానని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పరేడ్ గ్రౌండ్లో మహిళా సభ విజయవంతమైందనే కడుపు మంటతో కండ్లలో నిప్పులు పోసుకుని హరీశ్‌రావు అబద్ధాలను వల్లెవేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేండ్లలో మహిళా సంఘాలకు వడ్డీ కింద రూ.3,485 కోట్లకుగానూ కేవలం రూ.409 కోట్లు మాత్రమే చెల్లించి రూ.3075.31 కోట్లను ఎగ్గొట్టిన విషయాన్ని ఎత్తిచూపారు. హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా చివరి మూడేండ్లలో మహిళా సంఘాల వడ్డీల కోసం నయాపైస చెల్లించలేదని ఆధారాలను చూపెట్టారు. వేల కోట్ల వడ్డీలు చెల్లించకుండా మహిళలను మోసం చేశారని విమర్శించారు. ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసుకున్న అభయహస్తం డబ్బులను దిగమింగిన చరిత్ర వారిదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక గత సంవత్సరా నికి సంబంధించి పూర్తిస్థాయిలో వడ్డీలు చెల్లించామని స్పష్టం చేశారు. ఈ ఏడాదికి సంబంధించి వడ్డీలు మహిళలకు చెల్లించే ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. గత ప్రభుత్వానికి భిన్నంగా మహిళా సంఘాల సభ్యులు ఎవరైనా మరణిస్తే ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు ఇస్తున్నామనీ, ఇప్పటివరకూ 400 మందికిగానూ రూ.40 కోట్లు చెల్లించామని వివరించారు. మహిళా సంఘాల పట్ల ఇది ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధి అని నొక్కి చెప్పారు. సంఘాల గురించి, మహిళా సంక్షేమం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలు 10 మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారని తెలిపారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని మహిళలను కోటీశ్వరులు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఆర్థిక చేయూత అందించి మహిళలను ఎన్నో వ్యాపారాల్లో ప్రోత్సహిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం మాత్రం మహిళా సంఘాలకు ఏం చేయకుండా తెలంగాణ ఆడబిడ్డగా ఒక్క కవితనే చూపెట్టారనీ, బతుకమ్మ వేడుకలైనా, బీసీ ఉద్యమమైనా, మహిళా ఉద్యమమైనా కవితే హైజాక్ చేశారని విమర్శించారు. ఈ విషయం మహిళలందరికీ తెలుసునన్నారు. వడ్డీ లేని రుణాలు ఇవ్వట్లేదనీ, మహిళలు అప్పుల పాలవుతున్నారని మొసలి కన్నీరు కార్చడం ఆపాలని హరీశ్‌రావుకు హితవు పలికారు.

ఉమెన్ హెల్ప్‌లైన్ కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీతక్క

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉమెన్ హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌ను మంత్రి సీతక్క సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. డయల్ 181 కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫోన్‌కాల్ ను స్వయంగా ఎత్తి మాట్లాడారు. "నా భర్త వేధిస్తున్నాడు. నాతో ఇద్దరు పిల్లలను ఇంటి నుంచి గెంటేశారు" అంటూ దేవరకొండ నుంచి లలిత అనే యువతి సీతక్కకు ఫోన్‌ద్వారా మొరపెట్టుకున్నారు. బాధితురాలి సమస్యను మంత్రి సావధానంగా విన్నారు. తగిన సహాయం చేస్తామని భరోసానిచ్చారు. ఆందోళనకు గురికావొద్దని అభయమిచ్చారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు వచ్చి భర్తకు కౌన్సిలింగ్ ఇస్తారని హామీనిచ్చారు. ఫిర్యాదును పరిష్కరించాలని స్థానిక సఖి కేంద్రం అధికారులను ఆదేశించారు. ఉపాధిలో భాగంగా కాల్‌సెంటర్‌లో వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం విదితమే.

పంటలను కాపాడటమే ప్రభుత్వ కర్తవ్యం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- నీటి వనరులు చివరివరకు అందేలా చూడాలి
- విద్యుత్ సరఫరాకు డోకాలేదు
- క్షేత్రస్థాయిలో వాస్తవాలను ప్రపంచానికి వివరించాలి
- అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి : వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేతికొచ్చిన పంటను కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో అసత్య ప్రచారాలు ఎక్కువవు తున్నాయనీ, ఈ విషయంలో నీటిపారుదల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవాల ను ప్రజలకు సోదాహరణంగా వివరించాలని వారు ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తదితరులతో కలిసి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖాధికారులు, విద్యుత్ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానున్నందున ఆయా జిల్లాల అధికారులు సమన్వయంతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతాంగానికి తోడ్పాటునందిం చాలని సూచించారు. యాసంగి పంటకు సాగునీరును చివరికంటా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఇప్పటి వరకు ఎటువంటి అవాంతరాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

కాలువల నీటి సరఫరా అంశంలో ఎప్పటి కప్పుడు విద్యుత్ శాఖాధికారుల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిజనిజాలు తెలుసుకోకుండా పంటనష్టం గురించి జరుగుతున్న ప్రచారం సత్య దూరమన్నారు. బోర్లు ఎండిపోవడమో, మోటార్లు కాలిపోవడం వంటి పరిణామాలతో పంట నష్టం జరుగుతుందంటూ వస్తున్న అసత్య ప్రచారాన్ని రాజకీయంగా వినియోగించుకునేందుకు కొన్ని శక్తులు రంగంలోకి దిగాయని అన్నారు.

ఇటువంటి విషయంలో అధికారులు తక్షణమే రంగంలోకి దిగి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రబీ పంట విషయంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమగ్ర సమాచారం తెప్పిస్తున్నామని వివరించారు. అందులో భాగంగానే నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుని అన్నపూర్ణ సాగర్ నుంచి రంగనాయక సాగర్‌కు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయడంతోపాటు పంప్ హౌజ్‌ల మరమ్మతులు చేపట్టామని ఆమె చెప్పారు.

గద్దర్ తెలంగాణ చలనచిత్ర పురస్కారాలకు విధివిధానాలకు సీఎం ఆమోదం

- త్వరలో పురస్కారం నోటిఫికేషన్ విడుదల : దిల్ రాజు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గద్దర్ తెలంగాణ చలన చిత్ర పురస్కారాలకు సంబంధించిన విధివిధానాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారని తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మెన్ దిల్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పురస్కారాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు.

తక్షణమే దర్యాప్తు జరిపించండి

- 'వంటారా'కు జంతువుల తరలింపుపై వైల్డ్‌లైఫ్ ఆర్గనైజేషన్స్ ఆందోళన
- దక్షిణాఫ్రికా మంత్రికి లేఖ

న్యూఢిల్లీ : ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు గుజరాత్‌లో నెలకొల్పిన గ్రీన్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రీహాబిలేషన్ సెంటర్ లేదా వంటారా జూపార్క్‌ను ప్రధాని మోడీ ఇటీవలే ప్రారంభించారు. వాటికి సంబంధించిన పలు ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకున్నారు. ఇందులో పలు రకాల జంతువులు కనిపించాయి. దక్షిణాఫ్రికా నుంచి చిరుతలు, పులులు, సింహాలను వంటారా జూపార్క్‌కు తరలించటంపై దక్షిణాఫ్రికా వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్స్ సమూహం ప్రశ్నలు లేవనెత్తుతున్నది. దీనిపై దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు ది వైల్డ్‌లైఫ్ ఎనిమల్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆఫ్ సౌతాఫ్రికా (డబ్ల్యూఏపీఎఫ్ఎస్ఏ).. దక్షిణాఫ్రికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్రీ, ఫిషరీస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (డీఎఫ్ఎఫ్ఈ), సౌతాఫ్రికా సైట్స్(కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ అండ్ ఫ్లోరా) మేనేజ్‌మెంట్ అథారిటీతో పాటు చైర్ ఆఫ్ సైంటిఫిక్ అథారిటీ సౌతాఫ్రికా లేఖ రాసింది. వంటారాలో రెండువేలకు పైగా జాతులు, 1.5 లక్షలకు పైగా రక్షించబడిన, అంతరించి పోతున్న జంతువులు ఉన్నాయి. వంటారాకు దిగుమతి అవుతున్న వివిధ రకాల వన్యప్రాణుల జాతులకు సంబంధించి సైట్స్‌లో చట్టబద్ధమైన ఆందోళనలు లేవనెత్తబడ్డాయని డబ్ల్యూఏపీఎఫ్ఎస్ఏకు తెలుసని దక్షిణాఫ్రికా అటవీ, మత్స్య, పర్యావరణ మంత్రి డియోన్ జార్జ్‌కు రాసిన లేఖలో సదరు సంస్థ పేర్కొన్నది. దక్షిణాఫ్రికాలోని సౌకర్యాలలో గణనీయమైన సంఖ్యలో క్యాప్టివ్-బ్రీడ్ నమూనాలు వాణిజ్య ప్రయోజనాల కోసం వర్తకం చేయబడి, చేయబడుతున్నాయని తాము భావిస్తున్నామనీ, ఈ విషయంపై మంత్రి తక్షణమే దర్యాప్తు చేయాలని అభ్యర్థిస్తున్నట్టు వివరించింది.

ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షా ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షా ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు విడుదల చేసింది. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీ కోసం గతేడాది నవంబర్ 10న పరీక్ష నిర్వహించారు. అదే నెల 12న ప్రిలిమినరీ కీ విడుదల చేసి 14 వరకు అభ్యంతరాలను స్వీకరించింది. అన్నింటిని పరిశీలించి దానినే ఫైనల్ కీగా ప్రకటించింది. అభ్యర్థులు తమకొచ్చిన మార్కులను చూసుకోవచ్చు. అర్హులకు వెయిటేజీ పాయింట్స్ కలిపిన తర్వాత ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయనున్నారు.

పన్నులు తగ్గించమనొద్దు

- పరిశ్రమ వర్గాలతో మంత్రి నితీన్ గడ్కరీ



న్యూఢిల్లీ : పన్నులను తగ్గించాలని పారిశ్రామికవేత్తలు అడుగవద్దని రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితీన్ గడ్కరీ అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి గడ్కరీ మాట్లాడుతూ.. పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వానికి నగదు అవసరం అవుతుందన్నారు. వచ్చే రెండేండ్లలో భారత్‌లో రవాణ వ్యయాలు 9 శాతానికి తగ్గొచ్చన్నారు. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయకూడదన్నారు. ఒక్కసారి పన్నులు తగ్గిస్తే మరింత డిమాండ్ చేస్తారన్నారు. ఇది మానవ లక్షణం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నామని.. కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదని గడ్కరీ పేర్కొన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకొని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని.. ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో రవాణ ఖర్చు 14-16 శాతంగా ఉందని.. రాబోయే రెండేండ్లలో ఇది 9 శాతానికి తగ్గనుందన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా.. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతంగా ఉందన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. మూలధన పెట్టుబడిని పెంచడం ద్వారా భారతదేశం మరిన్ని ఉద్యోగాలను సృష్టించబోతుందన్నారు.

బిజినెస్

రూ.1.95 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు



ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి కాలంలో రూ.1.95 లక్షల కోట్ల విలువ చేసే వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఎగవేతలను గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ తొమ్మిది మాసాల్లో 25,397 ఎగవేత కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సోమవారం పార్లమెంట్‌కు తెలిపారు. గడిచిన ఐదేండ్లలో మొత్తంగా 86,711 కేసులను గుర్తించగా.. రూ.6.79 లక్షల కోట్ల ఎగవేతలు జరిగాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీసీ అత్యధికంగా 13,018 కేసుల్లో రూ.46,472 కోట్లకు సంబంధించిన పన్నులను ఎగవేసినట్టు గుర్తించామన్నారు. 2023-24లో రూ.20,582 కేసుల్లో రూ.2.30 లక్షల కోట్లు, 2022-23లో 1.32 లక్షల కోట్లు, 2021-22లో రూ.73,238 కోట్లు, 2020-21లో రూ.49,384 కోట్ల ఎగవేతలు జరిగాయన్నారు.

మార్కెట్లకు ఆఖర్లో నష్టాలు

- సెన్సెక్స్ 217 పాయింట్ల పతనం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం తీవ్ర ఒడిదుడుకు లను ఎదుర్కొన్నాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటాయి. సెన్సెక్స్ 74,475 పాయింట్ల వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 407 పాయింట్లు పెరిగి 74,741 గరిష్టానికి చేరింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి చోటు చేసుకోవడంతో 217 పాయింట్లు కోల్పోయి 74,115కు పడిపోయింది. ఓ దశలో 74,022 కనిష్టాన్ని చవి చూసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 92 పాయింట్లు తగ్గి 22,460 వద్ద ముగిసింది. ఇండస్ఇండ్ బ్యాంక్, జొమాటో, లర్సన్ అండ్ టర్బో, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు పవర్ గ్రిడ్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్ల్టే ఇండియా, ఐటీసీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్, గ్యాస్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు రెండు శాతం వరకు నష్టాపోయాయి. మార్చిలో ఇప్పటి వరకు రూ.15,502 కోట్ల విలువ చేసే ఈక్విటీలను విదేశీ సంస్థాగత మదుపర్లు తరలించుకుపోయారు.

నేటి నుంచి నథింగ్ ఫోన్ (3ఎ) అమ్మకాలు

న్యూఢిల్లీ: లండన్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ నథింగ్ తన నథింగ్ ఫోన్ (3ఎ) అమ్మకాలను మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. ఇవి ఫ్లిప్‌కార్ట్, విజయ్ సేల్స్, క్రోమా సహా అన్ని ప్రముఖ రిటైలర్ స్టోర్స్‌లో లభిస్తాయని ఆ సంస్థ పేర్కొంది. ఫోన్ (3ఎ) ధరను రూ.19,999గా, ఫోన్(3ఎ) ప్రో ధరను రూ.24,999గా నిర్ణయించినట్టు వెల్లడించింది.

ఎల్‌జీ స్మార్ట్‌టీవీల్లో 100 ఉచిత ఛానల్స్


న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తమ స్మార్ట్ టీవీల్లో 100కి పైగా ఛానల్స్‌ను అందిస్తున్నట్టు తెలిపింది. ఎలాంటి చెల్లింపులు లేకుండానే వినోదం, మ్యూజిక్, న్యూస్, కిడ్స్, లైఫ్‌స్టైల్ ఛానల్స్‌ను వీక్షించవచ్చని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీ హాంగ్ జు జియాన్ తెలిపారు. తమ వినియోగదారులకు మరింత వ్యక్తిగతమైన కంటెంట్‌ను తీసుకురావడానికి ఎల్‌జీ ఛానల్స్‌ను విస్తరించనున్నామన్నారు.

బయోఫాక్టర్, హైదరాబాద్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం

నవ తెలంగాణ - హైదరాబాద్



వ్యవసాయ రంగంలో నూతన పరిజ్ఞానాన్ని సమృద్ధి చేయడానికి బయోఫాక్టర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. నానోటెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, శాస్త్రీయంగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన ఈ ఒప్పందంపై యుఒహెచ్ రిజిస్ట్రార్ డా. దేవేష్ నిగమ్, బయోఫాక్టర్ సిఇఒ డాక్టర్ లక్ష్మీ నారాయణ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ బిజె రావు, పరిశోధన విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ సమ్రాట్ సాబత్, ఇతర అధ్యాపకులు హాజరయ్యారు. ఈ ఒప్పందంలో భాగంగా కొత్త నానోకణాల అభివృద్ధి, వివిధ రంగాలకు అనువైన, వినూత్న నానోకణాల రూపకల్పనపై పరిశోధన చేయనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా కచ్చితమైన పోషక సరఫరా, పర్యావరణహిత నానో కీటకనాశనాలు, బయోఫార్టిఫికేషన్ విభాగాల్లో కీలకమైన ఆవిష్కరణలు చేపట్టాలని ఇరు సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇది రైతులకు అధిక దిగుబడితో పాటు, తక్కువ వ్యయంతో మెరుగైన వ్యవసాయ ఉత్పత్తులను అందించేందుకు దోహదపడనుందని ఎల్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. రైతులను శక్తివంతం చేయడానికి, ప్రపంచ ఆహార భద్రతను మెరుగుపరిచేందుకు నానో టెక్నాలజీ వినియోగం కీలకమన్నారు.



హైదరాబాద్‌లో యమ్మీ బీ విస్తరణ

నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ కేఫ్ చైన్ అయిన యమ్మీ బీ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో తమ తొమ్మిదవ స్టోర్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. ఈ మైలురాయి బ్రాండ్ విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన ముందడుగు సూచిస్తుందని యమ్మీ బీ వ్యవస్థాపకుడు సందీప్ జంగాల పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి హైదరాబాద్‌లో 12 అవుట్‌లెట్‌లు, బెంగళూరులో 4, ముంబయిలో 4 అవుట్‌లెట్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తినడాన్ని ఒక ప్రమాణంగా మార్చాలనే తమ నిబద్ధతను బలోపేతం చేస్తోన్నామన్నారు.